ISSN : 0971-8729

# యోజన

సంపుటి : 46 సంచిక : 7 అభివృద్ధి మాసపత్రిక మే, 2018 ₹ 22



# పౌష్టికాహారం

**పోషణ్ అభియాన్-పోషకాహారలేమిపై నూతన యుద్ధం**

రాకేష్ శ్రీవాస్తవ

**అన్నం, సున్నం ఒకటి కాదు.....**

ప్రేమా రామచంద్రన్

**ప్రత్యేక వ్యాసం**

**పౌష్టికాహార భద్రతతో దేశ ప్రగతి**

యం.ఎస్. స్వామినాథన్

**విశిష్ట వ్యాసం**

**పౌష్టికాహార భారతావని**

శ్రీమతి శమిక రవి

**ఇంధన అభివృద్ధికి మౌలిక సదుపాయాల పెంపు**

డాక్టర్ హిరణ్మోయ్ రాయ్

**సమ్మిళిత ద్రవ్యసేవల విస్తరణ**

ప్రొఫెసర్ చరణ్‌సింగ్




## డిఫెక్స్‌పో 2018లో ప్రధానమంత్రి

రెండు సంవత్సరాలకొక సారి జరిగే నౌక, భూ, అంతర్గత భద్రతా విధానాల ప్రదర్శన ఏప్రిల్ 11 నుండి 14 వరకు చెన్నైలో జరిగింది. గతంలో దేశవ్యాప్తంగా ఇలాంటి ప్రదర్శనలు మొత్తం తొమ్మిదిసార్లు జరిగాయి. ప్రధానమంత్రి మోదీ ప్రారంభించిన ఈ ప్రదర్శన భారత రక్షణ సంసిద్ధతను ప్రపంచానికి తెలియ చెప్పింది. "ఉదయిస్తున్న రక్షణ ఉత్పత్తి కేంద్రం" పేరుతో జరిగిన ఈ ప్రదర్శనలో 154 అంతర్జాతీయ సంస్థలతో సహా, మొత్తం 670 సంస్థలు పాల్గొన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు పాల్గొన్నాయి. టాటా; ఎల్&టి; కల్యాణ; భారత్ ఫోర్జ్; మహీంద్ర; ఎంకేయూ; డిఆర్‌డిఓ; హెచ్ఏఎల్; బిఈఎల్; బిడిఎల్; బిఈఎంఎల్; ఎండిఎల్; జిఆర్ఎస్ఈ; జిఎస్ఎల్; హెచ్ఎస్ఎల్; మిధాని; ఆర్డినెన్సు ఫాక్టరీలు; మరెన్నో ఇతర సంస్థలు మనదేశం నుండీ, లాక్ హీడ్ మార్టిన్; బోయింగ్ (అమెరికా); సాబ్ (స్వీడన్); ఎయిర్‌బస్, రఫాలే (ఫ్రాన్స్); రోసోంబోర్న్ ఎక్స్‌పోర్ట్స్, యునైటెడ్ షిప్పింగ్ (రష్యా); బిఏఈ సిస్టమ్స్ (యూకే); సీబత్ (ఇజ్రాయిల్); వర్ట్సీల (ఫిన్లెండ్); రోడ్ అండ్ ష్వార్జ్ (జర్మనీ) మొదలైన ప్రముఖ సంస్థలు బయటి దేశాల నుండి పాల్గొన్నాయి.

తన ప్రారంభ ఉపన్యాసంలో ప్రధాన మంత్రి – భారత్‌లో తయారీ, భారత్ కోసం తయారీల వ్యూహాన్ని అమలుచేయడానికి ఎప్పుడూ లేనంత అనుకూలత నేడు ఉన్నదనీ, మనం శాంతికి ఎంత కట్టుబడి ఉన్నామో, మన ప్రజల, ప్రాంతాల భద్రతకు కూడా అంతే కట్టుబడి ఉన్నామని అన్నారు. ఇందుకోసం మన రక్షణ దళాల సశక్తీకరణకు కట్టుబడి ఉన్నామనీ, అవసరమైతే, ఒక స్వతంత్ర రక్షణ పరిశ్రమల ప్రాంగణాన్ని కూడా ప్రారంభిస్తామని అన్నారు. రక్షణ దళాలకోసం ఒక సృజనాత్మక వేదికను ప్రారంభించామన్నారు. దీని అనుబంధంగా దేశ వ్యాప్తంగా రక్షణ సృజనాత్మక కేంద్రాలను ప్రారంభిస్తారు. తమ ప్రభుత్వం తీసుకున్న సంస్కరణ చర్యలను వివరిస్తూ ప్రధాని – రక్షణ తయారీ లైసెన్సులు, ఎగుమతి అనుమతులు, రక్షణ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు మరింత సులభతరం చేశామన్నారు. ■

ISSN : 0971-8729

మమ్మల్ని కలవండి: https://www.facebook.com/pages/Yojana-journal

e-mail : yojanatelugu@gmail.com e-mail : yojana.telugu@nic.in

మే, 2018 సంపుటి : 46 సంచిక : 7

# యోజన

1973 నుండి

ఆనోభద్రా క్రతవోయన్తు విశ్వతః
(ఉత్తమ భావాలు అన్నివైపుల నుండి రావాలి)

ముఖ్య సంపాదకులు : **దీపికా కచ్చల్**
సీనియర్ సంపాదకుడు : **విజయకుమార్ వేదగిరి**
సంపాదకుడు : **మహమ్మద్ సిరాజుద్దీన్**

దేశం ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక సమస్యలపై విస్తృత చర్చకు యోజన ఒక వేదిక. దీనికోసం ప్రభుత్వ విధానాలపై పరిశీలనకు వ్యాసాల రూపంలో వెసులుబాటు కల్పిస్తోంది. యోజన కేవలం ప్రభుత్వ వాణిని వినిపించే బాకా కాదు. ఈ మాస పత్రిక అస్సామీ, బెంగాలీ, ఇంగ్లీష్, గుజరాతీ, హిందీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళ్, తెలుగు మరియు ఉర్దూ భాషలలో ప్రచురించబడు తున్నది.

చీఫ్ ఎడిటర్ కార్యాలయం: రూం నెంబర్-660 సూచనాభవన్; సి.జి.ఓ. కాంప్లెక్స్; లోధీ రోడ్; న్యూ ఢిల్లీ-110 003. ఫోన్: 011-24362971.
ఈ-మైల్: yojanace@gmail.com:
వెబ్ సైట్: www.yojana.gov.in;
www.publicationsdivision.nic.in

యోజన ఇంగ్లీష్; రూం నెంబర్ 647; సూచన భవన్; సి.జి.ఒ. కాంప్లెక్స్; లోధీ రోడ్; న్యూ ఢిల్లీ-110 003.
సంయుక్త సంచాలకుడు (ప్రొడక్షన్) : **వి.కె. మీనా**

మా ప్రతినిధులు: ఆహ్మదాబాద్: శ్రీమతి అమిత మారు; బెంగుళూరు: కుమారి ఎస్. పునీత; చెన్నై: ఏ. ఇలంగోవన్; గువహాటి: ఆనుపమ దాస్; హైదరాబాద్: విజయకుమార్ వేదగిరి; కోల్ కత్తా: శ్రీమతి రమా మండల్; ముంబై: ఉమేష్ సదాశివరావు ఉజ్గరే; తిరువనంతపురం: శ్రీమతి కె. ధన్య సన్యాల్; జలంధర్: శ్రీమతి గగన్ దీప్ కౌర్ దేవగన్; భువనేశ్వర్ గిరీష్ చంద్ర దాస్.

**సూచన:** ఈ పత్రికలోని వివిధ వ్యాసాలలో వెలువరించిన అభిప్రాయాలు ఆయా వ్యాస కర్తలవే గానీ, ప్రభుత్వానివి కావు.
వ్యాసాలలో ఉపయోగించిన ఏ దేశానికి చెందినవైనా జెండాలు, మ్యాపులు కేవలం సూచనప్రాయమేగానీ, అధికార మ్యాపులను ప్రతిఫలించవు. చట్టపరమైన సూచికలు కూడ కావు.
ఈ పత్రికలో వచ్చే ప్రకటనలలోని నిజానిజాలను పాఠకులు ముందుగా నిర్ధారించుకోవలసిందిగా మనవి. వీటిలోని ఏ అంశానికీ యోజన బాధ్యత వహించదు.

**చందా:**
యోజన మాసపత్రిక ఏ భాషదైనా సంవత్సర చందా రూ. 230/- రెండు సంవత్సరాలకు రూ. 430/- మరియు మూడు సంవత్సరాలకు రూ 610/- విదేశాలకైతే ఇవే చందారేట్లతో పాటు, ఇండియా పోస్టు వారు నిర్ణయించిన ఎయిర్ మెయిల్ ఛార్జీలను చెల్లిస్తే చాలు.
**నూతన చందాలు, నవీకరణలు, ఫిర్యాదులకు సంప్రదించండి : యోజన (తెలుగు), రూం.నం. 205, సి.జి.ఒ. టవర్స్, కవాడిగూడ, హైదరాబాద్ - 80.**
ఫోన్ **040-27546313; 011-24367453** లేదా
**ఈ-మెయిల్: www.yojana_telugu@yahoo.co.in; www.pdjucir@gmail.com**

## ఈ సంచికలో...

1. పోషణ్ అభియాన్-పోషకాహారలేమిపై నూతన యుద్ధం
   - రాకేష్ శ్రీవాస్తవ.................5
2. అన్నం, సున్నం ఒకటి కాదు.....
   - ప్రేమా రామచంద్రన్ .........8
3. పౌష్టికాహార భద్రతతో దేశ ప్రగతి
   - యం.ఎస్. స్వామినాథన్.....12
4. పౌష్టికాహార భారతావని
   - శ్రీమతి శమిక రవి...........14
5. ఇంధన అభివృద్ధికి మౌలిక సదుపాయాల పెంపు
   - డాక్టర్ హిరణ్మోయ్ రాయ్.....18
6. సమ్మిళిత ద్రవ్యసేవల విస్తరణ
   - ప్రొఫెసర్ చరణ్‌సింగ్ .........24
7. విజ్ఞాన విపంచి
   - ప్రాతూరి పోతయ్య శర్మ......28
8. దర్పణం............................31
9. పౌష్టికాహారం - జాతీయాభివృద్ధి
   - డా॥ యమ్. గవరవరపు సుబ్బారావు
   - ఋషికేష్ పండా.....................34
10. వ్యవసాయ పురోగతితో పోషకాహార భద్రతను మెరుగు పరచగలమా?
   - ప్రొఫెసర్ ఆదుర్తి మృణాళిని..39
11. సామాజిక సమ్మిళిత చర్యలు - బలహీన వర్గాలకు చేయూత
   - వి. శ్రీనివాస్, ఐఏఎస్......42
12. తెలంగానం.........................46
13. ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు చేయూత
   - డాక్టర్ పుల్లయ్య దూదేకుల.....47
14. పౌష్టికాహారలోప వ్యాధులు - నివారణ చర్యలు
   - డా.కె. ప్రసాద్................50

**పేజీల సంఖ్య 56**

**Sales Emporia:** New Delhi: Soochna Bhawan, CGO Complex, Lodhi Road; New Delhi-110003 (Phone No: 011-24365610). Delhi: Hall No. 196; Old Secretariat; Delhi-110 054(Phone: 01123890205). Navi Mumbai: 701, B Wing, 07th Floor, Kendriya Sadan, Belapur-400 614 (Phone: 022-27570686). Kolkatta: 8, Esplanade East-700 069 (Phone:033-22486696). Chennai: 'A' Wing, Rajaji Bhawan, Basant Nagar-600 090 (Phone: 04424917673). Thiruvananthapuram: Press Road; Near Govt. Press-695 001 (Phone:0471-2330650). **Hyderabad: Room No. 204, Second Floor, CGO Towers, Kavadiguda-500 080 (Phone: 040-27535383).** Bengaluru: First Floor, 'F' Wing, Kendriya Sadan, Koramangala-560 034 (Phone:080-25537244). Patna: Bihar State Co-operative Building, Asoka Rajpath-800 004 (Phone:0612-2675823). Lucknow: Hall No.1, Second Floor, Kendriya Bhawan, Sector-H, Aligunj-226 024 (Phone: 0522-2325455). Ahmadabad: Ambica Complex, First Floor, Above UCO Bank, Paldi-380 007 (Phone: 079-26588669). Guwahati: House No. 4, Pension Para Road-781 003 (Phone:030-2665090).

ISSN : 0971-8729

# యోజన

చీఫ్ ఎడిటర్స్ డెస్క్

## సంపాదకీయం

### పౌష్టికాహారమే ప్రగతికి మూలం




జనాభా లెక్కలు 2011 ప్రకారం 1.2 బిలియన్ల జనాభా ఉన్న మనదేశం 2030 నాటికి 1.6 బిలియన్ల మంది ప్రజలతో అత్యధిక జనసంఖ్యతో రికార్డుల కెక్కుతుందని అంచనా! ప్రస్తుతం మొత్తం ప్రపంచ జనాభాలో 17 శాతం మనదేశంలోనే ఉన్నారు. కనుకనే, ఇంతమంది జనాభాకు ఆహారం, పౌష్టికాహార భద్రత ఒక పెద్ద సవాలు. దేశ ప్రగతికి కృషిచేయవలసిన వారు ఆరోగ్యంగా, పుష్టిగా ఉండటం అనివార్యం కదా! ఈ నిజాన్ని దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం ఆరోగ్య–పౌష్టికాహారాలకు ఎప్పుడూ అధిక ప్రాధాన్యాన్ని ఇచ్చింది. రాజ్యాంగం ఆర్టికల్ 47 ప్రకారం, "ప్రజారోగ్యాన్ని మరింత మెరుగు పరిచే విధంగా జీవన ప్రమాణాలను, పౌష్టికత ప్రమాణాలను మరింత పెంచడం ప్రభుత్వ ప్రధాన కర్తవ్యం కావాలి". ఆరోగ్య, ఆహార భద్రతకు ప్రాధాన్యతనివ్వడానికి భారత విధాన కర్తలు ఎప్పుడూ కృషిచేస్తూనే ఉన్నారు. కొన్ని గుర్తించిన ప్రాధాన్యతా ప్రాంతాలలో ఆహార భద్రతను, పౌష్టికాహార స్థాయిని పెంచడానికి పంచవర్ష ప్రణాళికలు తగిన నిధులను సమకూర్చి పునాది వేశాయి. సార్వజనీన ఆరోగ్య సౌకర్యాలను పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వం ఎప్పుడూ అధిక ప్రాధాన్యమిస్తూనే ఉన్నది. ఫలితంగా కరువు, తీవ్ర ఆహార కొరత అనేవి ఇక ఏ మాత్రం ఆహారభద్రతకు భంగం కలిగించే అంశాలు కావు. జనాభా అన్ని వర్గాలవారిలోనూ, పౌష్టికత స్థాయి పెరిగింది. పోషకాహార లేమి, సూక్ష్మ పోషకాల లేమి అనేవి సమస్యలుగా బాధించడంలేదు.

అయితే, మాతా–శిశువుల పౌష్టికాహార లేమి అనేది నేటి ప్రభుత్వానికి సైతం సవాలు విసురుతున్నది. 40 మిలియన్ల మంది పెరుగుదల లోపించిన తల్లులు, 17 మిలియన్ల పోషకాహారలేమీతో బాధపడుతున్న ఐదు సంవత్సరాలలోపు పిల్లలు మనదేశంలోనే ఉన్నారు. ఆహారం, ఇతర పోషకాలను సరిపడినంత తీసుకోకపోవడం వల్ల వచ్చే పోషకాహారలేమి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కుంగదీస్తున్నది. వివిధ ప్రాంతాలలో ఉండే ఆహార అసమానతలు, వివిధ ఆహార అలవాట్లు పోషకాహార స్థాయిల్లో ఒడిదుడుకులను కలిగిస్తుంటాయి. ఈ అసమానతలు పట్టణ ప్రాంతాలలో కన్నా, గ్రామీణ ప్రాంతాలలో ఇంకా ఎక్కువ. అందువల్ల, పౌష్టికాహార లేమిని నిర్మూలించడానికి ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క వ్యూహాన్ని అనుసరించాల్సివస్తున్నది. దీనికి చేసే వ్యయంలో కూడా, ప్రాంతానికీ, ప్రాంతానికి తేడా ఉంటున్నది.

జాతీయ పౌష్టికాహార పథకాన్ని ప్రకటించడంవల్ల, ఈ సమస్య పరిష్కారానికి గొప్ప ఊతమిచ్చినట్లయింది. ఈ కార్యక్రమ అమలులో నిమగ్నమై ఉన్న వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంస్థలు అన్నీ, ఒక కేంద్రీకృత అధికారం కింద పనిచేయడం ఈ లక్ష్యానికి నూతన జవాజీవాలనిచ్చింది. ఈ కార్యక్రమం దశలవారీగా అన్నీ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో అమలవుతుంది. ఈ లక్ష్య సాధనకు మూడు సంవత్సరాలకు రూ. 9,000ల కోట్లు కేటాయించారు. కేంద్ర, రాష్ట్ర, జిల్లా, స్థానిక స్థాయిల్లో ఒక వికేంద్రీకృత వ్యవస్థను ఏర్పాటు చేస్తారు. అన్నీ స్థాయిల్లో ఉత్తమ కృషిచేసిన కార్యకర్తలకు ప్రోత్సాహకాలను కూడా అందచేస్తారు. పెరుగుదల లోపం, పౌష్టికాహారలోపం, రక్తహీనత, శిశువులు తక్కువ బరువుతో పుట్టటం వంటి సంస్యలకు ఒక స్పష్టమైన పరిష్కారాన్ని ఈ పథకం ద్వారా అందచేస్తారు. ఇది దాదాపు 10 కోట్లకు పైగా ప్రజలకు మేలుచేస్తుందని అంచనా! మంచి ఆహార అలవాట్లు అంటే, మంచి ఆలోచనలు అనే అర్థం! దీని సాధనకు, భారీ స్థాయిలో ప్రభుత్వ తోడ్పాటు, ప్రజా స్పందన ప్రధానం. జాతీయ పౌష్టికాహార పథకం అన్నీ రాష్ట్రాలలోనూ, జిల్లాలలోనూ అంటే, 2017–18 లో 315 జిల్లాలలోనూ, 2018–19 లో మరో 235 జిల్లాలలోనూ, మిగిలినజిల్లాలోనూ మరుసటి సంవత్సరంలోనూ అమలుచేస్తారు. కావలసిందల్లా సమర్థమైన పర్యవేక్షణ మాత్రమే! బలమైన మానవ వనరులు ప్రాథమిక సౌకర్యాలు సమగ్రంగా అందుబాటులో ఉంటే, జాతి ప్రగతికి ఇతోధికంగా తోడ్పడుతారు. కనుకనే ఆరోగ్య భారతాన్ని సృష్టించేందుకు బలమైన ఆర్థిక, సాంఘిక సంక్షేమంకూడా అత్యంత ప్రధానమని ప్రభుత్వం నమ్మింది. స్వచ్ఛ భారత్, నైపుణ్య భారత్, డిజిటల్ ఇండియా వంటి కార్యక్రమాలు తోడైతే, ప్రపంచంలో మనదేశం అగ్రగామి కాగలదు. ■

# పోషణ్ అభియాన్-పోషకాహారలేమిపై నూతన యుద్ధం

- రాకేష్ శ్రీవాస్తవ

**పౌష్టికాహార లోపమనేది అనేక కారణాల వల్ల ఉత్పన్నమయ్యేది. ఆహార అలవాట్లు కూడా దీనికి ఒక కారణం. ఆసుపత్రిలోనే ప్రసవాలు, అందరికీ టీకాలు, స్వచ్ఛమైన తాగు నీరు, శుభ్రమైన పారిశుధ్య అలవాట్లు, విభిన్న రకాల పౌష్టికాహారాన్ని తీసుకోవడం, వంటి ఎన్నో అంశాలు దీనిని పరిష్కరిస్తాయి. కనుక, పిల్లలలో పెరుగుదల లోపం, తక్కువ బరువు వంటి సమస్యల పరిష్కారానికి బహుముఖ ప్రయత్నం అవసరం. జిల్లా జిల్లాకూ, అదే విధంగా ప్రతి రాష్ట్రానికి పోషకాహార ప్రమాణాలు మారుతున్నాయని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే తెలుపుతున్నది.**

పోషకాహారలేమి అనేది ఏదో ఒక కారణంగా కాక అనేక కారణాలవల్ల వచ్చేదని మనకు తెలుసు. ఈ కారణాలన్నీ, సమస్యను శాశ్వతం చేయడానికి తమవంతు పాత్రను నిర్వహిస్తుంటాయి. మనం ఆశించిన సమర్థవంతమైన మానవ వనరుల సృష్టికి ఆటంకంగా నిలుస్తుంటాయి. ప్రపంచంలో ఒక అగ్ర రాజ్యంగా కీలక పాత్ర నిర్వహించాలంటే, మన మానవ వనరులు బలంగా, పటిష్టంగా, తెలివిగా ఉండాలనేది నిర్ద్వందమ్. ఈ సమర్థత ఉంటే, మేక్ ఇన్ ఇండియా; డిజిటల్ ఇండియా; స్కిల్ ఇండియా వంటి పథకాల ప్రయోజనాలను ప్రజలకు సులభంగా అందించవచ్చు.

గత మార్చ్ 08న మన ప్రధానమంత్రి సమగ్ర పౌష్టికాహార పథకం పోషన్ అభియాన్‌ను రాజస్థాన్‌లోని ఝున్ ఝును జిల్లాలో ప్రారంభించారు. ఈ పథకంలోని ప్రత్యేకత ఏమిటంటే, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో అమలుచేయడం. పెరుగుదల మందగించిన పిల్లలు, కుపోషణతో కునారిల్లుతున్న పిల్లలు, రక్తహీనతతోఉన్న, తక్కువ బరువుతో పుట్టిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తారు. కౌమార బాలికలు, గర్భవతులు, పాలిస్తున్న తల్లులు మొదలైన వారందరికి ప్రత్యేక సేవలందిస్తారు. ఈ ప్రత్యేక వర్గాలన్నిటికీ సేవలను ఆధునిక సాంకేతికతను ఉపయోగించి




చిత్రం-1 పోషణ్ అభియాన్ పథకంలోని అంశాలు

కార్యదర్శి, కేంద్ర మహిళా & శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ.
E-mail : secy.wcd@nic.in




**చిత్రం-2 సమ్మేళనంలోని విభాగాలు**

అందచేస్తారు. సమాజంలోని అట్టడుగు వర్గాల నుండీ, ఆలోచనా ధోరణిని మార్చేందుకు ప్రయత్నం జరుగుతుంది. కార్యక్రమాన్ని సమగ్రంగా అమలుచేయడానికి అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, జిల్లాలలో దశలవారీగా అమలుచేస్తారు. 2017-18 లో 315 జిల్లాలు; 2018-19 లో మరో 235 జిల్లాలలో, మిగిలిన జిల్లాలలో 2019-20 లో అమలుచేస్తారు. పది కోట్లకు పైగా ప్రజలకు ఈ పథకం ప్రయోజనం అందుతుంది.

వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు వివిధ రకాల పోషణ ప్రోత్సాహకాలనందిస్తున్నాయి. అయితే ఈ యత్నాలన్నిటినీ ఒక వేదికనుండి కలిసికట్టుగా అమలుచేస్తే మరింత ప్రయోజనం కలుగుతుంది. పోషన్ అభియాన్ పథకాన్ని



ఇందుకోసమే రచించారు. దీనిని జాతీయ పోషకాహార సంస్థ అమలుచేస్తుంది. ఈ సంస్థ, సంబంధిత వివిధ రంగాలనుండి తీసుకున్న నిపుణు లతో కూడిన సంఘాలను రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో అట్టడుగు వర్గాల వారందరికీ ఈ పథక ప్రయోజనాలు అందే విధంగా పర్యవేక్షణకు నియోగిస్తుంది. గ్రామ స్థాయిలో పారిశుధ్య/ పోషకాహార దినోత్సవాలను నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పిస్తారు.

అంగన్వాడీ సిబ్బంది, మహిళా పర్య వేక్షకులకు స్మార్ట్ ఫోన్లను అందచేస్తారు. దీనిలో ప్రత్యేకంగా తయారుచేసిన యాప్‌ను ఉంచుతారు. ఈ యాప్ ద్వారా కార్యకర్తలు సమాచారాన్ని పై అధికారులకు అందచేసి నప్పుడు, సమాచారాన్ని నిజంగా ఎప్పుడు అప్లోడ్ చేశారు, ఎప్పుడు సేకరించారు వంటి వివరాలు కూడా అధికారులకు తెలుస్తుంది. ఈ సాంకేతికతా ప్రమేయం వల్ల కార్యక్రమాల అమలులో ఏవైనా ఆటంకాలుంటే, పై అధికారులకు వెంటనే తెలిసి,తగిన పరిష్కార చర్యలు చేపట్టటానికి వీలవుతుంది.

పౌష్టికాహార లోపమనేది అనేక కారణాల వల్ల ఉత్పన్నమయ్యేది. ఆహార అలవాట్లు కూడా దీనికి ఒక కారణం. ఆసుపత్రిలోనే ప్రసవాలు, అందరికీ టీకాలు, స్వచ్ఛమైన తాగు నీరు, శుభ్రమైన పారిశుధ్య అలవాట్లు, విభిన్న రకాల పౌష్టికాహారాన్ని తీసుకోవడం, వంటి ఎన్నో అంశాలు దీనిని పరిష్కరిస్తాయి. కనుక, పిల్లలలో పెరుగుదల లోపం, తక్కువ బరువు వంటి సమస్యల పరిష్కారానికి బహుముఖ ప్రయత్నం అవసరం. మొత్తం మీద సమాజం ఆలోచనాధోరణిని మారిస్తేనే సమస్య సులభంగా పరిష్కారమవుతుంది. దీనికి సమాజంలో సామూహిక ప్రయత్నం, ప్రసార మాధ్యమాల ద్వారా అవగాహన ఎంతో అవసరం. అంటే ఒక విధంగా పౌష్టికాహారం కోసం జన ఆందోళన జరగాలన్నమాట! మొత్తం కార్య క్రమం అమలు బాధ్యత మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖకు అప్పగించారు. గతంలో ఎప్పుడూ ఇంత సామూహిక యత్నం జరగలేదు. ఈ కార్యక్రమ అమలు ప్రగతిని ప్రతి ఆరు నెలలకూ ప్రధానమంత్రి కార్యాలయం స్వయంగా పర్యవేక్షిస్తుంది. ప్రతి జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ నెలలలో 10వ తేదీన జిల్లా స్థాయి సమీక్షా సమావేశాలు జరుగుతాయి. జిల్లా జిల్లాకూ, అదే విధంగా ప్రతి రాష్ట్రానికి పోషకాహార ప్రమాణాలు మారుతున్నాయని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే తెలుపుతున్నది. అద్భుతమైన ఫలితాలను ఆశించేముందు, మనం నిజాయితీగా కార్యక్రమ అమలులో విశేష ప్రతిభను చూపాలి. ఈ అభియాన్‌ను అమలు చేసే అట్టడుగు స్థాయి కార్యకర్తలకు తగిన ప్రోత్సాహకాలు ఉంటాయి. ఈ విధంగా పోషన్ అభియాన్ మనందరినీ ఒక మంచి ఉద్దేశ్యంతో భావితరాల సంక్షేమానికి ఒక తాటిపైకి తెస్తుంది. దీనిద్వారానే మొత్తం 130 కోట్లమంది ప్రజల పూర్తి శక్తి యుక్తులను దేశానికి వినియోగించుకోవచ్చు. ■




# అన్నం, సున్నం ఒకటి కాదు.....

- ప్రేమా రామచంద్రన్



**గత నాలుగు దశాబ్దాల్లో జరిపిన సర్వేల్లో-పోషకాహార లేమి, అంటురోగాల కారణంగా సంభవించే మరణాలరేటు, అనారోగ్యాలరేటు తగ్గుముఖం పట్టినట్లు తెలుస్తున్నది. కానీ గత రెండు దశాబ్దాలకాలంలో అధిక పోషకాహారాల స్థాయి, అంటువ్యాధులుకాని రోగాలు (ఎన్‌సిడి) పెరుగుతున్నట్లు తెలుస్తున్నది. పోషకాహారాలు ఎక్కువయితే ఆరోగ్యానికి జరిగే నష్టమేమిటో ప్రజలకుపూర్తి అవగాహన కలగడంలేదు. బడికివెళ్ళే వయసుకంటే ముందున్న శైశవ దశలోని పిల్లలు ఎక్కువగా పోషకాహారలేమికి, అనారోగ్యానికి గురయ్యే అవకాశాలుంటాయి. వీరిలో పోషకాహారలేమి.. అంటు వ్యాధులను ఆకర్షిస్తుంది.**

"అన్నమైతేనేమిరా, సున్నమైతేనేమిరా.. ఈపాడుపొట్టకు అన్నమే వేతామురా..." అన్నది తెలుగునాట, తెలుగువారి నోట బాగా నానిన ఓ పాతపాట. అది హాస్యోక్తిగా సాగినా ఈ పాట ఆకలిమీద ఉన్న వారి సగటు బలహీనతకు అద్దంపడుతుంది. కడుపులో ఎలుకలు పరుగెడుతున్నప్పుడు క్వాలిటీమీద ధ్యాసపోదు. ఏదిదొరికితే అది వేసి ఆ మంటను అప్పటికి చల్లారుద్దామనేది ఆ బలహీనత. అది భారతదేశంలోని అసంఖ్యాక నిరుపేదల నిస్సహాయతకూడా.

పుట్టి భూమ్మీదపడిననాటి నుంచీ తిరిగి ఈ మట్టిలో కలిసిపోయేవరకు ఏదో ఒకటి తింటే... ఆ రోజు వరకు గడుస్తుందేమో కానీ శరీరం మాత్రం సంపూర్ణంగా వికసించదు. మెదడుతోసహా అవయవాలన్నీ పూర్తిగా వృద్ధిచెందాల్సిన స్థాయిలో వృద్ధిచెందనప్పుడు – బతికినంత కాలం అది గతుకుల దారి మీద ప్రయాణమే అవుతుంది. అలాకాకుండా ఉండాలంటే– మనం తీసుకునే ఆహారం అన్ని పోషకాలతో సమతుల్యంగా సంపూర్ణ ఆహారంగా ఉండాలి. మరి మనం అలా తీసుకుంటున్నామా అన్నదానికి సమాధానమే ఈ వ్యాసం.

స్వాతంత్ర్యం వచ్చినప్పుడు పోషకాహార పరంగా దేశం రెండు ప్రధాన సమస్యలను ఎదుర్కొన్నది. ఒకటి– తీవ్ర దుర్భిక్షం, తత్ఫలితంగా ఎదురయిన ఆహారోత్పత్తుల తగ్గుదల, పంపిణీ వ్యవస్థ సరిగా లేకపోవడం. ఇక రెండవది–పేదరికం, తగినంత తినక పోషకాహార లేమి, క్షుద్బాధ, క్షామం తీవ్రస్థాయిలో ఉండడం, మరణాలు సంభవించడం, స్థానికంగా కూడా ప్రభావం కన్పిస్తూండడంతో పత్రికల్లో ఇతర ప్రచార సాధనాల్లో ఇది ప్రముఖంగా కనపడి పలువురి దృష్టిని ఆకర్షించింది. కానీ చాలినంత తినకపోవడం, పోషకాల లేమి అనే సమస్య నిజానికి చాలా విస్తారమైంది. క్షామంకంటే కూడా అన్ని వయసులలోనివారి అధిక మరణాలకు ఇది ఒక కారణం. కానీ ఈ సమస్య నిశ్శబ్దంగా ప్రభావంగా చూపేది కావడంతో దీని గురించి నిర్దిష్టంగా తెలిసింది చాలా తక్కువమందికి. అంతకంటే భయంకరమైన వాస్తవం– ఈ సమస్యల సుడిగుండంలో పుట్టిన వారి జీవితకాలం కేవలం 35ఏళ్లు మాత్రమే! మానవజాతి అభివృద్ధికి, దేశాభివృద్ధిలో మానవవనరుల పాత్రకు పోషకాహారం కీలకమని గుర్తించిన ఫలితంగా – 47వ అధికరణలో ఇచ్చిన ఆదేశిక సూత్రం మన ముందుకొచ్చింది. మన ప్రజలు తీసుకునే పౌష్టికాహార ప్రమాణాలు పెంచడం,

డైరెక్టర్, న్యూట్రిషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా, న్యూఢిల్లీ.
E-mail : premaramachandran@gmail.com

ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడం ప్రభుత్వాలు వాటి ప్రాథమిక బాధ్యతగా గుర్తెరగాలని ఈ సూత్రం నిర్దేశిస్తున్నది. అందువల్ల ప్రభుత్వాలు కూడా ఈ విషయంలో బహుళ వర్గాల ప్రయోజనాలకు, బహుముఖ వ్యూహాలకు ప్రాధాన్యమిస్తున్నాయి. ఆ తరువాత వచ్చిన పంచవర్ష ప్రణాళికలన్నీ - విధానాలను, వ్యూహాలను, కార్యక్రమాలను రూపొందించి, వాటికి అవసరమైన నిధులను కేటాయించి, నిర్దిష్ట కాలపరిమితిలోవాటి అమలుకు లక్ష్యాలను నిర్దేశిస్తూ పోయాయి. జాతీయ స్థాయి సర్వేల ద్వారా ప్రగతిని కూడా ఎప్పటికప్పుడు సమీక్షించడం జరుగుతున్నది.

గత నాలుగు దశాబ్దాల్లో జరిపిన సర్వేల్లో -పోషకాహార లేమి, అంటురోగాల కారణంగా సంభవించే మరణాలరేటు, అనారోగ్యాలరేటు తగ్గుముఖం పట్టినట్లు తెలుస్తున్నది. కానీ గత రెండు దశాబ్దాలకాలంలో అధిక పోషకాహారాల స్థాయి, అంటువ్యాధులుకాని రోగాలు(ఎన్‌సిడి) పెరుగుతున్నట్లు తెలుస్తున్నది. పోషకాహారాలు ఎక్కువయితే ఆరోగ్యానికి జరిగే నష్టమేమిటో ప్రజలకుపూర్తి అవగాహన కలగడంలేదు. అందుకే స్థూలకాయాన్ని అంతగా పట్టించుకోవడం లేదు. ఇక ఎన్‌సిడి లక్షణాలను తొలిదశలో గుర్తించడం కష్టం. ఆ లక్షణాల వల్ల సమస్యలు తలెత్తినప్పుడు మాత్రం ఆరోగ్యంపట్ల వారు శ్రద్ధ చూపుతున్నారు. “శరీరంలో కొవ్వు చేరితే తలెత్తే పరిణామాలపట్ల ప్రజలను చైతన్య పరచి దానికి తగిన వ్యూహాలు, కార్యాచరణ, అమలుపరచాల్సిన అవసరముంది.

**బడికెళ్ళడానికి ముందు దశలో...**

బడికివెళ్ళే వయసుకంటే ముందున్న శైశవ దశలోని పిల్లలు ఎక్కువగా పోషకాహారలేమికి, అనారోగ్యానికి గురయ్యే అవకాశాలుంటాయి. వీరిలో పోషకాహారలేమి.. అంటు వ్యాధులను ఆకర్షిస్తుంది. అంటురోగాలు సోకిన తరువాత పోషకాహారలేమి లక్షణాలను మరింత తీవ్రతరం చేస్తాయి. పోషకాహార లోపం ఉన్నప్పుడు అంటురోగాల తీవ్రత ఎక్కువగా ఉన్నా, అవి తరచూ వస్తున్నా అవి మరణానికి దారితీస్తాయి. అందువల్ల శైశవదశలోని పిల్లల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. సమగ్ర శిశి అభివృద్ధిపథకం (ఐసిడిఎస్)అలా ఉద్భవించిందే. పేదలు, నిరుపేదల పిల్లల ఆహారపు అవసరాలు, వాస్తవంగా వారు తింటున్న ఆహారం మధ్య తేడాలను తొలగించడమే దీని ఉద్దేశం. అలాగే పోషకాహార లేమిని గుర్తించడానికి పిల్లల బరువు తూచడం, తర్వాత వారి ఎదుగుదలలోపాలను సకాలంలో గుర్తించి సంబంధిత చర్యలు తీసుకోవడం. నిజానికి ఈ పథకాన్ని 70వ దశకంలో మొదలుపెట్టినా 2000 దశకంలో పూర్తిస్థాయి అమలుకు నోచుకున్నది. పథకం ఆరంభంనుంచీ పరిస్థితిలో మెరుగుదల ఉన్నప్పటికీ, 2015లో కూడా పరిస్థితి అంత అనుకూలంగా లేనట్లు జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-4 చూపుతున్నది.

**ఐసిడిఎస్ పరిధిలో లబ్ధిపొందినవారు**




ఐసిడిఎస్ పథకం అంత చురుగ్గా అమలు కాకపోయినా, బడికివెళ్ళే ముందుదశలోని పిల్లల్లో పోషకాల కొరత స్థితి నిలకడగా తగ్గుతూవచ్చిందని జాతీయ పోషకాహార పరిశీలనా కేంద్రం(ఎన్ఎన్ఎంబి) సర్వేలు సూచిస్తున్నాయి. అలాంటి పరిస్థితే 1990-2015 మధ్య కన్పించినట్లు ఎన్ఎఫ్ హెచ్ఎస్-2,3,4 నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇదేకాలంలో శిశు మరణాల సంఖ్య, ఐదేళ్ళలోపు పిల్లల మరణాల సంఖ్య కూడా తగ్గింది. ఐదేళ్ళలోపు పిల్లల మరణాల రేటు (యుఎంఆర్)కు అంటురోగాలే ప్రధాన కారణం. చికిత్స, టీకాలవంటి ఆరోగ్య సేవలు తగినంతగా అందుబాటులో ఉండే కార్యక్రమాల్లో మెరుగుదల, అంటురోగాల నివారణ, చికిత్స కారణంగా నిస్సత్తువలాంటివి తగ్గి,పోషకాల లేమి దుష్ఫలితాల నుండి రక్షణ దొరికింది. అంటే గత నాలుగు దశాబ్దాల కాలంలో పోషకాలకొరతను క్రమంగా తగ్గించడంలో ఆరోగ్యంపట్ల చూపే శ్రద్ధ ప్రధానపాత్ర పోషించినట్లు స్పష్టమవుతున్నది.

**బాల్యంలో ఉండాల్సిన పోషకాల స్థాయి...**

మనదేశంలో పిల్లలు ఎక్కువగా పుట్టినప్పటినుంచి పొట్టిగా ఉంటారు. బరువు తక్కువగా ఉంటారు. పిల్లల పెరుగుదలను ముందుగా తెలుసుకోవడానికి పుట్టినప్పటి శిశువు బరువు ఒక సూచికగా పనిచేస్తుంది. తక్కువ బరువుతో పుట్టిన పిల్లలు శైశవ దశలో, బాల్యంలో పెద్దయినతరువాత కూడా పెరుగుదల తక్కువగానే ఉంటుంది. దానివల్ల సగంమంది వరకు పిల్లలకు వృద్ధిమాంద్యం, బరువుతగ్గుదల అని రెండు తరగతులుగా వర్గీకరించారు. పోషకాలస్థాయి తెలుసుకోవడానికి మూడు సూచికలున్నాయి. అవి ఎత్తు, బరువు, శరీర ద్రవ్యరాశి (బిఎంఐ). ఈ మూడింటిలో

చివరిదయిన బిఎంఐ... పెద్దయిన తరువాత కూడా పోషకాల స్థాయిని తెలుసుకోవడానికి ఒక ప్రామాణికంగా ఉపయోగపడుతున్నది. అయితే బిఎంఐ విషయంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ రూపొందించిన ప్రమాణాలు 0-5 ఏళ్ళవయసుకు సంబంధించి 2006లో, 5-8 ఏళ్ళ వయసుకు సంబంధించి 2007లో మాత్రమే అందుబాటులోకి వచ్చాయి. వీటి ఆధారంగా విశ్లేషిస్తే ఐదేళ్ళలోపు పిల్లల్లో 18.4 శాతం మంది మాత్రమే పోషకాలలేమితో ఉన్నారనీ, 2.6 శాతం మంది అధిక పోషకాలతో ఉన్నారనీ తెలిసింది. **ఐదేళ్ళలోపు పిల్లలకు సంబంధించి మనం జరిపిన పరిశోధనలు బాల్యంలో, కౌమారంలో తక్కువ బరువున్న పిల్లలకు పెద్దయిన తరువాత బిపిలు, షుగర్ లక్షణాలు, కొవ్వుపెరిగే లక్షణాలు ఎక్కువగా ఉండొచ్చని హెచ్చరిస్తున్నారు.** భారతదేశంలోని పిల్లల్లో ఏ వయసులో బిఎంఐ ఎంత ఉండాలనే చైతన్యం పోషకాలు ఎంత ఉండాలనే అవగాహన చాలా తక్కువగా ఉంది. వయసునుబట్టి వేర్వేరు ఎత్తు, బరువున్న పిల్లలు బిఎంఐ ఎంత ఉండాలనే దాని ఆధారంగా వారి పోషకాల పరిస్థితిని సూచించే చిత్రాలు ఇలా ఉన్నాయి.



**తక్కువ బియంఐ (సన్నగా) ఎక్కువ ఆహారంతో అంటువ్యాధుల చికిత్స.**



**ఎక్కువ బియంఐ (లావుగా) శారీరక శ్రమ పెంచాలి.**



**సాధారణ బియంఐ**

## అంధత్వాన్ని తొలగించుకున్నాం

దేశంలోని నిరుపేదల్లో 1960వ దశకంలో ఆకలి, ఇంటిపట్టున ఆహార భద్రతలోపంవంటి సమస్యలు బాగా విస్తరించి ఉన్నాయి. పిల్లలకు సర్వసాధారణంగా అన్ని పోషకాలు అందేవి కావు. ఆకుపచ్చలేని, పసుపుపచ్చ ఉన్న ఆహారంతీసుకోవడంలో విటమిన్-ఎ లోపం సర్వత్రా కనిపిస్తూ ఉండేది. శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, మశూచి వంటివి ఎక్కువమంది సభ్యులుండే పెద్ద కుటుంబాల్లో తరచూ కనిపిస్తూండేవి. అంటురోగాల చికిత్సా యంత్రాంగం పట్టణ ప్రాంతాల్లో అరాకొరాగా ఉంటే, పల్లెప్రాంతాల్లో అసలు ఉండేది కాదు. దీనితో కెరాటో మలాసియా (కంటి శుక్లపటలం మెత్తపడడం) ఎక్కువగా కనిపిస్తూండేది. దీన్ని తప్పించుకున్న వారిలో పోషకాహారలోపం తాలూకు అంధత్వం ఉండేది. ఒకటి నుండి మూడేళ్ళలోపు పిల్లలకు విటమిన్-ఎ ను ఆర్నెల్లకొకసారి భారీగా (2లక్షల యూనిట్లు) ఇచ్చారు. దీనితో జెరోప్తాల్మియా 80 శాతం తగ్గింది. ఈ ఫలితాలతో స్ఫూర్తిపొంది విటమిన్-ఎ భారీ డోస్(ఎండివిఎఎస్)ను 1970లో 1-5 మధ్య వయస్కులైన పిల్లలకు ఇచ్చారు. అయితే ఇది కేవలం 10 శాతం ప్రాంతంలోనే అమలయింది. 80వ దశకంలో కెరాటోమలాసియా బాగా తగ్గుముఖం పట్టింది. ఆ తరువాత దశకంలో ఏ పెద్ద ఆస్పత్రిలోనూ దీనిజాడ కనపడలేదు. అయితే ఇప్పటికీ భారీడోస్‌ల (ఎండివిఎఎస్) కార్యక్రమం తక్కువస్థాయిలోనే ఉన్నా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య సదుపాయాలు బాగా మెరుగు పడ్డాయి. అంటురోగాలకు చికిత్స, టీకాలు, పోషకాల లేమి నివారణ చర్యలు ఊపందుకున్నాయి. కెరాటోమలాసియా పూర్తిగా నిర్మూలనకావడం అనేది పోషకాహార లక్ష్యాలలో ఆరోగ్యంపై చూపే శ్రద్ధకు నిదర్శనంగా నిలిచింది.

## అయొడైజ్డ్ ఉప్పు-ఆరోగ్యంపై ప్రభావం

అయోడిన్ లోపం వల్ల తలెత్తే అవ లక్షణాలు (ఐడిడి) కూడ ఒక పెద్ద ప్రజారోగ్య సమస్య అని భారత్‌లో 1920వ దశకంనుండి గుర్తించడం మొదలుపెట్టారు. మొదట్లో హిమాలయ ప్రాంతానికే ఈ సమస్య పరిమితమని తలచినా, తరువాత దేశంలోని ప్రతి రాష్ట్రంలో ఎక్కడో ఒక చోట ఇది ఉందని గుర్తించి 2007 నుంచి అయోడిన్ ఉపయోగాన్ని నిర్బంధం చేసి దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ప్రచారం కల్పించి అమలు జరిపారు.

తాగేనీళ్ళలో, నేలలో,ఆహారపదార్థాల్లో అయోడిన్ లోపిస్తే ఆయా ప్రాంతాలపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. గర్భస్రావాలు ఎక్కువవుతూ ఉంటాయి. అటువంటి తల్లులకు పుట్టిన పిల్లలకు బుద్ధిమాంద్యం ఉంటుంది. పెద్దల్లో అయితే హైపో థైరాయిడ్, గాయిటర్‌కు (గొంతుదగ్గర కణితి) దారితీస్తుంది. 2015 నాటికి దేశవ్యాప్తంగా 90 శాతం ఇళ్ళలో అయొడైజ్డ్ ఉప్పును వాడుతున్నారు.

## సమస్యకు మరో కోణం

పోషకాహారాలు ఎక్కువగా తింటే ఏమవుతుంది? శారీరక శ్రమలేకుండా అదేపనిగా ఎక్కువసేపు కూర్చుని ఉంటే ఏమవుతుంది?

గత మూడు దశాబ్దాలకుపైగా




**పురుషులలో అధిక పౌష్టికాహారం పోకడలు (ఎన్‌ఎన్‌యంబి సర్వే)**

యాంత్రీకరణ, సుఖమయజీవితం పెరిగి ఇంటాబయటా శారీరక శ్రమ తగ్గిపోతున్నది. ఈవేళ దేశంలో అత్యధిక సంఖ్యాకులు ఎదుర్కొంటున్న సమస్య ఊబకాయం. తీసుకునే ఆహారం తగ్గినా అది శ్రమరాహిత్యానికి తగిన దామాషా ప్రకారం ఉండడం లేదు. అంటే దానర్థం పోషకాహారం ఎక్కువవుతూ పోతున్నది. గత నాలుగుదశాబ్దాల్లో ఆడామగా అందరిలో ఇది కనిపిస్తున్నది. 1995-2012 మధ్య కాలంలో ఇది బాగా ఎక్కువగా ఉంది. మగవారిలో కంటే ఆడ వారిలో ఇది ఎక్కువగా కనిపిస్తున్నది. పెరుగుతున్న వయసును బట్టి కూడా ఇది పెరుగుతున్నది. దీన్ని ఆడవాళ్ళు చాలా తేలిగ్గా తీసుకుంటు న్నారు. కనీసం పోషకాహార నిపుణుల నుంచి సరైన సలహాలు కూడా తీసుకోవడం లేదు. దానితో వీరికి ఎన్‌సిడి, దాని తాలూకు లక్షణాలు సోకే అవకాశం ఎక్కువ. స్థూలకాయం తాలూకు సమస్యలు తగ్గించుకోవాలంటే-అధిక పోషకాలకు సంబంధించి స్త్రీ పురుషులు పరీక్షలు చేయించుకోవాలి. నిపుణులనుంచి సలహాలు తీసుకుంటుండాలి.

పోషక విలువలు సమతుల్యంగా ఉండాలంటే - 18.5 కంటే తక్కువ బిఎంఐ (శారీరక ద్రవ్యరాశి) ఉన్న వారు బరువు పెరగాలి. కానీ సాధారణ స్థాయిలో పోషకాలున్నవారు బరువు పెరగకూడదు. దానికి తగ్గట్టుగా పోషకాలస్థాయి ఎక్కువ ఉండకుండా జాగ్రత్తపడాలి. ఆరోగ్యం, పోషకాల స్థాయి సాధారణ స్థితిలో ఉంచుకోవడానికి శారీరక శ్రమ ఒక మోస్తరుగానయినా ఉండడం అవసరం. ఆరోగ్య సూత్రాలు ఏం చెబుతాయంటే - నడకలాంటి చేయదగిన శారీరక శ్రమ కనీసం రోజుకు 30 నిమిషాలుండాలని. ఇది పెద్దల్లో పోషకాలస్థాయి ఎక్కువగాకుండా, ఎన్‌సిడి రేటుపెరగకుండా చూసుకుంటుంది.

### బావి గుర్తొచ్చేది అప్పుడే !!!

గత రెండు దశాబ్దాలుగా పోషకాల స్థాయిపెరగడం, అంటువ్యాధికాని ఇతర వ్యాధులు (ఎన్‌సిడి) పెరిగి తీవ్రమైన ప్రజారోగ్య సమస్యలుగా నిలుస్తున్నాయి. **పోషకాల స్థాయి ఎక్కువయితే అప్పటికప్పుడు తలెత్తే సమస్యలేవీ కనపడవు కనుక అత్యధిక సంఖ్యాకులయిన భారతీయులు దానిని అసలు పట్టించుకోవడం లేదు. నిజానికి వాటి దుష్పరిణామాలు పోనుపోను తీవ్రరూపం దాలుస్తాయి. అందువల్ల దానిని నియంత్రించాలంటే జీవన శైలిని మార్చుకోవాల్సి ఉంటుంది. లేకపోతే జీవితాంతం మందులమీద బతకాల్సి ఉంటుంది.**

నిజానికి ఉత్తమమైన మార్గం ఏదంటే-అప్పుడప్పుడు పోషకాల స్థాయిని పరీక్షించుకుని వాటి నివేదికలను విశ్లేషించుకుంటూ ఉండాలి. మరీముఖ్యంగా పిల్లలు, కౌమార వయస్కులు, గర్భిణులు, పాలిచ్చే స్త్రీలు, వృద్ధులకు ఇది చాలా అవసరం. కానీ దురదృష్టం ఏమిటంటే-అటు ప్రభుత్వ యంత్రాంగంకానీ, ఇటు ప్రజలుకానీ ఇటువంటి పరీక్షలకు సిద్ధంగా లేరు. అందువల్ల దీనికి ముందుగా పూనుకోవాల్సి ఉంటుంది. వైద్యులు,పోషకాహారనిపుణులు కూడా ఈ మార్పు తేవడానికి కృషి చేయాలి. ఆరోగ్య సేవలు, పోషకాహార సమతుల్యత మధ్య సమన్వయం కుదిరితే ఆరోగ్యపరమైన సవాళ్లను ప్రజలు విజయవంతంగా ఎదుర్కోవచ్చు.




**మహిళలలో అధిక పౌష్టికాహారం పోకడలు (ఎన్‌ఎన్‌యంబి సర్వే)**

■

ప్రత్యేక వ్యాసం

# పౌష్టికాహార భద్రతతో దేశ ప్రగతి

- యం.ఎస్. స్వామినాథన్



పౌష్టికాహార భద్రతా రంగంలో తగినంత ఆహార లభ్యత, ప్రోటీన్ల లోపం, ఐరన్, జింక్, ఆయోడిన్, విటమిన్-ఎ వంటి సూక్ష్మ పోషకాల లోపం వంటి వాటి గురించి ఆలోచించాలి. అన్నింటికీ మించి, జీవ సమృద్ధి మొక్కలతో జన్యు తోటలను వృద్ధి చేసి ప్రపంచ వ్యాప్తంగా గ్రిడ్ తయారు చేస్తే దాగి ఉన్న ఆకలిని రూపుమాపడానికి తోడ్పడుతుంది. ప్రతి ఏటా సెప్టెంబర్ 1 నుంచి 7 వ తేదీ వరకు పౌష్టికాహార వారోత్సవాలను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పౌష్టికాహార లోపం వల్ల కలిగే దుష్ఫలితాల గురించి ముఖ్యంగా బాలబాలికలలో మెదడు అభివృద్ధి గురించి ప్రజలలో అవగాహన కలిగించవలసిన అవసరం ఉంది.

మన దేశంలో 1947 నుంచి ఆహార భద్రతను సాధించడం ప్రధాన లక్ష్యంగా ఉన్నది. ఎందుకంటే, పశ్చిమ బెంగాల్ లో ఏర్పడిన తీవ్ర కరువు ప్రభావం వల్ల ఆకలిని రూపుమాపడానికి అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలనే అవగాహన ఏర్పడింది. పౌష్టికాహార భద్రత గురించి ఆహార భద్రత చట్టం 2013లో ప్రత్యేకంగా ప్రస్తావించారు. మానవ జీవన క్రమంలో ఆహార, పౌష్టికాహార భద్రత కల్పించడం, ప్రజలకు సరసమైన ధరలో తగినంత పరిమాణంలో నాణ్యమైన ఆహారం అందించడం, ప్రజలు గౌరవంగా జీవించడానికి వీలుగా వ్యవసాయం, పౌష్టికాహారం, ఆరోగ్యరంగాలను సమగ్రంగా తయారు చేయడం వల్ల దీన్ని ఎలా సాధించవచ్చునో సంక్షిప్తంగా వివరిస్తాను. ఆహార, అనాహార అంశాలకు సమానమైన ప్రాధాన్యతను ఇవ్వాలి. ఇందుకోసం తీసుకోవలసిన చర్యల గురించి సంక్షిప్తంగా ఆహార భద్రత నుండి పౌష్టికాహార భద్రత దిశగా ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఒ)లో 1986లో నేను చేసిన ప్రసంగంలోను, నేను రాసిన పుస్తకం "గ్లోబల్ అఫెక్ట్స్ ఆఫ్ ఫుడ్ ప్రొడక్షన్"లలో కూడా ఆహార భద్రత నుండి పౌష్టికాహార భద్రత ప్రాధాన్యతలో మార్పు గురించి గట్టిగా చెప్పాను. పౌష్టికాహార భద్రత అంటే, "భౌతికంగా, ఆర్థికంగా, సామాజికంగా సమతుల ఆహారం, స్వచ్ఛమైన తాగునీటి లభ్యత, పారిశుధ్యం, ప్రాథమిక ఆరోగ్య రక్షణను అందుబాటులోకి తీసుకు రావడం"- ఇంకా పౌష్టికాహార భద్రతకు మందుల ఆధారిత విధానం కాకుండా ఆహార ఆధారిత విధానం ఉండాలని అన్నాను. ఇప్పుడు 30 సంవత్సరాల తరువాత పౌష్టికాహార భద్రత అంశం ప్రాధాన్యత సంతరించుకుంది. వ్యవసాయం, ఆరోగ్యం, పౌష్టికాహారం ఏ విధంగా అవినాభావ సంబంధం కలిగి ఉన్నాయో ప్రదర్శించాలని ఎమ్ఎస్ఎస్ఆర్ఎఫ్ భావిస్తోంది. పౌష్టికాహార భద్రతా రంగంలో తగినంత ఆహార లభ్యత, ప్రోటీన్ల లోపం, ఐరన్, జింక్, ఆయోడిన్, విటమిన్-ఎ వంటి సూక్ష్మ పోషకాల లోపం వంటి వాటి గురించి ఆలోచించాలి. నేను అభివృద్ధి చేసిన పౌష్టికాహారం కొరకు వ్యవసాయ విధానం (ఎఫ్ఎస్ఎన్) ద్వారా ఇటువంటి సంబంధాలను (linkages) సాధించడానికి వీలవుతుంది. అన్నింటికీ మించి, జీవ సమృద్ధి మొక్కలతో జన్యు తోటలను వృద్ధి చేసి ప్రపంచ వ్యాప్తంగా గ్రిడ్ తయారు చేస్తే దాగి ఉన్న ఆకలిని రూపుమాపడానికి సాధ్యంగా తోడ్పడుతుంది. తీవ్ర పౌష్టికాహార లోపం ఉన్న జిల్లాలు - మహారాష్ట్రలో థానే, ఉత్తర్ ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్, ఒడిశాలోని కోరాపుట్, తమిళనాడులోని కొన్ని ప్రాంతాల్లో ఆహార

వ్యవస్థాపక ఛైర్మన్, యం.ఎస్. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్, చెన్నై.
E-mail : swami@mssrf.res.in

ఆధారిత వ్యవస్థ సామర్ధ్యాన్ని రుజువు చేయాలని ఎమ్ఎస్ఎస్ఆర్ఎఫ్ భావిస్తోంది.

**జాతీయ పౌష్టికాహార వారోత్సవాలు:**

ప్రతి ఏటా సెప్టెంబర్ 1 నుంచి 7 వ తేదీ వరకు నిర్వహిస్తారు. పౌష్టికాహార లోపం వల్ల కలిగే దుష్ఫలితాల గురించి ముఖ్యంగా బాలబాలికలలో మెదడు అభివృద్ధి గురించి ప్రజలలో అవగాహన కలిగించవలసిన అవసరం ఉంది.

జీవ సమృద్ధి మొక్కలతో, జన్యు తోటల అభివృద్ధితో జాతీయ గ్రిడ్ ఏర్పాటుకు ఈ కార్యక్రమం దోహదపడుతుంది. పేద ప్రజలను పీడిస్తున్న పౌష్టికాహార సమస్యలకు వ్యవసాయ సంబంధిత సమాధానాలను కనుగొనడానికి ఇది తోడ్పడుతుంది. దేశ ప్రజల సంక్షేమం కోసం కార్యక్రమాన్ని ప్రారంభించడానికి జాతీయ పౌష్టికాహార వారోత్సవాలు తోడ్పడతాయి. ముఖ్యంగా పౌష్టికాహార లోపం వల్ల బాలల మెదడు అభివృద్ధికి కలిగే నష్టం పై అవగాహన కలిగించాలి.

**జాతీయ పౌష్టికాహార మిషన్‌ను విజయవంతం చేయడం**

కేంద్రం జాతీయ పౌష్టికాహార మిషన్ ను రాగల 3 ఏళ్లలో 9 వేల కోట్ల రూపాయల వ్యయంతో అమలు చేయాలని నిర్ణయించింది. పౌష్టికాహార లోపం వల్ల బాలలలో మేధాశక్తి క్షీణిస్తుంది. దీనిని నివారించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. పౌష్టికాహార మిషన్‌ను విజయవంతం చేయాలంటే సంబంధిత వర్గాల భాగస్వామ్యంతో ప్రాధాన్యతా అంశంగా రూపకల్పన చేయాలి. ఇందుకోసం బాధ్యతాయుతంగా జవాబుదారీ తనంతో వ్యవహరించే వ్యక్తిని ఈ పథకం సంచాలకునిగా నియమించాలి. గతంలో అమలు చేసిన మిషన్‌లు విజయవంతం కాలేదంటే దానికి కారణం ఈ పథకాన్ని పూర్తి స్థాయిలో నిర్వహించడంలో లోపాలున్నాయని అర్ధమవు తోంది.



పౌష్టికాహార మిషన్ ను విజయవంతం చేయాలంటే ఉదాహరణకు దిగువన పేర్కొన్న అంశాలను జోడించాలి.

- ఆహార భద్రతా చట్టంలోని నిబంధనలను సమర్ధవంతంగా వినియోగించడం ద్వారా పౌష్టికాహార లోపాన్ని అధిగమించడం. ధాన్యం, గోధుమలు సహా పలు రకాల చిరుధాన్యాలను సద్వినియోగం చేసుకోవడం.
- పప్పు ధాన్యాల ఉత్పత్తిని పెంచి పాలు, తదితర పౌల్ట్రీ ఉత్పత్తుల వినియోగం అధికంగా ఉండే విధంగా చూడాలి.
- సూక్ష్మ పోషకాల లోపం వల్ల కలుగుతున్న కనిపించని ఆకలిని జయించడానికి జీవ సమృద్ధి మొక్కలతో జన్యు తోటలను ఏర్పాటు చేయాలి.
- సమర్ధవంతమైన పంట నూర్పిడి నిర్వహణ విధానం ద్వారా ఆహార నాణ్యత, భద్రతను పరిరక్షించడం ముఖ్యమైన అంశం.

వీటికి తోడు రక్షిత తాగునీరు, పారిశుధ్యం, ప్రాథమిక ఆరోగ్య రక్షణ, పౌష్టికాహారం గురించి ప్రజలకు అవగాహన కలిగించాలి. ఇంకా వ్యవసాయ విశ్వవిద్యాలయాల సహకారంతో సమాజంలో పౌష్టికాహార లోపాన్ని రూపుమాప డానికి వ్యవసాయ నిపుణులకు తగిన శిక్షణను ఇప్పించి పౌష్టికాహార లోపాన్ని సరిదిద్దేలా చేయాలి. పౌష్టికాహార మిషన్ అమలులో నాణ్యత పెంచడానికి సరైన నియంత్రణా విధానం అవసరం. ఈ పథకం నామమాత్రం గానే కాకుండా, సమతుల పౌష్టికాహార సరఫరాకు భాగస్వాములందరి మధ్య సమన్వయంతో అమలు చేయాలి.

**జాతీయ పౌష్టికాహార మిషన్**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న ప్రధాన మంత్రి దేశంలోని 640 జిల్లాల్లో జాతీయ పౌష్టికాహార మిషన్‌ను ప్రారంభించారు. జాతీయ పౌష్టికాహార మిషన్ లక్ష్యాలను సాధించడానికి దిగువన పేర్కొన్న అయిదు అంశాలు ప్రధానమైనవి.

1. జాతీయ ఆహార భద్రతా చట్టం 2013లోని నిబంధనలను సమర్ధవంతంగా అమలు చేయడం ద్వారా కేలరీల లోపాన్ని అధిగమించడం.
2. పప్పు దినుసులు, పాలు, పౌల్ట్రీ ఉత్పత్తులను పెంచి వాటి వినియోగాన్ని పెంచడం ద్వారా ప్రోటీన్ల లోపాన్ని రూపుమాపవచ్చు.
3. సూక్ష్మ పోషకాల లోపం వల్ల కలిగే దాగి ఉన్న ఆకలిని అధిగమించడానికి జీవ సమృద్ధి మొక్కలతో జన్యు తోటలను ఏర్పాటు చేసి, పౌష్టికాహార కార్యక్రమానికి అనుకూలమైన వ్యవసాయ విధానాన్ని ప్రోత్సహించడం.
4. రక్షిత తాగునీరు, పారిశుధ్యం, ప్రాథమిక ఆరోగ్య రక్షణ అందుబాటులో ఉండేలా చూడాలి.
5. పౌష్టికాహార లోపాన్ని సరిదిద్దగలిగే పరిజ్ఞానమున్న సామాజిక ఆకలి నివారణ కార్యకర్తల సిబ్బందిని అభివృద్ధి చేయాలి.

పైన తెలిపిన అయిదు అంశాలను సమర్ధవంతంగా అమలు చేస్తే, మనం జాతీయ పౌష్టికాహార మిషన్ లక్ష్యాలను సాధించగలం.

■

విశిష్ట వ్యాసం

# పౌష్టికాహార భారతావని

- శ్రీమతి శమిక రవి



**భారత్ 2010 నాటికి ప్రపంచంలోనే అత్యధిక మంది చిన్నారులు పౌష్టికాహార లేమితో బాధపడుతున్న దేశంగా, అభివృద్ధి పథంలో ముందుకు పోవడానికి వెనుకాడుతోంది. దేశంలోని 121 మిలియన్ల (అయిదేళ్ల లోపు..) చిన్నారుల్లో 52 శాతం మంది పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. మన దేశం ఆర్థికాభివృద్ధి సాధించడానికి ఈనాడు ఎన్నడూ లేనంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో సమగ్ర ఆరోగ్య ప్రణాళికతో పౌష్టికాహారానికి ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు దేశాభివృద్ధికి శిశువులకు తొలి వెయ్యి రోజుల కాలంలో తగిన పౌష్టికాహారాన్ని అందించడం తప్పనిసరి.**

గత రెండు దశాబ్దాలుగా భారతదేశం గణనీయమైన స్థాయిలో ఆర్థిక, సామాజిక ప్రయోజనాలను సాధించినా, మాతా శిశు పౌష్టికాహార లోపం జాతీయ ఆరోగ్య సమస్యగా ఇప్పటికీ పట్టి పీడిస్తున్న నేపథ్యంలో దీనిపై ప్రస్తుత ప్రభుత్వం విధాన పరమైన ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంది. దేశంలో 40 మిలియన్ల మంది పిల్లలు వయసుకి తగ్గ ఎత్తు లేకపోవడం, 17 మిలియన్ల మంది అయిదేళ్ల లోపు చిన్నారులు తీవ్రమైన పౌష్టికార లోపంతో బాధపడుతున్నారు. గత పదేళ్లుగా పౌష్టికాహార లోపంపై ఆంత్రోపొమెట్రిక్ చర్యల ఫలితంగా మెరుగుదల కనిపిస్తున్నప్పటికీ, చిన్నారుల్లో పౌష్టికాహార లోపం ప్రపంచంలో భారత్‌లోనే ఎక్కువగా నమోదవుతోంది. పౌష్టికాహార లోపం వివిధ రాష్ట్రాల మధ్య వివిధ స్థాయిల్లో కనిపిస్తోంది. మాతా శిశు పౌష్టికాహార లోపాలను అధిగమించడానికి స్థానికంగా ఆరోగ్యపరమైన ప్రాధాన్యతలతో మానవ వనరులపై గరిష్టంగా వ్యయం చేయాల్సి ఉంటుంది.

జాతీయ పౌష్టికాహార పథకం (ఎన్ఎమ్ఎమ్) ప్రకటించడంతో ఈ రంగానికి అమిత ప్రాధాన్యత ఇచ్చినట్లుగా భావించాలి. దీని కోసం కేంద్రీకృత నోడల్ ఏజెన్సీని విస్తృతమైన ఆర్థిక వనరుల సమేతంగా ఏర్పాటు చేశారు. ఈ నోడల్ ఏజెన్సీ వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను సమన్వయం చేస్తూ, వాటికి అవసరమైన అదనపు ఆర్థిక వనరులను సమకూరుస్తుంది. దేశంలో పౌష్టికాహార లేమిని తరిమి కొట్టడానికి మరికొన్ని విధానపరమైన సంస్కరణలను తీసుకొని రావాల్సి ఉంటుంది.

విధానకర్తలు రెండు కీలక అంశాలను దృష్టిలో పెట్టుకోవాలి. (1) ప్రత్యక్షంగా పౌష్టికార లేమిని తొలగించడానికి వినియోగించే నిధుల ఫలితంగా వయస్సుకి తగ్గ ఎత్తు సమస్యలు కేవలం 20 శాతం మాత్రమే పరిష్కారం అవుతాయి. అదే పరోక్ష ఆర్థిక సహకారం ద్వారా (ఉదాహరణకి.. నీరు, పారిశుద్ధ్యం అందుబాటులో ఉండడం వంటివి) మిగిలిన 80 శాతం సమస్యలు పరిష్కారం అవుతాయి. (2) యాభై శాతం ఎదుగుదల సమస్యలున్న చిన్నారులలో రెండేళ్లప్పుడే ఈ సమస్య ఎదురు కావడానికి కారణంగా తల్లి గర్భంలో ఉన్నప్పుడు సరైన పౌష్టికాహారం అందుబాటులో లేకపోవడమేనని గుర్తించారు. శిశువు గర్భంలో పడిన నాటి నుంచి తొలి వెయ్యి రోజుల్లో తగిన పౌష్టికాహారం లేకపోవడం కారణంగా తిరిగి సరిదిద్దుకోలేని సమస్యలను చిన్నారులు ఎదుర్కొంటున్నారు. అందుకని ఈ అత్యంత కీలకమైన దశలో వనరుల వినియోగానికి

సభ్యురాలు, ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి – డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్, బ్రూకింగ్స్ ఇండియా సంస్థ.
E-mail : sravi@brookingsindia.org

విధానపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. తల్లి గర్భం దాల్చిన నాటి నుంచి శిశువుకు రెండేళ్ల ప్రాయం వరకు తగిన పౌష్టికాహారాన్ని సమకూర్చే దిశగా చర్యలు తీసుకోవాలి.

**కీలకమైన పౌష్టికాహార గణాంకాలు:**

భారతదేశంలో పౌష్టికాహార లేమి సూచికలు ప్రపంచ దేశాలతో పోల్చి చూస్తే 1990ల నుంచి అవి తిరోగమిస్తున్నప్పటికీ, ఇప్పటికీ అత్యధికంగానే ఉన్నాయి. ఇలా చాలా సూచికలు ఎన్ఎఫ్‌హెచ్ఎస్ గణాంకాల ప్రకారం చూస్తే ప్రోత్సాహకరంగానే ఉన్నాయి.

**పట్టిక 1: చిన్నారుల పౌష్టికాహార స్థితిగతులు**

| సూచికలు | శాతం |
|---|---|
| వయస్సుకి తగ్గ ఎత్తు లేని అయిదేళ్ల లోపు చిన్నారులు | 38.7 |
| పౌష్టికాహార లోపంతో తీవ్రంగా బాధపడుతున్న అయిదేళ్ల లోపు చిన్నారులు | 15.1 |
| తక్కువ బరువుతో ఉన్న అయిదేళ్ల లోపు చిన్నారులు | 29.4 |
| రక్తహీనతతో బాధ పడుతున్న 6 నుంచి 59 నెలలలోపు చిన్నారులు | 69.5 |

ఇక పురుషులతో పోల్చితే మహిళలలోనే పౌష్టికాహార లోపం ఎక్కువగా కనిపిస్తోంది.

**పట్టిక 2: మహిళలు, కిశోర బాలికల పౌష్టికాహార స్థాయి**

| సూచికలు | శాతం |
|---|---|
| రక్తహీనతతో బాధపడే గర్భిణీలు (15 నుంచి 49 సంవత్సరాల మధ్యలో) | 58.7 |
| పునరుత్పాదక సామర్థ్యమున్న మహిళల పౌష్టికాహార లోపం | 33.3 |
| మహిళలు (20 నుంచి 24 సంవత్సరాల మధ్యలో) 18 ఏళ్ల లోపు పెళ్లైవారు | 30.3 |
| గర్భందాల్చిన భారతీయ మహిళలు ఉండాల్సిన దానికన్నా తక్కువ బరువున్నవారు | 42.2 |

**పట్టిక 3: పౌష్టికాహారం- ఐసిడీఎస్, ఎన్ఆర్‌హెచ్ఎమ్ తీసుకున్న చర్యలు**

| సూచికలు | శాతం |
|---|---|
| ఐసిడీఎస్ కింద పౌష్టికాహారం అందుకున్న గర్భిణీలు | 40.7 |
| 36 నెలల శిశువులున్న తల్లులు ప్రసవానికి ముందు 3+ యాంటి నాటల్ చెకప్‌లు చేయించుకున్నవారు | 63.4 |
| 12 నుంచి 23 నెలల మధ్య ఉన్న చిన్నారులకు అందిన పూర్తిస్థాయి ఇమ్యునైజేషన్ | 65.3 |
| పెద్దవారి బరువు తూనికలు లేకుండా నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు | 48.4 |

జాతి జనుల ఆరోగ్యమే ప్రధానంగా అమలవుతున్న కేంద్ర ప్రాయోజిత కీలక పథకాలకు గత రెండేళ్లలో బడ్జెట్ కోతలు విధించారు. ఐసిడీఎస్‌లకు కేంద్ర నిధులను పదిశాతం వరకు అంటే 2015-16లో రూ.15,502 కోట్ల నుంచి 2016-17 ఆర్థిక సంవత్సరంలో రూ.14,000 కోట్లకు తగ్గించారు. ఇక కీలకమైన సౌకర్యాలను అంగన్‌వాడీ కేంద్రాలకు కల్పించాల్సి ఉండగా, (సగానికి పైగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పెద్దవారి బరువు తూచే యంత్రాలే లేవు), లక్షిత జనాభాకి తగిన పౌష్టికాహారాన్ని సమకూర్చాల్సిన అంగన్‌వాడీ కార్యకర్తలపై తగిన పర్యవేక్షణ కూడా ఏర్పాటు చేయాలి. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలులో భాగంగా అనుబంధ పౌష్టికాహారం కోసం ప్రజల భాగస్వామ్యాన్ని కూడా తీసుకోవాలి. క్షేత్రస్థాయిలో జరిగిన అధ్యయనా లలో పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడం ద్వారా పరిస్థితులు మెరుగుపడ్డాయని తెలుస్తోంది. దీనికి తోడు, మధ్యాహ్న భోజన పథకం కారణంగా పిల్లల అభ్యాసం స్థాయి కూడా మెరుగు పడింది.

పౌష్టికాహార స్థాయిలో రాష్ట్రాల మధ్య తేడాలు మరియు వయస్సుకి తగ్గ ఎత్తు సమస్యల తగ్గుదల:

**ప్రస్తుత విధాన రూపు రేఖలు**

కేంద్ర మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ అమలు చేసే ఐసిడీఎస్ పథకం వంటి ప్రముఖ ప్రభుత్వ పౌష్టికాహార పథకాలు, కేంద్ర

**పట్టిక 4: పౌష్టికాహార స్థాయిలో రాష్ట్రాల మధ్య తేడాలు:**

| పట్టిక | ఇండియా సగటు | సత్ఫలితాలు | హీన ఫలితాలు |
|---|---|---|---|
| వయస్సుకి తగ్గ ఎత్తు సమస్యలున్న చిన్నారులు అయిదేళ్ల లోపు.. | 38.8 శాతం | కేరళ: 19.4 శాతం | ఉత్తరప్రదేశ్ 50.4 శాతం |
| | | గోవా 21.3 శాతం | బీహార్ 49.4 శాతం |
| | | తమిళనాడు 23.3 శాతం | జార్ఖండ్ 47.4 శాతం |
| తీవ్రమైన పౌష్టికాహార లోపమున్న చిన్నారులు అయిదేళ్ల లోపు.. | 15.1 శాతం | సిక్కిం 5.1 శాతం | ఆంధ్రప్రదేశ్ 19.0 శాతం |
| | | మణిపూర్ 7.1 శాతం | తమిళనాడు 19.0 శాతం |
| | | జమ్మూ & కశ్మీర్ 7.1 శాతం | గుజరాత్ 19.7 శాతం |
| అయిదేళ్ల లోపు చిన్నారులు (తక్కువ బరువున్న వారు) | 29.4 శాతం | మణిపూర్ 14.1 శాతం | జార్ఖండ్ 42.1 శాతం |
| | | మిజోరం 14.8 శాతం | బీహార్ 37.1 శాతం |
| | | జమ్మూ & కశ్మీర్ 15.6 శాతం | మధ్యప్రదేశ్ 36.1 శాతం |

ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న ఎన్‌హెచ్‌ఆర్‌ఎమ్ కీలక భూమిక పోషిస్తున్నాయి. ఈ రెండు మంత్రిత్వ శాఖల కేంద్ర ప్రాయోజిత పథకాలు ఐసీడీఎస్ కింద అంగన్ వాడీలు ఎన్‌హెచ్‌ఆర్‌ఎమ్ కింద ఆశా వర్కర్లు లక్షిత గర్భిణీలకు, పాలిచ్చే తల్లులకు, శిశువులకు అవసరమైన పౌష్టికాహారాన్ని అందించడంలో క్రియాశీలకంగా ఉంటున్నారు.

ఈ కార్యక్రమాలకు తోడు పౌరసరఫరాల విభాగం (పీడీఎస్) కింద దేశంలోని అత్యధిక నిరుపేదలకు సబ్సిడీ కింద అందిస్తున్న ఆహార ధాన్యాలు పౌష్టిక పరిపుష్టికి దోహద పడుతున్నాయి. దీనికి తోడు, ఆరు రాష్ట్రాలకు పైగా, అందులో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఒడిశా, గుజరాత్, కర్ణాటక, ఇటీవల జార్ఖండ్ వంటి రాష్ట్రాలు పౌష్టికాహార పథకాలు ప్రవేశపెట్టాయి. తల్లి గర్భంలో పడిన నాటి నుంచి వెయ్యి రోజుల వరకు శిశువులకు అందించే పౌష్టికాహార వివరాలు పట్టిక 5లో పొందుపర్చడం జరిగింది.

జాతీయ పౌష్టికాహార పథకం (ఎన్ఎమ్ఎమ్) కోసం మూడేళ్లకుగాను అంటే 2017-18తో మొదలయ్యే ఆర్థిక సంవత్సరం నుంచి రూ.9,046.17 కోట్ల బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. జాతీయ పౌష్టికాహార పథకం కింద పౌష్టికాహార లేమిని పారద్రోలడానికి ఉద్దేశించిన వివిధ పథకాలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చారు. దీని కోసం అమిత వేగంగా పని చేసే ఐసీటీ ఆధారిత రియల్ టైమ్ మానిటరింగ్ సిస్టమ్‌ను తక్కువ ధరలకే రాష్ట్రాలకు అందించడం ద్వారా లక్షిత గ్రూపులకు ప్రయోజనాలు కలగనున్నాయి. అంగన్‌వాడీ గ్రూపులకు తక్కువ ధరలకే ఐటీ ఆధారిత పరికరాలను అందించడంతో రిజిస్టర్ల నిర్వహణ భారం తప్పింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఎత్తు కొలవడం, సామాజిక తనిఖీలు, పౌష్టికాహార వనరుల కేంద్రాల ఏర్పాటు, వివిధ కార్యక్రమాల ద్వారా పౌష్టికాహార లోపాన్ని అధిగమించడానికి ప్రజలను భాగస్వామ్యులను చేసే చర్యలు చేపట్టారు. దీనికి ఏర్పాటైన కేంద్ర నోడల్ ఏజెన్సీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను పర్యవేక్షిస్తుంది.

**విధానపరమైన సిఫార్సులు:**

దేశంలో పౌష్టికాహార సమస్యలు విసురుతున్న సవాళ్లను అధిగమించడానికి, ప్రస్తుతం అమలులో ఉన్న విధానాల అమలు కారణంగా సాధించిన ఫలితాలను మదింపు వేసుకుంటూ, ప్రత్యేక పౌష్టికాహార విధానాల రూపకల్పన కోసం దిగువ కొన్ని సిఫార్సులను ఇవ్వడం జరిగింది.

**1. ఐసీడీఎస్‌ని బలోపేతం చేయడం, పునర్నిర్మించడం, పీడీఎస్ అమలు:**

ఐసీడీఎస్‌ను మరింత క్రియాశీలకం చేయడం కోసం తగిన ఆర్థిక వనరులను అందించడంతో పాటు నిర్ణయాలు తీసుకొనే సంస్థగా తీర్చిదిద్దాలి. ఐసీడీఎస్ లక్ష్యాలను చేరుకోవడానికి అనుబంధ పౌష్టికాహారం, గర్భిణీలు, పాలిచ్చే తల్లులకు అందించే ప్రాథమిక ఆరోగ్య పరమైన అవగాహన, లక్షిత ప్రజలకు చేరాల్సిన పథకాలను మరింత మెరుగు పర్చడం, అంగన్ వాడీలకు సరైన శిక్షణ ఇవ్వడం ద్వారా అంగన్ వాడీ కేంద్రాల కార్యకలాపాలను క్రమబద్ధీకరించడం చేయాలి.

**పట్టిక 5: పౌష్టికాహార ప్రత్యేక పథకాలు (శిశువు తొలి 1000 రోజులకు సంబంధించి..)**

| లక్షిత గ్రూపు | పథకం | సమకూర్చిన సదుపాయాలు |
|---|---|---|
| గర్భిణీలు, పాలిచ్చే తల్లులు | ఐసిడీఎస్ | ఐసిడీఎస్: అనుబంధ పౌష్టికాహారం, డైట్, విశ్రాంతి, పాలివ్వడం, ఆరోగ్యం, పౌష్టికార విద్య ఇందిరాగాంధీ సహాయోగ్ యోజన షరతులతో కూడుకున్న మాతృత్వ ప్రయోజనాలు |
| | పునరుత్పత్తి శిశువుల | ఎన్ఆర్‌హెచ్ఎమ్: యాంటినాటల్ కేర్, ఐరన్ |
| | ఆరోగ్యం (ఆర్‌సిహెచ్-2) | సప్లిమెంటరీ, ఇమ్యునైజేషన్, జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం ఆసుపత్రి ప్రసవాలకు రవాణా సదుపాయం, ఆసుపత్రి ప్రసవాలు, నగదు ప్రయోజనాలు |
| | (ఎన్ఆర్‌హెచ్ఎమ్), జననీ | పోస్ట్ నాటల్ కేర్, తల్లి పాలు పట్టడం, పిల్లల మధ్యవిడం సురక్ష యోజన (జేఎస్‌వై) వంటి వాటిపై సలహాలు ఇవ్వడం |
| చిన్నారులు (0-3 సంవత్సరాలు) | ఐసీడీఎస్ | ఐసిడీఎస్: అనుబంధ పౌష్టికాహారం, పెరుగుదల పర్యవేక్షణ శిశు ఆరోగ్యంపై తల్లులకు తగిన రీతిలో ఆరోగ్య జాగ్రత్తలు శిశువు, చిన్నారులకు తల్లి పాలు పట్టడాన్ని ప్రోత్సహించడం ఇంటి వద్ద చిన్నారులకు జాగ్రత్తలు తీసుకోవడం, పౌష్టికాహార లేమి, అనారోగ్య సమస్యలపై స్పందించడం |
| | ఆర్‌సిహెచ్-2 | ఎన్ఆర్‌హెచ్ఎమ్: నవజాత శిశువుల సంరక్షణ కోసం ఇంటి వద్దనే ఎన్ఆర్‌హెచ్ఎమ్ ఏర్పాట్లు, ఇమ్యునైజేషన్, అనుబంధ సూక్ష్మ పౌష్టికాహారం, వైద్య జాగ్రత్తలు శిశువు తొలి నెలలో అనారోగ్యానికి గురైతే నగదు రహిత (క్యాష్ లెస్) చికిత్స, తీవ్రమైన పౌష్టికాహార లోపంతో బాధపడే చిన్నారుల సంరక్షణ. |
| | రాజీవ్‌గాంధీ నేషనల్ | రాజీవ్‌గాంధీ నేషనల్ క్రెచ్ స్కీమ్: పని చేసే తల్లుల చిన్నారులకు తోడ్పాటు క్రెచ్ స్కీమ్ అందించడం. |

**2. బలవర్ధక ఆహారాన్ని మరింత విస్తృతం చేయాలి.**

ఉప్పును ఐయోడైజ్ చేయటం వంటి పరిమితమైన రీతిలోనే ఆహారాన్ని పరిపుష్టం చేయడం జరుగుతోంది. అయితే, భారత ఆహార భద్రత మరియు ప్రమాణాల అథారిటీ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఆహార ధాన్యాలను పరిపుష్టం చేసే ప్రక్రియపై ముసాయిదా తయారు చేసే ప్రయత్నంలో ఉంది. తద్వారా మనం రోజువారీ తీసుకొనే సాధారణ ఆహారమే బలవర్ధకం కానుంది. దీంతో పాటు ఉప్పుకి ఐయోడైజేషన్‌తో పాటు ఐరన్‌ని కూడా జోడించే ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయి. ఇదే రీతిలో బలవర్ధకం చేసిన తినే నూనెలు కూడా తప్పనిసరి కానున్నాయి. వేడి చేసిన ఆహార పదార్థాలకు కూడ పరిపుష్టత జోడించడం తప్పనిసరి కానుంది. ఈ చర్యల కారణంగా తగిన కేలరీలు, సూక్ష్మ పౌష్టిక పదార్థాలు అయిదేళ్ల లోపు చిన్నారులకు విస్తృత స్థాయిలో అందడానికి దోహదపడతాయి.

**3. పౌష్టికాహార సమృద్ధికి తోడ్పడే ఇతర అంశాలు:**

దేశంలో కనిపించని ఆకలి విసిరే సవాళ్లను ఎదుర్కొనడానికి ప్రత్యక్షంగా అందించే పౌష్టికాహార పథకాలకు అవల కూడా కొన్ని చోదక శక్తులున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం 2014 నుంచి పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెడుతూ స్వచ్ఛ భారత్ అభియాన్ కార్యక్రమం ద్వారా మరుగుదొడ్లను దేశ వ్యాప్తంగా నిర్మిస్తోంది. అయితే మరుగు దొడ్ల నిర్మాణంతో పాటు ప్రజల ప్రవర్తన, అలవాట్లలో మార్పు తీసుకొని రావడంపైనా దృష్టి సారించాలి.

**4. పౌష్టికార లక్ష్య సాధన కోసం వ్యవసాయ విధానాలను కూడా కలుపుకోవాలి:**

పౌష్టికాహార విధానానికి, వ్యవసాయ విధానాన్ని అనుసంధానించాలి. స్థానిక వినియోగం కోసం పౌష్టికాహార బలవర్ధకమైన ధాన్యాల ఉత్పత్తికి రైతులకు ప్రోత్సహాలు అందించాలి. ప్రస్తుతం వ్యవసాయ రంగంలో ఉపయోగంలేని ప్రోత్సాహకాలను తగ్గించి, ఎలాంటి పౌష్టికాహార ప్రయోజనాలు లేని, కేవలం రొక్కమే ప్రధానమైన చెరుకు, పత్తి వంటి పంట సాగును నిరుత్సాహపరచాలి. శిశువులు, చిన్నారుల పౌష్టికాహార ప్రయోజనాల వైపుగా వ్యవసాయ విధానం రూపొందించాలి.

**5. పౌష్టికార సమృద్ధి కోసం ప్రైవేటు రంగాన్ని సైతం ప్రోత్సహించాలి:**

పీపీపీ విధానంలో ప్రభుత్వరంగంతో ప్రైవేటు రంగం కలిసి కట్టుగా సాధిస్తున్న విజయాలను దృష్టిలో పెట్టుకొని పౌష్టికాహార సమృద్ధి కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడంతో పాటు, బలవర్ధకమైన ఆహార ఉత్పత్తి రంగంలో కృషి చేయడం ద్వారా మాతా, శిశు పౌష్టికాహార సమస్య పరిష్కారం అవుతుంది. బలవర్ధకమైన ఆహార తయారీలో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే దిశగా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడానికి కూడా ప్రైవేటు రంగ సేవలను వినియోగించుకోవాలి.

**ముగింపు:**

ఏ దేశ సుస్థిర అభివృద్ధికైనా ప్రజల ఆరోగ్యం గీటురాయిగా ఉంటుంది. మన దేశ యువ జనాభా నుంచి తగిన సత్ఫలితాలు పొందడంలో కీలకమైన సవాళ్లను ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వ పథకాలు సవ్యంగా అమలు కావడానికి సుశిక్షితులైన సిబ్బంది అవసరముంది. భారత్ 2010 నాటికి ప్రపంచంలోనే అత్యధిక మంది చిన్నారులు పౌష్టికాహార లేమితో బాధ పడుతున్న దేశంగా, అభివృద్ధి పథంలో ముందుకు పోవడానికి వెనుకాడుతోంది. దేశంలోని 121 మిలియన్ల (అయిదేళ్ల లోపు..) చిన్నారుల్లో 52 శాతం మంది పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. మన దేశం ఆర్థికాభివృద్ధి సాధించడానికి ఈనాడు ఎన్నడూ లేనంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో సమగ్ర ఆరోగ్య ప్రణాళికతో పౌష్టికాహారానికి ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు దేశాభివృద్ధికి శిశువులకు తొలి వెయ్యి రోజుల కాలంలో తగిన పౌష్టికాహారాన్ని అందించడం తప్పనిసరి అవుతుంది. జాతీయ పౌష్టికాహార పథకాన్ని ఏర్పాటు చేయడం ద్వారా లక్ష్య సాధన కోసం దేశంలోని తల్లులు, చిన్నారుల పౌష్టికాహార సమస్యను పారద్రోలాలి. పౌష్టికాహార లక్ష్యాలను సాధించడానికి ప్రభావవంతమైన వ్యూహ రచన చేయాల్సి ఉంటుంది. ■

## యోజన చందాదారులకు సూచన:

పోస్టులో పంపిన యోజన మాసపత్రిక అందడంలేదని పలువురు చందా దారులు ఫిర్యాదు చేస్తున్నారు. వీరందరికీ మనవి ఏమంటే, ప్రతినెలా రెండు, మూడు తారీకులలో ఠంచనుగా కాపీలను పోస్టు చేస్తాము. అయితే, ప్రతులు ఆర్డినరీ పోస్టులో వెళతాయి కనుక, ఒక్కొక్క సారి అందకపోయే అవకాశముంది. దీనికి యోజన బాధ్యతవహించదు. నెలకు ఒక ప్రతి అందకపోతే మరొకటి, మరొకటి పంపడానికి పాలనాపరమైన ఆటంకాలున్నాయి. ఒకవేళ రిజిష్టర్ పోస్టులో కావాలంటే, మామూలు ప్రతి ఒక్కింటికి రూ. 52/- లు, ప్రత్యేక సంచికకు రూ. 57/- లు చందాదారులు అదనంగా ముందుగా చెల్లించాల్సి ఉంటుంది. గమనించగలరు.

**- సీనియర్ ఎడిటర్**

# ఇంధన అభివృద్ధికి మౌలిక సదుపాయాల పెంపు

- డాక్టర్ హిరణ్మోయ్ రాయ్



**దేశ వ్యాప్తంగా మారుమూల ప్రాంతాలు, దేశ సరిహద్దుల వరకు ఎక్కడినుంచి ఎక్కడికైనా సులువుగా వెళ్లేందుకు వీలుగా రూ. 5.35 లక్షల కోట్ల అంచనా వ్యయంతో తలపెట్టిన "భారత్ మాలా పరియోజన" ప్రాజెక్ట్ మొదటి దశలో 35 వేల కిలోమీటర్ల విస్తీర్ణంలో రోడ్డు నిర్మాణానికి 35 వేల కోట్ల రూపాయల ఖర్చును ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రభుత్వం తీసుకున్న కొన్ని ప్రత్యేక చర్యల వల్ల అంతర్గత జలమార్గాలు, తీరప్రాంత రవాణా, రైల్వేలలో అంకితమైన రవాణా కారిడార్లు, పట్టణాల్లో వేగవంతమైన రవాణా కోసం బస్సులు, మెట్రోతో సహా ప్రజా రవాణా వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నారు.**

ప్రభుత్వ పెట్టుబడితోనూ, విదేశీ పెట్టుబడి దారులతో సహా ప్రైవేట్ భాగస్వాముల సహాయంతోనూ పెద్ద ప్రాజెక్టులను చేపట్టాలని నిర్దేశించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. కొన్నిభారీ ప్రాజెక్టుల నిర్మాణానికి సొంతంగా ఏర్పాటు కోసంన బాహ్య వనరులను సొంతంగా కలిగిఉండడానికి ఆ ప్రాజెక్టుల ఆదాయం సరిపోదు. అందువల్ల, పెట్టుబడులలో ఏర్పడే విపరీతమైన తేడాలను నిర్దిష్ట సమయంలో సర్దుబాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక మంత్రిత్వశాఖలోని ఒక ప్రత్యేక విభాగం (విండో) ఏర్పాటుచేసింది.

ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంపొందించడంలో పట్టణీకరణ అత్యంత ప్రధాన పాత్ర పోషిస్తున్నందువల్ల "స్మార్ట్ సిటీస్ మిషన్" "అమృత్" హృదయ్ వంటి పథకాలను రూపొందించింది. సుమారు 2.04 లక్షల కోట్ల రూపాయల అంచనా వ్యయంతో వంద ఆకర్షణీయమైన నగరాల (స్మార్ట్ సిటీస్) నిర్మాణం చేపట్టాలన్న లక్ష్యంతో 99 నగరాలను ఎంపిక చేశారు. అంతేగాకుండా మరో 500 నగరాలు, మున్సిపాలిటీలలో గృహనిర్మాణం, తాగునీరు, పారిశుద్ధ్య వసతులు, స్వచ్ఛ భారత్, తదితర పథకాలు అమలు చేసే ఉద్దేశ్యంతో "అటల్ మిషన్ ఫర్ రీజువెనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్ ఫార్మేషన్ (అమృత్ – అటల్ పట్టణాల పునరుద్దీపన, రూపాంతరీకరణ పథకం) కింద పనులు చేపట్టారు. ఇప్పటికే 2,350 కోట్ల రూపాయల ఖర్చు కాగల పథకాలు పూర్తికాగా మరో రూ. 20,852 కోట్ల విలువైన పనులు వివిధ దశలలో ఉన్నాయి. ఈ నగరాల్లో స్మార్ట్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్, స్మార్ట్ రోడ్లు, సోలార్ రూఫ్స్, ఇంటెలిజెంట్ ట్రాన్స్ పోర్ట్ సిస్టమ్స్, స్మార్ట్ పార్క్స్ వంటి పలు ప్రాజెక్టులను అమలు చేయడం ప్రారంభించాయి. భారతదేశంలో చారిత్రక వారసత్వసంపద నగరాలను సంరక్షించడానికి, పునరుద్దీపింప జేయటానికి జాతీయ వారసత్వ సంపద అభివృద్ధి విస్తరణ పథకం (నేషనల్ హెరిటేజ్ సిటీ డెవలప్ మెంట్ అండ్ ఆగ్మెంటేషన్ యోజన – HRIDAY) ప్రధానంగా చేపట్టారు. "అమృత్" కార్యక్రమం కింద ముఖ్యంగా 500 నగరాలలో గృహనిర్మాణం, తాగునీటి వసతి కల్పించడమే ధ్యేయంగా ఎంచుకున్నారు. ఈ 500 నగరాలకు సంబంధించి 77,649 కోట్ల రూపాయల అంచనాలతో రాష్ట్రస్థాయి నుంచి అందిన ప్రణాళికలను కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. రూ. 19,428 కోట్ల విలువైన 494 నీటి సరఫరా ప్రాజెక్టులకు, 12,429 కోట్ల రూపాయలు విలువైన 272 మురికివాడల ప్రాజెక్టులకు

అసోసియేట్ ప్రొఫెసర్, యూనివర్శిటి ఆఫ్ పెట్రోలియం & ఎనర్జీ స్టడీస్, డెహ్రాడూన్.
E-mail: h.roy10@gmail.com

కాంట్రాక్టులు కుదిరాయి. విద్య, విద్యుత్, వైద్య తదితర కీలకమైన రంగాలలోను ప్రజోపయోగమైన ఇతర ప్రధానమైన కార్యక్రమాలకు రంగాలకు తగిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఇండియా ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఐఎఫ్ సీఎల్ఎ) ద్వారా భారత ప్రభుత్వం పరపతి కల్పిస్తోంది.



మరో మౌలిక రంగమైన రోడ్డునిర్మాణ కార్యక్రమాలలో దేశప్రగతి నూతన శిఖరాలకు చేరింది. జాతీయ రహదారుల నిర్మాణం కోసం 2017-18 ఆర్థిక సంవత్సరంలో నిర్ణయించు కున్న 9 వేల కిలోమీటర్ల లక్ష్యాన్ని సులువుగా అధిగమించే అవకాశం కనిపిస్తున్నది. దేశ వ్యాప్తంగా మారుమూల ప్రాంతాలు, వెనుక బడిన ప్రాంతాలు, దేశ సరిహద్దుల వరకు ఎక్కడినుంచి ఎక్కడికైనా సులువుగా వెళ్లేందుకు వీలుగా రూ. 5.35 లక్షల కోట్ల అంచనా వ్యయంతో తలపెట్టిన ''భారత్ మాలా పరియోజన" ప్రాజెక్ట్ మొదటి దశలో 35 వేల కిలోమీటర్ల విస్తీర్ణంలో రోడ్డు నిర్మాణానికి 35 వేల కోట్ల రూపాయల ఖర్చును ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

విద్యుత్ రంగంలో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు (పవర్ పర్చేజ్ అగ్రిమెంట్స్ లేక - పిపిఎలు) చేసుకుని, వాటిని అమలు చేసే పద్ధతిని మారుస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఒక రాష్ట్ర వార్షిక సగటు నిర్దిష్ట డిమాండ్ ను ఒక డిస్కమ్ పూర్తిగా తీర్చడానికి వీలుగా తాము విద్యుత్ కొనుగోలు ఒప్పందా లను అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటిస్తోంది. ప్రపంచంలోకెల్లా అతి తక్కువస్థాయిలో అంటే 1000 కిలోవాట్లకంటే తక్కువగా ఉన్న తలసరి విద్యుత్ వినియోగాన్ని మెరుగుపరచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది, అభివృద్ధి చెందిన దేశాలలో తలసరి విద్యుత్ వినియోగం సగటున 15 వేల కిలోవాట్లు కాగా చైనాలో 4 వేల కిలోవాట్ల మేరకు ఉన్నది. విద్యుత్ పంపిణీ కంపెనీల రవాణా తదితర కార్యకలాపాలను ప్రత్యేకంగా విభజించాలన్న విప్లవాత్మకమైన ప్రణాళిక గురించి ప్రభుత్వం ఇప్పటికే చర్చిస్తోంది. వినియోగదారుడికి నాణ్యమైన విద్యుత్‌ను అందజేయడమే సరఫరా లక్ష్యంగా ఉండాలన్నది ప్రభుత్వ ధ్యేయం. పారిశ్రామిక పరిభాషలో వీటినే "సరఫరా - వైర్ " అంటారు. ఈ విభజన దేశంలోని ప్రజలు, సంస్థలు తమకు కావలసిన విద్యుత్తును తమ నివాస ప్రాంతాలకు సమీపంలో తమకు చిత్తం వచ్చిన సంస్థ నుంచి కొనుగోలుచేసే అవకాశాన్ని కల్పిస్తుంది. దీనితో సంస్థలమధ్య ఏర్పడే పోటీవల్ల వినియోగదారులు తమకు అతితక్కువ ధరకు నాణ్యమైన విద్యుత్‌ను ఎవరు సరఫరా చేస్తే వారినుంచి కొనుగోలు చేసే అవకాశం ఏర్పడుతుంది. ఇది పరిశ్రమ ద్వారా జరిగే క్రాస్ సబ్సిడీలను తగ్గించడంలో సహాయపడడమేగాక వ్యాపారాల అభివృద్ధి కోసం ఏర్పడే పోటీ వల్ల ధరల తగ్గుదలకు, పన్నుల రూపంలో ప్రభుత్వ ఆదాయం మరింత పెంచుకునేందుకు తోడ్పడడమే గాక 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమాన్ని మరింత ముందుకు నడిపిస్తుంది. అర్హులకు మాత్రమే రాయితీలు అందించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యక్షప్రయోజన బదిలీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ - డిబిటి) పథకాన్ని విద్యుత్తు రంగంలో కూడా ప్రవేశపెట్టేందుకు గల అవకాశాలను పరిశీలిస్తోంది. ప్రభుత్వ విధానాన్ని రూపొందించే మేధావి వర్గం, నీతి ఆయోగ్ ఇప్పటికే జాతీయ విద్యుచ్ఛక్తి విధానంలో ప్రత్యక్షప్రయోజనబదిలీ పథకం పై ఒక ముసాయిదా పత్రాన్ని సిద్ధం చేశారు

గృహ నిర్మాణ రంగంలో అల్పాదాయ వర్గాల (లోఇన్‌కమ్ గ్రూప్స్ - LIG) వారికోసం చేపట్టిన గృహనిర్మాణాలు, తర్వాత రాజీవ్ ఆవాస్ యోజన (RAY-రే), పట్టణాలలో పేదలకు కనీస సదుపాయాల కల్పన (బేసిక్ సర్వీసెస్ ఫర్ అర్బన్ పూర్-BSUP) ఆతర్వాత మురికివాడలనిర్మూలన, సమీకృత గృహనిర్మాణ పథకం (IHSDP) జవహర్ లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యూవల్ మిషన్ (JNNURM) వంటి పథకాలు ఎన్నో వచ్చాయి.

అయితే ఈ కార్యక్రమాలు ఎదుర్కొన్న అతి పెద్ద సవాలు ఏమిటంటే వీటికి తగిన భూమి లభ్యత కొరవడడానికి కారణం భూమి గరిష్ట వినియోగానికి తగిన నమూనాలు రూపొందిం చకపోవడమేనని భారత ప్రణాళికా సంఘం (2012-2017) విమర్శించింది. గతంలోఉన్న నియంత్రణలవల్ల పట్టణాభివృద్ధి కోసం సమగ్రమైన సమీకృత దీర్ఘకాలిక ప్రణాళికలు లేకపోవడంతో ఈ పరిస్థితి ఎదురవుతోందని ప్రభుత్వం గ్రహించింది. అంతేగాక ఇలాంటి ప్రణాళికలలో జాప్యం వల్ల ఖర్చులు, ధరలు పెరిగిపోవడం వల్ల అసలైన గృహనిర్మాణ పథకాలు అర్హులైన నిర్ణీత వర్గాలకు అందుబాటులోకి రావడం లేదు. పట్టణాలలో మౌలిక సదుపాయాల కల్పన, నిర్వహణ (అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ గవర్నెన్స్ - UIG)

కార్యక్రమం చేపట్టాలంటే ముందుగా మురికివాడల్లో నివసించేవారి తరలింపు తప్పని సరి అవుతుంది. ఈ సందర్భంగా వారి పునరావాసానికి సంబంధించిన స్పష్టమైన విధానాలు రూపొందించడం కూడా అవసరమవుతుంది. పట్టణాల్లో అందరికీ గృహవసతి కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ముందుగా " రాజీవ్ ఆవాస్ యోజన" (రే) పథకాన్ని కొన్నిరోజులు అమలు చేశారు. పట్టణపేదరిక నిర్మూలన, గృహనిర్మాణ మంత్రిత్వశాఖ (మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ పావర్టీ అలీవియేషన్-MHUPA) నివేదిక ప్రకారం "రే పథకం" కింద 2013-2015 మధ్య 1,17,707 ఇళ్లు నిర్మించాలని తలపెట్టగా కేవలం 3,378 ఇళ్లు మాత్రమే నిర్మించగలిగారు. "రే పథకం" కింద 2022 నాటికి పట్టణాలలో గృహవసతి కొరత తీర్చాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఏదేమైనప్పటికీ అయితే కేంద్ర ప్రభుత్వం ఈ పథకం ప్రారంభించిన 2015-2016 సంవత్సరంలో కేటాయించిన బడ్జెట్ కేటాయింపు 40 బిలియన్ రూపాయలు మాత్రమే కావడంవల్ల పెద్ద ప్రభావం కనపడలేదని పట్టణపేదరిక నిర్మూలన, గృహనిర్మాణ మంత్రిత్వశాఖ (ఎంహెచ్ యూపీఏ) 2015 నివేదిక పేర్కొంది.

రవాణా రంగానికి సంబంధించిన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసే సందర్భంగా సమీకృత రవాణా అభివృద్ధి వ్యూహాన్ని రూపొందించవలసి ఉంటుందని భారత ప్రభుత్వ అధ్యయన నివేదిక సిఫార్సు చేసింది. రానున్న రెండు దశాబ్దాల్లో రవాణా రంగంలో వాహనాల గమనంపై అంచనా వేసి, సరకుల రవాణాకు, జనుల ప్రయాణానికి అవసరమైన మౌలికసదుపాయాల కల్పనకు అవసరమైన పెట్టుబడుల సేకరణకు సంబంధించిన అంశాలపై అధ్యయనంచేయడమే దీని ముఖ్యోద్దేశ్యం. పరిపాలనవిభాగాల హద్దులను అధిగమించి పెట్టుబడులను క్రోడీకరించి సమీకృత రవాణా వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు ఒక సమగ్ర ప్రణాళికను రూపొందించాల్సిన అవసరం ఉందని ఈ అధ్యయన ఫలితాలు వెల్లడించాయి.

ప్రభుత్వం తీసుకున్న కొన్ని ప్రత్యేక చర్యల వల్ల అంతర్గత జలమార్గాలు, తీరప్రాంత రవాణా, రైల్వేలలో అంకితమైన రవాణా కారిడార్లు, పట్టణాల్లో వేగవంతమైన రవాణా కోసం బస్సులు, మెట్రోతో సహా ప్రజా రవాణా అభివృద్ధి, ఎలక్ట్రానిక్ టోలింగ్ సిస్టమ్, సాధారణ టికెటింగ్ మొదలైన వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నారు. ప్రజలను సరకులను, ఒక చోటినుంచి మరోచోటికి అతి తక్కువ ఖర్చుతో సురక్షితంగా వేగవంతంగా చేర్చేందుకు తగిన సరకుల, ప్రజారవాణా వ్యవస్థల ఏర్పాటును ప్రోత్సహించేందుకు, అవసరమైనప్పుడు ఒక వ్యవస్థ నుంచి మరొక వ్యవస్థలోకి తక్షణమే సులువుగా మారిపోయి ప్రయాణాన్ని సాఫీగా కొనసాగించేందుకు తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సమన్వయము సాధించగల విధంగా ఒక సమగ్ర విధానాన్ని రూపొందించుకోవలసి ఉంటుంది.

భారత ప్రభుత్వం చొరవ తీసుకుని 2018-19 కేంద్ర బడ్జెట్‌లో అనేక కార్యక్రమాలు చేపట్టడం వల్ల మౌలిక సదుపాయాల రంగంలో కీలకమైన; మార్పులకు అవకాశం ఏర్పడుతోంది. రవాణారంగం ప్రాముఖ్యత కారణంగా కేంద్ర ప్రభుత్వం 2018-19 బడ్జెట్‌లో వ్యూహాత్మకంగా చేపట్టిన అనేక నూతన కార్యక్రమాల నేపథ్యంలో భారతదేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధితోబాటు అభివృద్ధి కారకాలైన అనేక కీలకాంశాలపై ఒక లోతైన విశ్లేషణ అవసరమవు తుంది.

భారత దేశంలో మౌలిక సదుపాయాల రంగం పెరుగుదల ధోరణిని, నమూనాలను గమనిస్తే ఈ రంగానికి బడ్జెట్‌లో అధిక కేటాయింపు, ప్రైవేటు రంగ పెట్టుబడులను పెంచడం, లాజిస్టిక్స్ మెరుగుదల, ఎఫ్డీఐ వాటా పెంచడం. ఒప్పందాల సంఖ్యతోపాటు మొత్తాల పెరుగుదల వంటి అంశాలు కనిపిస్తాయి. భారతదేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి వల్ల కలిగే ప్రయోజనాలు భారీగా ఉండడంతో ఈ రంగంలో పెట్టుబడుల కోసం డిమాండ్ కూడా పెద్దగానే ఉంది. దేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి 2022 నాటికి మౌలిక సదుపాయాల ద్వారా 50 ట్రిలియన్ డాలర్ల (777.73 బిలియన్ డాలర్లు) పెట్టుబడులు అవసరమవుతాయని అంచనా వేశారు. రానున్న రోజుల్లో విద్యుత్ సరఫరా, రహదారులు, జాతీయ మార్గాలు, పునరుత్పాదక శక్తి వంటి రంగాల్లో పెట్టుబడులు భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు, ఉత్పత్తి పెరుగుదల వంటి అంశాలతో ఉత్తమమైన ఫలితాలు ఇస్తాయి. జాతీయ రహదారులలో కేవలం 24 శాతం మాత్రమే నాలుగు లేన్స్ కలిగిఉండడం, ప్రాంతీయ స్థానిక రహదారులను ఇంకెంతో మెరుగుపరచవలసి ఉండడం వల్ల భారత దేశంలో పెట్టుబడుల విలువ, ఆదాయం పెరగడంవంటి ఆకర్షణీయమైన అవకాశాలు కనిపిస్తున్నాయి. చైనాకు చెందిన హార్బర్ ఇంజనీరింగ్, మిజుహో ఫైనాన్షియల్ గ్రూప్ వంటి ప్రముఖ అంతర్జాతీయ పోటీ సంస్థలను కూడా ఆకర్షించడం వంటి కారణాల వల్ల 2017 లో భారత దేశం భారీగా విదేశీపెట్టుబడులను ఆకర్షించగలిగింది.

భారతదేశంలో 'అందరికీ ఇళ్లు', 'ఆకర్షణీయమైన నగరాల నిర్మాణ కార్యక్రమం, వంటి బలమైన విధాన నిర్ణయాల మద్దతు ఉండడంవల్ల ఇతర మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం పెట్టుబడుల ఒత్తిడిని తగ్గించడం, ఇబ్బందులను తొలగించి అభివృద్ధి సాధించ డానికి దోహదపడుతోంది. భారతదేశపు విద్యుత్ పంపిణీ సంస్థల ఆర్థిక స్థితిగతుల పునరుద్ధరణలో "ఉదయ్" పథకం ఎంతో సహాయ పడుతుండడంవల్ల విద్యుత్ రంగంలో బలమైన వృద్ధి నమోదవుతున్నది. అంతే గాకుండా మౌలిక సదుపాయాల రంగంలో అనేక అంశాలకు సంబంధించి విదేశీ పెట్టుబడులను నూటికి నూరుశాతం

పట్టిక 1: మౌలిక సదుపాయాలకు సంబంధించి 12వ పంచవర్ష ప్రణాళిక కాలంలో పూర్తిచేసిన ప్రాజెక్ట్‌ల వివరాలు

| విభాగం | ప్రాజక్టుల సంఖ్య | మొత్తం ఖర్చు (అమెరికా డాలర్లు) |
|---|---|---|
| రోడ్డు రవాణా, జాతీయ రహదారులు | 91 | 8.7 బిలియన్లు |
| విద్యుత్తు | 73 | 16.63 బిలియన్లు |
| పెట్రోలియం | 65 | 19.48 బిలియన్లు |
| రైల్వేలు | 33 | 3.81 బిలియన్లు |
| ఉక్కు | 20 | 8.13 బిలియన్లు |
| నౌకాయానం, జలరవాణా | 20 | 1.78 బిలియన్లు |
| టెలీకమ్యూనికేషన్స్ | 14 | 463.62 మిలియన్లు |
| ఎరువులు | 6 | 596.24 మిలియన్లు |
| బొగ్గు | 9 | 2.26 బిలియన్లు |
| పౌర విమానయానం | 5 | 861.16 మిలియన్లు |
| పట్టణాభివృద్ధి | 5 | 678.83 మిలియన్లు |
| అణు విద్యుత్తు | 1 | 168.93 మిలియన్లు |

మూలం: గణాంకాలు, పథకాల అమలు మంత్రిత్వ శాఖ (MoSPI)

అనుమతించే అవకాశం ఉంది.

ఇప్పుడు రహదారుల విస్తరణ కార్యక్రమం ఒక బలమైన ఉద్యమరూపంలో ఊపందుకుంటున్నది. భారత దేశంలో మొత్తం రోడ్లు, వంతెనలు, మౌలికసదుపాయాల విలువ 2009-2017 మధ్యకాలంలో 13.6 శాతం విస్తరించినట్టు కాగ్ నివేదిక పేర్కొన్నది. ఈ పెరుగుదల విలువ 19.2 బిలియన్ డాలర్లుగా అంచనా వేశారు.

బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు సిమెంటు, విద్యుత్ వంటివి ఎనిమిది ప్రధాన మౌలిక సదుపాయాల పరిశ్రమలుగా గుర్తించబడ్డాయి. ఆర్థిక సంవత్సరంలో ఈ పరిశ్రమల మొత్తం సగటు పెరుగుదల 4.8 శాతంగా నమోదైంది. ఇందులో విద్యుత్ 9 శాతం, ఉక్కు 9 శాతం, రిఫైనరీల ఉత్పత్తులు 8.9 శాతం, సిమెంట్ 5.8 శాతం, ఎరువులు 3.3 శాతం అభివృద్ధి నమోదు చేసుకోగలిగాయి. ఇందులో 2017 ఏప్రిల్ – అక్టోబర్ నెలల మధ్య మొత్తం అభివృద్ధి 3.5 శాతం నమోదైంది.

భారతదేశంలో మౌలిక సదుపాయాల రంగం అభివృద్ధికి ప్రభుత్వం చొరవతో తీసుకున్న చర్యలతోబాటు మౌలిక సదుపాయాల అవసరం, గృహనిర్మాణాభివృద్ధి, అంతర్జాతీయ పెట్టుబడులు, ప్రభుత్వ-ప్రైవేట్ రంగాల భాగస్వామ్యం వంటి అంశాలను ప్రధాన కారకాలుగా చెప్పుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2017-18 బడ్జెట్‌లో మౌలిక సదుపాయాల కోసం కేటాయింపులు 61.48 బిలియన్ డాలర్లు కాగా ఇందులో రైల్వేలు, మెట్రో రైల్, నిర్మాణ రంగం, టెలికాం, రహదారులు, విమానాశ్రయాలవంటివి ఉన్నాయి.

ముఖ్యంగా ప్రభుత్వ కార్యక్రమాలు, అంతర్జాతీయ సంస్థలు, పట్టణాలలో రియల్ ఎస్టేట్ కార్యక్రమాల ద్వారా మౌలిక సదుపాయాల రంగంలో విస్తృతావకాశాలు కలుగుతూన్నాయి. ఇదే సందర్భంగా ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా దీన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా ఎలక్ట్రానిక్స్ తయారీకి భారత దేశాన్ని ప్రధాన కేంద్రంగా మార్చేందుకు తగిన మౌలిక సదుపాయాల ఏర్పాటు కోసం 2017-18లో బడ్జెట్లో మొత్తం 61.48 బిలియన్ డాలర్లు కేటాయించారు. భారత దేశం అభివృద్ధి లో జపనీయుల పెట్టుబడులు కీలకపాత్ర వహిస్తున్నాయి. భారత దేశంలో మౌలికవసతులు, తయారీ రంగాల అభివృద్ధికి 2014-19 సంవత్సరాల మధ్య 35 బిలియన్ డాలర్ల మేరకు పెట్టుబడులు పెట్టగలమని జపాన్ హామీ ఇచ్చింది. అలాగే భారత దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు తగిన అవకాశాల కోసం జపాన్ నిరంతరం కనిపెట్టుకుని ఉంది. చిన్నపట్టణాల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా మధ్యప్రదేశ్ లో మూడులక్షల ఇళ్లకు తాగునీటి సరఫరా ప్రాజెక్ట్ కోసం ఆసియా అభివృది ధ్బ్యాంకు 275 మిలియన్ డాలర్ల మేరకు రుణసదుపాయం కల్పిస్తోంది. భారత దేశంలో 2022 నాటికీ అందరికీ గృహవసతి కల్పించేందుకు రోజుకు 43 వేల ఇళ్ల వంతున నిర్మించవలసి ఉంది. వచ్చే పదేళ్లలో వందలాది కొత్త పట్టణాలను ఆకర్షణీయమైన నగరాలుగా అభివృద్ధిచేయవలసిఉంది. దీనివల్ల నిర్మాణ రంగంలో భారత దేశం ప్రపంచంలోనే మూడో అతి పెద్ద దేశంగా అవతరించనుంది. ఈ రంగం ద్వారా భారత దేశపు ఆర్థిక వ్యవస్థలో 15 శాతం మేరకు ఆదాయం సమకూరుతోంది. ఇటీవల రియల్ ఎస్టేట్ చట్టం, జీఎస్టీ, ఆర్ఈఐటీఎస్, తోబాటు వివిధరకాలుగా అనుమతులు మంజూరు చేయడంలో జాప్యాన్ని తగ్గించడం వంటి సంస్కరణలు రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాలను బలోపేతం చేసేందుకు తోడ్పడతాయి.

ప్రధానమంత్రి ఆవాస్ యోజన (PMAY) కింద 2019 ఆర్థిక సంవత్సరానికి 21,000 కోట్ల రూపాయల ఖర్చుతో 5.1 మిలియన్ల ఇళ్లనిర్మాణం పూర్తిచేయాలని ప్రభుత్వం యోచిస్తున్నది. దీనితో సరసమైన గృహ నిర్మాణాలకు అవసరమైన సిమెంటు, ఉక్కు, పెయింట్స్, శానిటరీ వస్తువులు, విద్యుత్ సామాగ్రి, పరికరాల ఉత్పత్తి, సరఫరా సంస్థలు

కూడా లబ్ధిపొందే అవకాశం లభిస్తుంది. దీనికితోడు సరసమైన గృహనిర్మాణాలకోసం నిధులు అందజేసే ప్రత్యేక బ్యాంకు ను కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కిందకురాని గృహనిర్మాణాల కోసం వడ్డీపై రాయితీ కల్పించే అవకాశాన్ని పరిశీలిస్తున్నది.

మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి కోసం వచ్చే ఆర్థిక సంవత్సరం 5.95 లక్షల కోట్ల రూపాయలు కేటాయిస్తామని కేంద్ర ఆర్థికమంత్రి చెప్పారు. "మన దేశంలో మౌలిక సదుపాయాల కోసం రూ. 50 లక్షల కోట్ల రూపాయల మేరకు పెట్టుబడులు పెడితే దానివల్ల స్థూల జాతీయోత్పత్తి పెరగడమేగాక రహదారులు, విమానాశ్రయాలు, రైల్వేలు, నౌకాశ్రయాలు లోతట్టు జలమార్గాల నెట్‌వర్క్‌లతో దేశంలో అనుసంధానించడానికి అవకాశం కలగడంవల్ల ప్రజలకు నాణ్యమైన మెరుగైన సౌకర్యాలు ఏర్పడతా"యని మంత్రి వివరించారు. ఇందుకోసం అవసరమైన నిధులు సేకరించేందుకు ప్రభుత్వరంగ సంస్థలు షేర్ మార్కెట్లో అడుగు పెట్టడం, బాండ్లు విడుదల చేయడంవంటి చర్యలు చేపడతాయి. దిగుమతి చేసుకున్న పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు 8 రూపాయల వంతున ప్రభుత్వం ఇప్పటికే బడ్జెట్‌లో మౌలిక సదుపాయాల కల్పన సెస్ విధించింది. ఈ దిశలో ప్రభుత్వం, ఇతర మార్కెట్ నియంత్రణ సంస్థలు కూడా ఇన్ఫ్రా స్ట్రక్చర్ ఇన్వెస్ట్మెంట్ ట్రస్ట్ (ఇన్విట్), రియల్ ఇన్వెస్ట్మెంట్ ట్రస్ట్ (రీట్స్) లాంటి వాహకసంస్థల ఏర్పాటు కోసం అవసరమైన చర్యలు తీసుకున్నాయి. ఎంపిక చేసిన కొన్ని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల (సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ ఎంటర్ప్రైజెస్ - CPSE) ఆస్తులను నగదుగా మార్చుకునే చర్యలను ప్రభుత్వం వచ్చే సంవత్సరం నుంచి ప్రారంభిస్తుంది.

సమీకృత మౌలిక సదుపాయాల కల్పన నమూనాలో భాగంగా ఎన్డీఏ ప్రభుత్వం 2018-19 బడ్జెట్‌లో రైల్ రోడ్ ప్రాజెక్టుల నిర్మాణాల కోసం 1.48 లక్షల కోట్లు, 1.21 లక్షల కోట్ల రూపాయల సొమ్మును కేటాయించింది. రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకోసం నౌకాశ్రయాలు అనుసంధానానికి సాగరమాల (పోర్టులు), భారతమాల వంటి ప్రతిష్ఠాత్మకమైన పథకాలకు అవసరమైన నిధులు సేకరించేందుకు మార్కెట్ నుంచి ఈక్విటీని సంపాదించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. మార్కెట్ నుంచి తగిన వాటాధనాన్ని సంపాదించడానికి భారత జాతీయ రహదారుల ప్రాధికారసంస్థ (నేషనల్ హైవేస్ అథారిటీ అఫ్ ఇండియా - NHAI) తన ఆధీనంలోని రహదారి ఆస్తులను ఒక ప్రత్యేక వాహక సంస్థకు (స్పెషల్ పర్పస్ వెహికల్ - SPV) అప్పగించి, టోల్ ఆపరేట్ బదిలీ (TOT) ఇన్విట్ వంటి కార్యకలాపాల ద్వారా సొమ్ము చేసుకునే అవకాశాన్ని కల్పిస్తుంది. భారతమాల రహదారి నిర్మాణ పథకం కోసం మొత్తం పెట్టుబడి 10 లక్షల కోట్ల రూపాయలు ప్రభుత్వానికి అతిపెద్ద ఖర్చు కాగా నౌకాశ్రయాల అనుసంధాన ప్రాజెక్ట్ "సాగరమాల" కోసం 2035 వరకు మరో 8 లక్షల కోట్ల రూపాయలు అవసరమవుతాయి. కేంద్రప్రభుత్వం 2017-18 ఆర్థిక సంవత్సరంలోగా సుమారు 9 వేల కిలోమీటర్ల మేరకు జాతీయ రహదారుల

**2018-19 కేంద్ర బడ్జెట్‌లో మౌలిక సదుపాయాల కల్పన రంగానికి కేటాయింపుల మొత్తం:**

| క్రమ సంఖ్య | మంత్రిత్వ శాఖ | సవరించిన అంచనాలు 2017-18 (కోట్ల రూ॥లలో) | ప్రాథమిక అంచనాలు 2018-19 (కోట్ల రూ॥లలో ) | తేడా శాతం |
|---|---|---|---|---|
| 1 | బొగ్గు మంత్రిత్వ శాఖ | 14478 | 15799 | 9.12 |
| 2 | ఈశాన్యప్రాంతాల అభివృద్ధి శాఖ (మౌలిక సదుపాయాల కల్పనకోసం) | 330 | 600 | 81.82 |
| 3 | సంప్రదాయేతర ఇంధనవనరుల మంత్రిత్వ శాఖ | 9466 | 10317 | 8.99 |
| 4 | చమురు సహజవాయువుల మంత్రిత్వ శాఖ | 87319 | 89210 | 2.17 |
| 5 | విద్యుత్ మంత్రిత్వ శాఖ | 64318 | 53469 | -16.87 |
| 6 | పౌరవిమానయాన మంత్రిత్వశాఖ | 2543 | 4086 | 60.68 |
| 7 | టెలీకమ్యూనికేషన్స్ మంత్రిత్వశాఖ | 9786 | 16986 | 73.57 |
| 8 | రైల్వే మంత్రిత్వశాఖ | 80000 | 93440 | 16.8 |
| 9 | గృహనిర్మాణాలు, పట్టణాభివృద్ధి వ్యవహారాల శాఖ | 15193 | 39937 | 162.87 |
| 10 | రోడ్డు రవాణా, రహదారులు మంత్రిత్వ శాఖ | 59279 | 62000 | 4.59 |
| 11 | నౌకాయాన మంత్రిత్వ శాఖ | 3165 | 4042 | 27.71 |
| 12 | ఉక్కు మంత్రిత్వ శాఖ | 11428 | 11294 | -1.17 |
| | మొత్తం | 357305 | 401180 | 12.28 |

మూలం: కేంద్ర బడ్జెట్ 2018-19

నిర్మాణం పూర్తిచేసేందుకు సిద్ధంగా ఉన్నదని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చెప్పారు. సుమారు 3.3 మిలియన్ కిలోమీటర్ల పొడుగైన రహదారి సౌకర్యాలతో ప్రపంచంలోనే అతిపెద్ద రహదారుల వ్యవస్థ కలిగిన దేశాలలో రెండో స్థానాన్ని సంపాదించుకున్నదని ఆయన వివరించారు.

వచ్చే ఆర్థిక సంవత్సరంలో భారతీయ రైల్వేల ప్రణాళికా వ్యయం 1.48 లక్షల కోట్ల రూపాయలకు చేరుతుంది. ఇది మన జాతీయ రవాణాదారు ఖాతాలో గతంలో ఎన్నడూ లేని పెద్దమొత్తమనే చెప్పాలి. రైల్వేలో 3,999 కిలోమీటర్ల మేరకు ట్రాక్ పునర్నిర్మాణము, 12,000 అదనపు వ్యాగన్ల చేరిక, 20 వేల కోట్ల రూపాయలతో భద్రతా నిధి ఏర్పాటు, 6వేల కిలోమీటర్ల మేరకు విద్యుదీకరణ వంటి ప్రణాళికలు ఇందులో చేరి ఉన్నాయి. అంతేగాకుండా 28వేల 500 కోట్ల రూపాయల మేరకు ప్రణాళికేతర సహకారంతోపాటు భారత రైల్వే ఆర్థిక సంస్థ (ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ – IRFC) ద్వారా మరో 26,440 కోట్ల రూపాయల మేరకు బాండ్ల రూపంలో సేకరించుకుని అవకాశం కల్పించారు. ఇప్పుడు రైల్వేలఅభివృద్ధి ప్రణాళికలో విద్యుదీకరణకు, భద్రతకు, ఆధునీకరణకు ప్రాధాన్యత లభించిందని సమీకృత మౌలిక సదుపాయాల కల్పన సంస్థలలో ఒకటిగా పేరొందిన ఫీడ్-బ్యాక్ ఇన్ఫ్రా కంపనీ చైర్మన్ వినాయక్ ఛటర్జీ అన్నారు. టికెట్ చార్జీలతో నిమిత్తం లేకుండా రైల్వేల సామర్థ్యాన్ని పెంచడానికి, ప్రయాణీకులకు తగిన సౌకర్యాలు కల్పిచడంతో పాటు వారి భద్రతకు పెద్దపీట వేశారు.

గృహనిర్మాణ మంత్రిత్వ శాఖకు, ఈశాన్య రాష్ట్రాల (మౌలిక సదుపాయాల) అభివృద్ధి మంత్రిత్వ శాఖలకు గతంలో ఎన్నడూ లేనంత అధికంగా నిధుల కేటాయింపు జరిగింది. గత ఆర్థిక సంవత్సరం 2017-18 బడ్జెట్ కేటాయింపులకంటే ఈ ఆర్థిక సంవత్సరం 2018-19లో సుమారు 12.27 శాతం మేరకు అదనపు నిధులు లభించాయి. ఆవిధంగా 2018 కేంద్ర బడ్జెట్ భారతదేశ ఆర్థికాభివృద్ధికి కారకమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి తగిన ప్రాధాన్యత నిచ్చింది. కేంద్ర బడ్జెట్ 2018-19లో మౌలిక సదుపాయాల కల్పన, నస్థాల జాతీయోత్పత్తి పెంపు, వివిధ కమ్యూనికేషన్ రవాణా సౌకర్యాల అనుసంధానతను మరింత బలోపేతం చేయటం, ఈశాన్య రాష్ట్రాలను ప్రధాన భూభాగానికి అనుసంధానించడం, ఆరోగ్య సేవలు, విద్య, వ్యవసాయం, రవాణా, పర్యాటక రంగాలతో పాటు మొత్తం మౌలిక సదుపాయాల రంగాన్ని పటిష్టం చేయడం ప్రధానమైన అంశమని చెప్పవచ్చు. ఆకర్షణీయ నగరాల పథకం వల్ల అనేక సమస్యలకు సాంకేతిక పరమైన మెరుగైన పరిష్కారాలు లభిస్తాయని, ఆర్థికమంత్రి చెప్పారు. "అమృత్" పథకం ద్వారా పట్టణాలలో ప్రాథమిక సేవలు మెరుగుపడతాయని, "హృదయ్" పథకం ద్వారా చారిత్రక నగరాల పరిరక్షణతోబాటు పర్యాటక రంగంలో స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఆర్థికమంత్రి వివరించారు.

■

## గమనిక:

యోజన పత్రిక యాజమాన్యం వీలైనంతవరకు సంచికను సకాలంలో పాఠకులకు అందచేయాలని కృషిచేస్తుంది. అయితే, అనేక కారణాలవల్ల, చందా కట్టిన వెంటనే పాఠకులకు పత్రికను పంపటం వీలుకాదు. చందావివరాలు మాకు చేరాలి, ఆ సమయానికి సంచిక అందుబాటులో ఉండాలి. ఈ కారణాలవల్ల ఆన్‌లైన్ చందాదారులకు ఒక్కొక్కసారి చందా కట్టిన 15, 20 రోజుల తరువాతనే సంచికను పంపటం వీలవుతుంది. యోజన తెలుగు పత్రికకు 20వ తేదీ తరువాత అందిన చందాలకు, ఆ తరువాత నెలనుండే సంచికను పంపడం వీలవుతుంది. పత్రికను ఎప్పుడూ, సాధారణ పోస్టు ద్వారానే పంపుతాము. దీనికి రికార్డేమీ ఉండదు. ఒకవేళ ఎవరికైనా పత్రిక అందకపోతే, బదులుగా మరో సంచికను పంపడం లేదా చందాను సర్దుబాటు చేయడం వీలుకాదు. చందాదారులే తమ చిరునామా సరిచూసుకోవడం, స్థానిక పోస్టుమ్యాన్‌తో మాట్లాడటం చేయాలి. గమనించగలరు.

**– సీనియర్ సంపాదకుడు**

## యోజన చందాదారులకు సూచన:

యోజన తెలుగు మాస పత్రిక డిజిటలైజ్ అయింది. దీనితో ఒక సంవత్సర చందాదారునికి సాలుకు 12 సంచికలు పంపటానికి మాత్రమే వీలవుతుంది. అనగా ఇప్పటి వరకు జరుగుతున్నట్లుగా సంచిక అందలేదని తెలిపితే మరో కాపీని పంపటానికి ఇకపై వీలవదు. కనుక చందాదారులు తమ చిరునామాకు సంబంధించిన పోస్టల్ విభాగంతో తమ ఏర్పాట్లు తామే గట్టిగా చేసుకోవాలి, గమనించగలరు.

**– సీనియర్ ఎడిటర్**

# సమ్మిళిత ద్రవ్యసేవల విస్తరణ

- ప్రొఫెసర్ చరణ్‌సింగ్



**కేంద్రం చిన్న వ్యాపారులకు రుణ సదుపాయం కల్పించే ఉద్దేశంతో మైక్రో యూనిట్స్ డవలప్‌మెంట్ రీఫైనాన్స్ ఏజెన్సీ (ముద్రా) పథకాన్ని ప్రవేశపెట్టడం ద్వారా ద్రవ్యసేవల సమ్మిళిత విస్తరణను సాధించేందుకు చర్యలు చేపడుతోంది. అలాగే 2015 నాటికి ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన (పిఎంజెడివై) పథకం కింద దేశంలోని 95 శాతం కుటుంబాలకు బ్యాంకు పొదుపు ఖాతాలను విజయవంతంగా సమకూర్చ గలిగింది. ప్రజలకు సామాజిక భద్రతను విస్తరింపచేసింది. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న పేదలకు వృద్ధాప్యంలో ఆదాయ భద్రత కల్పించేవిధంగా అటల్ పెన్షన్ యోజన వీలు కల్పిస్తుంది.**

దేశంలో మెరుగైన, సుస్థిర సామాజిక, ఆర్థిక ప్రగతికి వీలు కల్పించే ప్రక్రియను ద్రవ్య సేవల సమ్మిళిత విస్తరణ (ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్)గా చెప్పుకోవచ్చు. ఇది, సమాజంలోని అణగారిన వర్గాల ప్రజల స్వావలంబన లక్ష్యంగా వారి జీవన ప్రమాణాలను పెంచడంపై దృష్టిపెడు తుంది. అలాగే ద్రవ్యపరమైన విషయాలలో మెరుగైన నిర్ణయాలు తీసుకోవడానికి వారిని చైతన్యవంతులను చేస్తుంది. అల్పాదాయ వర్గాలు సైతం ఆర్థిక పురోగతిలో పాలు పంచుకునే విధంగా వారికి ఆర్థిక సేవలను అందుబాటు లోకి తీసుకువస్తుంది.

సమ్మిళిత ద్రవ్య సేవలపై (ఫైనాన్షియల్ ఇంక్లూజన్) కేంద్రం 2008లో నియమించిన కమిటీ, సమాజంలోని పేదలు, అణగారిన వర్గాల ప్రజలకు ద్రవ్యసేవలను, రుణ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చే ప్రక్రియను సమ్మిళిత ద్రవ్య సేవల విస్తరణ (ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్)గా పేర్కొన్నది. సమాన అవకాశాల ప్రాతిపదికగా అల్పాదాయ వర్గాల వారికి అందరికీ సమ్మిళిత ద్రవ్య సేవలు అందుబాటులోకి వచ్చేటట్టు చేయడం దీనిలక్ష్యం. సార్వత్రిక ద్రవ్యసేవల విస్తరణను నిర్ణీత కాలవ్యవధిలోగా సాధించేందుకు నిర్దేశిత లక్ష్యాలతో చురుకుగా పనిచేయాలని కూడా కమిటీ సూచించింది. అలాగే పేదలకు మెరుగైన రీతిలో రుణసదుపాయం పొందేందుకు వీలుగా అభివృద్ధి, సాంకేతికతపై దృష్టితో రెండు ప్రత్యేక నిధులను ఏర్పాటు చేయాలని కమిటీ సూచించింది.

### సమ్మిళిత ద్రవ్యసేవల విస్తరణ, చారిత్రక నేపథ్యం.....

నిజానికి, చారిత్రకంగా చూసినట్టయితే, సమ్మిళిత ద్రవ్యసేవల విస్తరణలో భారత దేశమే ముందువరుసలో నిలిచింది. 1904 లోనే సహకార సంఘాల చట్టం, భారతదేశంలో సహకార ఉద్యమానికి ఊతం ఇచ్చింది. సహకార బ్యాంకుల ప్రధాన లక్ష్యం, బ్యాంకింగ్ సదుపాయాలను ప్రజలకు విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావడం. ప్రత్యేకించి , ప్రజలు అత్యధిక వడ్డీరేట్లు వసూలు చేసే వడ్డీవ్యాపారుల బారిన పడకుండా అందుబాటు ధరలో రుణసదుపాయం కల్పించడం. 1955లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను జాతీయం చేయడంతో సమ్మిళిత ద్రవ్యసేవల విస్తరణ చర్యలు విస్తృతంగా ప్రారంభమయ్యాయి. 1967 వ సంవత్సరంలో సామాజిక బ్యాంకింగ్ సేవలపై పెద్ద చర్చ జరిగింది. ఫలితంగా , బ్యాంకింగ్ సేవలు అందుబాటులో లేని వర్గాల ప్రజలకు ముఖ్యంగా, పేదలు, గ్రామీణ ప్రాంత

విజిటింగ్ ప్రొఫెసర్, ఆండర్సన్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్, యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా, లాస్ ఎంజిలిస్.
E-mail: Charan.singh@anderson.ucla.edu

ప్రజలకు బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తెచ్చేవిధంగా 1969 లో 14 బ్యాంకులను ప్రభుత్వం జాతీయం చేసింది. అప్పటివరకు బ్యాంకింగ్ సేవలు పెద్దగా అందని రంగాలకు రుణాలను అందుబాటులోకి తెస్తూ, ప్రాధాన్యతారంగాల రుణసదుపాయానికి పెద్దపీట వేశారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాలకు బ్యాంకింగ్ సదుపాయాలను విస్తరించే ఉద్దేశంతో 1980లో మరో ఎనిమిది ప్రైవేటు బ్యాంకులను ప్రభుత్వం జాతీయం చేసింది. ఇక అప్పటినుంచి, అభివృద్ధిని వేగవంతం చేసే దిశగా బ్యాంకులు రుణసదుపాయం అందించే విషయంలో చెప్పుకోదగిన మార్పును తీసుకువచ్చాయి. ప్రత్యేకించి, ప్రాధాన్యతా రంగంపై దృష్టిపెట్టారు. అంతకు ముందు ఈ రంగానికి పెద్దగా రుణాలు అందేవికాదు.

కేంద్రం 2005 నుంచి, రిజర్వుబ్యాంకు, జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డ్)లతో కలిసి దేశంలో విస్తృత స్థాయిలో బ్యాంకింగ్, రుణ సేవలు అందుబాటులోకి తెచ్చి సమ్మిళిత ద్రవ్యసేవల విస్తరణకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటోంది. స్వయం సహాయక బృందాలు – బ్యాంకు లింకేజి, బిజినెస్ ఫెసిలిటేటర్లు, బిజినెస్ కరస్పాండెంట్ల సేవలు వినియోగించుకోవడం, వినియోగదారుల గురించిన వివరాలు తెలిపే కె.వై.సి నిబంధనలు సరళతరం చేయడం, ఎలక్ట్రానిక్ విధానం ద్వారా లబ్ధిదారులకు నగదు బదిలీ, మొబైల్ టెక్నాలజీ వినియోగం, నో ఫ్రిల్ ఖాతాలు, ద్రవ్యపరమైన అంశాలకు సంబంధించి ప్రజలలో అవగాహన కల్పించడం వంటి అంశాలు ఇందులో ఉన్నాయి. ఇందుకు మద్దతుగా, ఖాతాదారుల సేవా కేంద్రాల ప్రారంభం, క్రెడిట్ కౌన్సిలింగ్ కేంద్రాల ఏర్పాటు, కిసాన్ క్రెడిట్ కార్డుల జారీ, జాతీయ పెన్షన్ పథకం, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిఇ హామీ పథకం,ఆధార్ పథకం వంటి వాటిని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ బ్యాంకింగ్ సదుపాయాలు అందుకుంటున్న వారి సంఖ్య తక్కువగానే ఉంది. అందువల్ల ప్రతి కుటుంబానికీ బ్యాంక్ ఖాతా ఉండే విధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన అనంతరం 2014 ఆగస్టు 15 న ఎర్రకోట నుంచి చేసిన స్వాతంత్ర్యదినోత్సవ తొలి ప్రసంగంలో అందరికీ బ్యాంకింగ్ ఖాతాలు ఉండేలా గట్టి కృషి జరగాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఇందుకోసం ప్రధానమంత్రి జన్ ధన్ యోజనను తీసుకువాచ్చరు. సమాజంలో అల్పాదాయ వర్గాలు, ప్రధానంగా బలహీన వర్గాల ప్రజలకు పొదుపు ఖాతా సౌకర్యం, వారి అవసరాలకు తగినట్టు రుణసదుపాయం, బీమా సౌకర్యం, పెన్షన్ సదుపాయాలను మరింతగా అందుబాటులోకి తీసుకురావడం. ఈ పథకం లక్ష్యం.

చిన్న వ్యాపారులకు రుణ సదుపాయం కల్పించే ఉద్దేశంతో మైక్రో యూనిట్స్ డవలప్‌మెంట్ రీఫైనాన్స్ ఏజెన్సీ (ముద్రా) పథకాన్ని ప్రవేశపెట్టడం ద్వారా ద్రవ్యసేవల సమ్మిళిత విస్తరణను సాధించేందుకు చర్యలు చేపడుతోంది. అలాగే 2015 నాటికి ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన (పిఎంజెడివై) పథకం కింద దేశంలోని 95 శాతం కుటుంబాలకు బ్యాంకు పొదుపు ఖాతాలను విజయవంతంగా సమకూర్చగలిగింది. అనంతరం కేంద్ర ప్రభుత్వం ప్రజలకు సామాజిక భద్రతను విస్తరింపచేసింది. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న పేదలకు వృద్ధాప్యంలో ఆదాయ భద్రత కల్పించేవిధంగా అటల్ పెన్షన్ యోజన పథకం వీలు కల్పిస్తుంది. అలాగే జీవన్ జ్యోతి పథకం ఏడాదిపాటు జీవిత బీమా సదుపాయం కల్పిస్తుంది. ఆ తదుపరి దానిని పునరుద్ధరించుకుంటూ ఉండవచ్చు. సురక్షా బీమా పథకం ఏటా పొడిగించుకునే వెసులుబాటుతో, ప్రమాద కారణంగా సంభవించే మరణాలకు, అంగవైకల్యానికి బీమా సదుపాయం కల్పిస్తుంది.ప్రధానమంత్రి జన్ ధన్ యోజన పథకం ప్రారంభమైనప్పటినుంచి మంచి పురోగతి సాధిస్తోంది. 2018 ఏప్రిల్ 4న ఈ పథకం ప్రారంభించిన అనంతరం, 31.4 కోట్ల బ్యాంకు ఖాతాలు తెరవగా, అందులో 18.5 కోట్ల ఖాతాలు గ్రామీణ ప్రాంతాలలో ప్రారంభమయ్యాయి. ఇందులో 16.6 ఖాతాలు మహిళల ఖాతాలు. రూపే కార్డుల సంఖ్య 23.7 కోట్లకు చేరింది. 2018 ఏప్రిల్ 4 నాటికి వాణిజ్యబ్యాంకుల వద్ద ఉన్న 9,012.1 కోట్ల రూపాయల డిపాజిట్లతో పోలిస్తే డిపాజిట్ల మొత్తం గణనీయంగా పెరిగింది.

**సవాళ్లు......**

ద్రవ్య సమ్మిళిత సేవలను విస్తృత స్థాయికి తీసుకువెళ్లడంలో గల సవాళ్లు......

1. పిఎంజెడివై కింద ఖాతాలన్నీ నిర్వహణలోలేవు:– ఖాతాదారుల వద్ద డబ్బు లేక కొన్ని ఖాతాలు నిర్వహణలో లేవు. వీటి నిర్వహణ ఖర్చు విషయంలో చూసినట్టయితే ఖాతాలలో స్వల్పమొత్తంలో నిల్వలవల్ల అధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు చేయడం ఎలా అన్నది సమస్య.

2. ఫైనాన్షియల్ లిటరసీ లేకపోవడం: గ్రామీణ ప్రాంతాలలోని చాలావరకు కుటుంబాల వారికి ఆర్థికపరమైన సేవలకు సంబంధించి తగిన అవగాహన లేదు. అందువల్ల పలు ఆర్థిక సంస్థలు అందించే సేవల గురించి వారికి తెలియడం లేదు.

3. పెద్ద సంఖ్యలో ఖాతాలు : పెద్ద సంఖ్యలో ఉన్న ప్రస్తుత ఖాతాలు , కొత్త ఖాతాల వారికి సేవలు అందించాలంటే, ఈ పేమెంట్ వ్యవస్థకు పెద్దఎత్తున సాంకేతిక,వ్యవస్థాగత మౌలిక సదుపాయాలు అవసరం.

4. మానవ వనరుల ప్రణాళిక: బ్యాంకులు, ఇతర సంస్థల సిబ్బందికి తగిన సాంకేతిక నైపుణ్యాభివృద్ధి, శిక్షణ అవసరం.

5. భద్రమైన పరిసరాలు : ఎలక్ట్రానిక్ లావాదేవీల భద్రత ప్రత్యేకించి, పెద్ద

సంఖ్యలో కొత్త ఖాతాలు దేశంలోని పలు మారుమూల ప్రాంతాలలో ఉండడం ఆందోళన కలిగించే అంశం.

6. సులభతర లావాదేవీలు : గ్రామీణ ప్రాంతాలలోని కుటుంబాల వారు రుణం కోసం పదే పదే వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తుండడాన్ని బట్టి, బ్యాంకులలో జరిగే లావాదేవీలు సులభతరంగా లేవని తెలుతోంది.

7. మరింత సాంకేతిక పరిజ్ఞాన వినియోగ ఆవశ్యకత: బ్యాంకింగ్ సేవలవిషయంలో ఎటిఎంల వల్ల సౌలభ్యం ఉన్నప్పటికీ, కేవలం 30 శాతం మంది ఖాతాదారులకు మాత్రమే డెబిట్ కార్డులు ఉన్నాయి.

8. డిమాండ్ వైపు అంశాలు: తక్కువ ఆదాయం, లేదా తక్కువ అసెట్ హోల్డింగ్‌లు, బ్యాంకింగ్ ప్రాడక్టుల గురించి గ్రామీణ ప్రజలకు తగినంత అవగాహన లేకపోవడం,ఎక్కువ లావాదేవీల ఖర్చు, గ్రామీణ ప్రాంత ప్రజల అవసరాలు, వారి రాబడి తీరుతెన్నులకు అనుగుణంగా లేని పథకాలు, మార్పు చేర్పులకు వీలు కాని పథకాలు వంటివి ఆర్థిక వ్యవస్థతో సంబంధాలు నెలకొల్పుకునేందుకు అడ్డంకిగా నిలవవచ్చు.

9. టెక్నాలజీ వినియోగంలో ఖర్చు, రిస్క్: ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వినియోగం కారణంగా ఖర్చుపెరగడం, నగదు నష్టానికి సంబంధించిన రిస్క్‌లు, డాటా దొంగ తనం, ప్రైవసీ ఉల్లంఘన వంటి వాటి విషయంలో బ్యాంకులు మరింత అప్రమత్తంగా ఉండాల్సి ఉంది.

10. సైబర్ సెక్యూరిటీ : గత మూడు సంవత్సరాలలో ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన కింద , సుమారు 31 కోట్ల కొత్త ఖాతాలు ప్రారంభమయ్యాయి. ఇందులో సుమారు 80 శాతం ఖాతాలు తొలిసారి బ్యాంకు ఖాతా వాడుతున్నవారివి. ఖాతాదారుకు సంబంధించిన సమాచారాన్ని తెలిపే కె.వై.సి ని పకడ్బందీగా అమలు జరపకుంటే ఇది సైబర్ సెక్యూరిటీకి ముప్పుగా పరిణమించవచ్చు.

**భవిష్యత్తు**

గడచిన రెండు దశాబ్దాలలో దేశంలోను, విదేశాలలోనూ బ్యాంకింగ్, ఫైనాన్షియల్ పరిశ్రమ రంగంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ద్రవ్యసేవల సమ్మిళిత విస్తరణ ఆర్థిక సమానత్వానికి, ఆర్థిక వృద్ధికి దోహదపడనున్నందున ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రభుత్వాలు పెద్దసంఖ్యలో ప్రజలకు ఫైనాన్షియల్ సేవలు అందుబాటులోకి తెస్తున్నాయి. ఫైనాన్షియల్ ఇంక్లూజన్‌కు వాణిజ్యపర సాధ్యతను తీసుకువచ్చాయి. ఫార్మల్ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూట్‌లు తక్కువ ఖర్చుకాగల బ్యాంకింగ్ సదుపాయాలకు వీలు కల్పిస్తాయి. ఆర్థిక నిధులకు రక్షణ ఉంటుంది. వడ్డీ చెల్లించడం ద్వారా డిపాజిటర్లకు ప్రోత్సాహకాలు ఉంటాయి. బ్యాంకులు తమ వద్ద పొదుపు చేసే వారికి, ఇన్వెస్టర్లకు మధ్య ఉండి అభివృద్ధికి నిధులు సమకూర్చడానికి దోహదపడుతాయి.అంటే ప్రజల వద్ద పొదుపు చేయడానికి డిపాజిట్లు లేకపోవచ్చు. కాని వారికి నిధుల అవసరం ఉండవచ్చు. ఆ నిధులు ఆర్థిక వ్యవస్థకు చోదకంగా పనిచేయవచ్చు , ఉపాధి కల్పనకు ఉపకరించవచ్చు.

భారతదేశంలో రాగల కొద్ది దశాబ్దాలలో ఈ కింది అంశాలను పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది.

ఎ) భారతదేశ ఆర్థికవ్యవస్థ ప్రధానంగా వ్యవసాయం, గ్రామీణ కార్యకలాపాలపై ఆధారపడి ఉంది. 66 శాతం మంది ప్రజలు ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాలలోనే నివశిస్తున్నారు

బి) ప్రపంచ జనాభాలో భారతదేశ జనాభా 16 శాతం. కేవలం నాలుగు శాతం మాత్రమే జలవనరులు ఉన్నాయి. వ్యవసాయ రంగం తీవ్ర నీటి కొరతను ఎదుర్కోనుంది. దీనితోపాటు జనాభా పెరుగుతూ వస్తోంది.

సి) భూమి కొరత, జనాభా పెరుగుదల, నానాటికీ పెరుగుతున్న నగరీకరణ, పారిశ్రామికీ కరణ కారణంగా ఆహారధాన్యాల ఉత్పత్తి, వ్యవసాయ ఉత్పత్తుల ఖర్చులు పెరగనున్నాయి.

డి) 2014 మార్చి 31 నాటికి 123 కోట్ల డిపాజిట్ ఖాతాలు ఉన్నాయి. దీనికితోడు పోస్టాఫీసులలో 28 కోట్ల ఖాతాలు ఉన్నాయి. ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన కారణంగా బ్యాంకులలో 31 కోట్ల కొత్త ఖాతాలు ప్రారంభమయ్యాయి.దీనికితోడు ప్రధానమంత్రి ప్రకటించిన సామాజిక భద్రతా పథకాలు కూడా బ్యాంకింగ్ వ్యవస్థద్వారానే అమలౌతున్నాయి. ఇవికాక ముద్రా బ్యాంకు కూడా ఆర్థికకరంగం చట్రంలోని అట్టడుగు స్థాయిలో బ్యాంకింగ్ కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నది.




ఇ) జన్‌ధన్ యోజన, ఇటీవల ప్రకటించిన ఇతర పథకాల కారణంగా పెద్ద ఎత్తున బ్యాంకింగ్ కార్యకలాపాలకు దారితీయ నున్నాయి. బ్యాంకు బ్రాంచీలు లేని చోట బ్యాంకింగ్ సేవల విషయంలో ఆకాంక్షలు పెరగనున్నాయి. దీనివల్ల వాణిజ్య బ్యాంకులు మారుమూల ప్రాంతాలలో కార్యకలాపాలు సాగించడానికి ఖర్చు ఎక్కువ అయ్యే అవకాశం ఉంది.

ఎఫ్). ప్రభుత్వం వివిధ పథకాల కింద నగదును సాంకేతిక పరిజ్ఞాన వాడకం ద్వారా నేరుగా

ప్రజల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేయనున్నట్టు ప్రకటించింది. ప్రత్యక్ష నగదు బదిలీ పథకం అంటే, ప్రజలకు మరీ ముఖ్యంగా, పేదప్రజలకు అదనపు వనరులు సమకూరినట్టే. గ్రామీణ ప్రాంతాలలో కొనుగోలు శక్తి పెరుగు తున్నది. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ప్రధానమంత్రి ప్రకటించారు. ప్రజలు ఏ దామాషాలో పేదరికం నుంచి బయటపడతారన్నది అంచనా వేయాలి.

**ముగింపు, సిఫార్సులు......**

వినియోగదారులకు ఆర్థిక వనరులను అందుబాటు ధరలలో సమకూర్చడమే సమ్మిళిత ఆర్థిక విధానం లక్ష్యం. ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్‌కు సంబంధించి పెరుగుతున్న సంక్లిష్టతలను దృష్టిలో ఉంచుకుని ఈ రంగానికి సంబంధించి మార్గసూచి (రోడ్‌మ్యాప్), నియంత్రణ అవసరం ఎంతైనా ఉంది.




పెద్దఎత్తున ద్రవ్యసేవల సమ్మిళిత విస్తరణను సాధించేందుకు అవసరమైన డిజిటైజేషన్ గురించి విశ్లేషణ జరపవలసి ఉంది. భారతదేశం వైవిధ్యంతో కూడిన దేశం. ఇక్కడ ఎన్నో భాషలు, మరెన్నో లిపులు ఉన్నాయి. అక్షరాస్యత 70 శాతంగా ఉంది. ఇంగ్లీషు భాష తెలిసినవారైతే జనాభాలో పది శాతం మందికి మించి ఉండరు. మరోవైపు డిజిటల్ విధానంలో బ్యాంకింగ్ కార్యకలాపాల కమ్యూనికేషన్ అంతా ఇంగ్లీషులోనే ఉంటుంది. భారత ఆర్థికక వ్యవస్థను వెంటనే పూర్తిగా డిజిటైజ్ చేయడానికి ఇదొక సహజ అవరోధంగా ఉంటుంది. భారతదేశ జనాభాలో 30 శాతం అంటే సుమారు 40కోట్ల మంది ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారు. ఇందులోనూ 90 శాతం మంది అసంఘటిత రంగంలో ఉన్నారు. వీరు డిజిటల్ విధానాన్ని అలవరచుకోవడానికి కొంతసమయం పడుతుంది. గ్రామీణ ప్రాంతాలలోని షాపులలో వ్యాపారం తక్కువ పరిమాణంలో జరుగు తుంటుంది. ఇలాంటి సంస్థలు ప్లాస్టిక్ మనీకి సంబంధించిన పరికరాలను ఏర్పాటుచేసు కోవడం ఖర్చుతో కూడుకున్నది కావడంతో వారు ఇందుకు పెద్దగా ఆసక్తి చూపకపోవచ్చు. దేశంలోని మారు మూల ప్రాంతాలలో ఇలాంటి పరికరాలు అందుబాటులో ఉండేట్టు చేయడం, అందుబాటు ధరలో నిరంతరాయ కనెక్టివిటీ ఉండేట్టు చూడడం ఒక సవాలు. దీనిని పరిశీలించవలసి ఉంది. ప్రస్తుతం ఈ మనీ విధానం నగరాలకు, గ్రామీణ ప్రాంతాలలోనూ బాగా చదువుకున్న వారికి మాత్రమే పరిమిత మైంది. గ్రామీణ ప్రాంతాలలో స్మార్ట్ ఫోన్‌లు ఉన్నప్పటికీ అవి కుటుంబంలోని ఒక వ్యక్తికి మాత్రమే పరిమితమై ఉంటున్నాయి. దీనితో బ్యాంకింగ్ కార్యకలాపాలు కూడా పరిమిత స్థాయిలోనే ఉంటాయి. డిజిటల్ ఎకానమీని నిర్మించడానికి అవసరమైన అంశాలపై దీర్ఘకాలిక ప్రణాళిక ,కాలపట్టిక, ఇందుకు అయ్యే ఖర్చు అంచనాలను రూపొందించడం అవసరం. భారతదేశ ఆర్థిక వ్యవస్థను వేగంగా డిజిటలైజేషన్ కిందికి తీసుకువచ్చేందుకు ఈ సమస్యను ,సవాళ్లను అర్థం చేసుకోవడానికి ఒక కమిటీ అవసరం. డిజిటైజేషన్ సవాళ్లను గుర్తించిన అనంతరం ఇందుకు సంబంధించి విజయంసాధించడానికి రోడ్‌మ్యాప్‌ను రూపొందించుకోవచ్చు. ప్రభుత్వం వంద నగరాలను ఎంపిక చేసి , అక్కడ దశలవారీగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇతర సదుపాయాలను కల్పించడానికి నిర్ణయించిన స్మార్ట్ సిటీ పథకం వంటి వ్యూహం ఇక్కడ కూడా అనుసరించవలసి ఉంది. డిజిటలైజేషన్‌కు సంబంధించి కూడా పైలట్ ప్రాజెక్టులు చేపట్టడం అవసరం.

ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన విజయంతో మైక్రో, రూరల్ సెక్టర్ రెగ్యులేషన్ విషయంలో స్పష్టమైన విభజన కనిపిస్తోంది. రిజర్వుబ్యాంకు బ్యాంకింగ్ రంగాన్ని పర్యవేక్షిస్తుంది. ఆర్థిక సేవల సమ్మిళిత విస్తరణను కొన్ని దశాబ్దాలుగా వాణిజ్యబ్యాంకులు చేపడుతున్నప్పటికీ దానిపై ప్రధాన దృష్టికి సంబంధించిన విధానం లోపిస్తున్నది. ఇలాంటి పరిస్థితులలో నాలుగు దశాబ్దాలకుపైబడి జవాబుదారీతనం, బాధ్యతతోకూడిన అనుభవం గల నాబార్డ్‌కు సమ్మిళిత ఆర్థిక సేవల విస్తరణకు సంబంధించిన పర్యవేక్షణ, నియంత్రణ బాధ్యతలను అప్పగించడం అవసరం. ■

"పరిపాలనా వ్యవహారాలలో షెడ్యూల్డు కులాలు / షెడ్యూలు తెగల గురించి ప్రస్తావించవలసి వచ్చినపుడు దళిత్ అనే పదాన్ని వాడొద్దని కేంద్ర ప్రభుత్వం గత శనివారం (21-04-2018) విడుదల చేసిన ఒక ప్రకటనలో నిర్దేసించింది. ఆంగ్లంలో షెడ్యూల్డు క్యాస్ట్ / షెడ్యూల్డు ట్రైబ్ అని గానీ, ప్రాంతీయ భాషలలో దానికి సమానమైన పదాన్ని గానీ వాడాలి అని ఒక ఆదేశాన్ని కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్ర/కేంద్ర పాలిత ప్రాంతాలకు పంపింది."



# విజ్ఞాన విపంచి

ప్రాతూరి పోతయ్య శర్మ

**1) ఈస్టర్ ద్వీపం ఎక్కడుంది?**
ఎ) పసిఫిక్ మహాసముద్రంలో, (చిలీ దేశానికి సుమారు 2200 మైళ్ళ దూరంలో)
బి) బంగాళాఖాతం
సి) అట్లాంటిక్ మహాసముద్రం
డి) అరేబియా సముద్రం

**2) అన్నపూర్ణ రేంజ్ (పర్వతశ్రేణిలో) ఏవేవి కలవు?**
ఎ) అన్నపూర్ణ 1 బి) అన్నపూర్ణ సౌత్
సి) గంగాపూర్ణ ; మచ్చు పుచ్చారే ; హిం చూలి
డి) పైవన్నీ

**3) CBSE నిర్వహించే 10, 12వ తరగతి పరీక్షల నిర్వహణ అధ్యయనానికి మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాక నియమించిన కమిటిలో ఎవరెవరు ఉన్నారు?**
ఎ) వినయ్‌శీల ఒబరాయ్ (ఛైర్మన్)
బి) పవనేష్ కుమార్
సి) K.M త్రిపాఠి; J.S రాజ్‌పుట్
డి) పై అందరూ

**4) జూన్ నుండి సెప్టెంబర్ (4 నెలలపాటు) కురిసే వర్ష పాతం 2018లో ఎంత ఉండవచ్చును?**
ఎ) 400 మిల్లి మీటర్లు
బి) లాంగ్ పీరియడ్ సగటు 887 మిల్లి మీటర్లు (నార్మల్ 100 శాతం)
సి) 200 మిల్లి మీటర్లు
డి) 100 మిల్లి మీటర్లు

**5) భారత రాజ్యాంగంలోని ఎన్నవ ఆర్టికల్ ప్రకారం రాష్ట్ర గవర్నర్, నేరస్తులకి క్షమా భిక్ష ప్రసాదించే అధికారం ఉంది?**
ఎ) ఆర్టికల్ 161 బి) ఆర్టికల్ 72
సి) ఆర్టికల్ 52 డి) ఆర్టికల్ 14

**6) ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1951లోని ఎన్నవ సెక్షన్ ప్రకారం, ఒక వ్యక్తి రెండు నియోజక వర్గాల నుండి ఎన్నికల్లో పోటీ చేయవచ్చును?**
ఎ) సెక్షన్ 5 బి) సెక్షన్ 33 (7)
సి) సెక్షన్ 2 డి) సెక్షన్ 10

**7) 'కేంబ్రిడ్జ్ అనలిటికా', రాజకీయ కన్సల్టెన్సీ చేసిన్తా ఎవరి డేటాను పొందింది అంటున్నారు?**
ఎ) ఫేస్ బుక్ వినియోగ దారుల డేటా
బి) ట్విట్టర్ సి) వాట్సఆప్ డి) బింగ్

**8) హంగేరీ రాజధాని ఏది ?**
ఎ) బుడాపెస్ట్ బి) మాస్కో
సి) టోక్యో డి) జకార్తా

**9) హంగేరీ దేశ పార్లమెంటరీ ఎన్నికల్లో ఎవరు విజయం సాధించారు?**
ఎ) మైఖేల్ మాక్ కార్మాక్ బి) ఒర్బాన్ ఫిడ్స్ జ్
సి) అర్మేన్ సార్స్యాన్ డి) ట్రాన్ డై క్వాంగ్

**10) ఏ దేశాలను విజయవంతమైన 'ఇల్లిబరల్ స్టేట్స్' అంటున్నారు ?**
ఎ) హంగేరీ బి) చైనా సి) టర్కీ డి) పైవన్నీ

**11) కామన్ వెల్త్ క్రీడల్లో, భారతదేశం ఎప్పుడు పాల్గొన లేదు?**
ఎ) 1930 బి) 1986 సి) 1962 డి) పైవన్నీ

**12) ఆక్సిటోసిన్ అనే హార్మోన్‌ని ఉత్పత్తి చేసే గ్రంథి ఏది?**
ఎ) పిట్యూటరి గ్రంధి బి) కాలేయం
సి) థైరాయిడ్ డి) స్వేద గ్రంది

**13) 'ఆపరేషన్ ఇన్‌సానియత్' ఏ దేశ కాందిశీకుల సహాయం / పునరావాసం కోసం చేస్తున్నారు?**
ఎ) మయన్మార్‌కి చెందిన రోహింగ్యాల కోసం
బి) సిరియా సి) ఇరాక్ డి) పాలస్తీనా

**14) భారతదేశం సైన్యం కోసం రూ.1000 కోట్లు వెచ్చించి ఎన్ని బుల్లెట్ ప్రూఫ్ జాకెట్స్ (BPJs) కొనదల్చింది ?**
ఎ) 3.53 లక్షలు బి) 1,86,138
సి) 50,000 డి) 2 లక్షలు

**15) 'విశాఖ' కేసు తీర్పు / మార్గ దర్శక సూత్రాలు దేనికి సంబంధించినవి?**
ఎ) మురికి నీటి శుభ్రత
బి) పబ్లిక్ కార్యాలయాల్లో / పనిచేసే చోట్ల మహిళల వేధింపుల నిలుపుదల కోసం
సి) రోడ్ల శుభ్రత
డి) తుఫాను సహాయం

**16) ఇంటర్ నెట్ అఫ్ థింగ్స్ (IoT) వల్ల ఒనగూరే సదుపాయాలు ఏవి ?**
ఎ) కంప్యూటర్ వంటి పరికరాలకు ఆపరేటింగ్ సిస్టమ్స్
బి) పరికరాల నియంత్రణ , పరిరక్షణ కోసం 'క్లౌడ్' సర్వీస్‌లు
సి) అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్‌తో అంతర్ వీక్షణం పొందటానికి డి) పైవన్నీ

**17) IRNSS-1 I (one ×) వివరాలేవీ ?**
ఎ) నావిక్ (NaViC) లో ఇది 8వది
బి) 1425 కిలో గ్రాముల బరువు
సి) PSLV-C 41 రాకెట్ ద్వారా పంపించారు
డి) పైవన్నీ

**18) ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్?**
ఎ) చంద్రయాన్ – 2 : 2018 సంవత్సరం చివరిలో ప్రయోగిస్తారు.
బి) GSLV-MkIII, GSAT–29 కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని మోసుకు పోతుంది.
సి) GSAT-11 (బరువు 5.7 టన్నులు)ను యురోపియన్ రాకెట్ ద్వారా పంపిస్తారు
డి) పైవన్నీ (ఇస్రో ప్రణాళికలు )

**19) 2018లో నిర్వహించిన XXI కామన్ వెల్త్ గేమ్స్ గురించి ఏది కరెక్ట్?**
ఎ) కేర్రారా స్టేడియం, గోల్డ్ కోస్ట్, క్వీన్స్ ల్యాండ్, ఆస్ట్రేలియాలో ప్రారంభమ య్యాయి.
బి) ప్రారంభోత్సవ పెరేడ్‌లో P.V. సింధు, భారత బృందం ముందు నడిచింది.
సి) లూయిస్ మార్టిన్ CGF అధ్యక్షుడు
డి) పైవన్నీ

**20) ఇన్‌సాల్వెన్సి & బ్యాంక్రప్టసి బోర్డ్ ఆఫ్ ఇండియా (IBBI) ఛైర్మన్ ఎవరు?**
ఎ) ఇంజేటి శ్రీనివాస్ బి) M.S.సాహూ
సి) R.మహాజన్ డి) అతుల్ M గౌట్సుర్వే

**21) ఏప్రిల్ 2017 నుండి ఫిబ్రవరి 2018 వరకు భారత దేశం ఎంత క్రూడ్ స్టీల్ ఉత్పత్తి చేసి, ప్రపంచంలో రెండవ స్థానానికి చేరుకుంది? (మిలియన్ టన్నులలో)**
ఎ) 300 బి) 93.11 సి) 70 డి) 50

**22) ఆధార్ చట్టంలోని సెక్షన్ 2 (g) బయోమెట్రిక్‌కి వేటిని ఉదాహరణగా తెల్పింది?**
ఎ) ఫొటోగ్రాఫ్; బి) ఫింగర్ ప్రింట్
సి) ఐరిస్ స్కాన్; లేక ఏ ఇతర బయోలాజికల్ లక్షణాలు డి) పైవన్నీ

**23) ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్ ?**
ఎ) TV చానల్స్ నియంత్రణకు : కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్ రూల్స్.

బి) ప్రింట్ మీడియా నియంత్రణకు : ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా
సి) IDEX స్కీం : ఇన్నోవేషన్ ఫర్ డిఫెన్సు ఎక్సలెన్సీ స్కీం డి) పైవన్నీ

**24) షోరెన్ స్టీన్ జర్నలిజం అవార్డు (2017) ఎవరికీ ఇచ్చారు?**
ఎ) సిద్ధార్థ వరద రాజన్ ('ది వైర్స్' ఎడిటర్)
బి) నయన చందా సి) కేదార్ సింగ్
డి) కనకలతా మొహంతి

**25) ఇంటర్నెట్ సెక్యూరిటీ థ్రెట్ రిపోర్ట్ ప్రకారం ఎన్ని రకాల ద్వారా కంప్యూటర్ సెక్యూరిటీ కి హాని కలుగుతోంది?**
ఎ) మాల్వేర్ ; రాన్ సమ్ వేర్
బి) స్పాం ; ఫిషింగ్ ; బాట్స్
సి) నెట్‌వర్క్ ఎట్టాక్; వెబ్ ఎట్టాక్; క్రిప్టో మైనర్స్
డి) పైవన్నీ

**26) స్నాచ్, క్లీన్‌బీ జెర్క్ వంటి సాంకేతిక పదాలు ఏ ఆటల పోటీలో ఉంటాయి?**
ఎ) వెయిట్ లిఫ్టింగ్ బి) వాలీ బాల్
సి) ఫుట్ బాల్ డి) షాట్ పుట్

**27) 2018 ఆర్థికాభివృద్ధి కొలవటానికి RBI ఏ పద్ధతికి మారినట్లుగా తెల్పింది (ప్రపంచ దేశాలకి అనుగుణంగా)?**
ఎ) GVA బి) GDP సి) IIP డి) WPI

**28) అన్టేలోప్ జాతికి చెందిన బ్లాక్ బక్ (కృష్ణ జింక) రక్షిత జంతువుగా ఎందులో పేర్కొన్నారు?**
ఎ) షెడ్యూల్ 1, వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ ఆక్ట్, 1972
బి) ఫారెస్ట్ డ్వెల్లర్స్ ప్రొటెక్షన్ ఆక్ట్
సి) PETA డి) TADA

**29) WHO & UNICEF విడుదల చేసిన 10 స్టెప్స్ మార్గదర్శక సూత్రాల ప్రకారం పుట్టిన బిడ్డకు రెండు సంవత్సరాల వయస్సు వచ్చే వరకు, తల్లి పాలను తాగిస్తే ఎంత మంది పిల్లల ప్రాణాలు కాపాడ వచ్చును, ప్రతి ఏటా?**
ఎ) 8,20,000 (5 ఏళ్ల లోపు పిల్లల్ని)
బి) ఒక లక్ష సి) రెండు లక్షలు
డి) మూడు లక్షలు

**30) బ్యాంకు బోర్డు బ్యూరో (BBB) కొత్త చైర్మన్ ఎవరు?**
ఎ) భాను ప్రతాప్ శర్మ బి) వేదికా భండార్కర్
సి) P. ప్రదీప్ కుమార్ డి) ప్రదీప్ షా

**31) RBI రూల్స్ ప్రకారం, బ్యాంకులో తీసుకున్న అప్పులో, అసలు కాని, వడ్డీ కాని కట్టక పోతే, ఎప్పుడు NPA గా నిర్ధారించాలి?**
ఎ) స్పెషల్ మెన్షన్ ఎకౌంటు (SMA) – 0 (ఒక రోజు నుండి 30 రోజుల వరకు)
బి) SMA-1 (30 నుండి 60 రోజుల వరకు)
సి) SMA-2 (60 నుండి 90 రోజుల వరకు)
డి) 90 రోజులు దాటితే

**32) 15వ ఆర్థిక సంఘం, రాష్ట్రాలకిచ్చే సహాయం కోసం సిఫార్సు చేయడానికి, ఏ అంశాలను పరిగణనలోకి తీసుకోమని కేంద్రం కోరింది అంటున్నారు?**
ఎ) రాష్ట్రాలు జనాభా నియంత్రణ కోసం తీసుకున్న చర్యలను (2011 జనాభా లెక్కలు కావచ్చును, అని ఒక వ్యాఖ్య)
బి) భారత రాజ్యాంగం
సి) రాష్ట్రాలలో శాంతి
డి) రాష్ట్రాల పారిశ్రామిక అభివృద్ధి

**33) డిఫెన్సు ఎక్స్‌పో ఇటీవల ఎక్కడ నిర్వహించారు?**
ఎ) హైదరాబాద్
బి) తిరువిడాం తై, కాంచీపురం జిల్లా, తమిళనాడు
సి) పూణే డి) నాగపూర్

**34) IPL గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ ఎవరు ?**
ఎ) CK ఖన్నా బి) రాజీవ్ శుక్లా
సి) KS విశ్వనాథన్ డి) విరాట్ కోహ్లి

**35) సుప్రీమ్ కోర్ట్ ప్రధాన న్యాయమూర్తిని, ఏమని అభివర్ణించ వచ్చును?**
ఎ) 'అయనలో ఓ సంస్థ ఉంది'
బి) అయన 'మాస్టర్ ఆఫ్ రోస్టర్'
సి) 'అపనమ్మకం ఊహించటానికి, లేశ మంతైన అవకాశం లేని వ్యక్తి'
డి) పైవన్నీ (ఇటీవల ఇచ్చిన తీర్పు ప్రకారం)

**36) రత్నగిరి రిఫైనరి & పెట్రో కెమికల్స్‌ను ఎవరు స్థాపించారు?**
ఎ) ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్
బి) HPCL సి) BPCL
డి) పై మూడు సంస్థలు

**37) రాణి రుద్రమదేవి (క్రీస్తు శకం 1262 – 1289) కాయస్థ రాజు అంబదేవతో యుద్ధం చేస్తున్న శిల్పం, ఇటీవల ఎక్కడ కనుగొన్నారు?**
ఎ) త్రికూట ఆలయం, బెక్కల్లు గ్రామం, సిద్ధిపేట జిల్లా
బి) మల్కాపురం, గుంటూరు జిల్లా
సి) బొల్లి కుంటా గ్రామం, వరంగల్ జిల్లా
డి) పాలకొల్లు

**38) 'పనస పండు' ఏ రాష్ట్ర పండుగా డిక్లేర్ చేశారు? (ఇది బంగ్లాదేశ్, శ్రీ లంక దేశ జాతీయ పండు కూడా అంటారు)**
ఎ) హిమాచల్‌ప్రదేశ్ బి) కేరళ
సి) బీహార్ డి) ఉత్తర ప్రదేశ్

**39) ఒడిశాలో 'తేల్' నది దేనికి ఉపనది?**
ఎ) మహానది బి) నర్మదా నది
సి) గంగ నది డి) వంశధార నది

**40) 'ఐల్ ఆఫ్ స్కై' ఎక్కడుంది ?**
ఎ) స్కాట్ ల్యాండ్ బి) కెనడా
సి) ఆస్ట్రేలియా డి) జపాన్

**41) XXI కామన్ వెల్త్ గేమ్స్ వివరాలేవీ ?**
ఎ) 275 అంశాలలో (20 డిసిప్లిన్‌లలో) పోటీలు నిర్వహించారు
బి) 71 దేశాలు, ప్రాంతాల నుండి దాదాపు 6,500 క్రీడాకారులు పోటీలలో పాల్గొన్నారు.
సి) ప్రిన్స్ చార్లెస్ పోటీలు ప్రారంభించారు
డి) పైవన్నీ

**42) ఏప్రిల్ 4, 1968 (50 ఏళ్ల క్రితం) హత్యకు గురైన మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్, దేని చేత ప్రభావితం అయ్యి, దాన్ని జీవితంలో అమలుచేసాడు?**
ఎ) అహింసా బి) గో రక్షణ
సి) ప్రకృతి పరిరక్షణ
డి) వాతావరణ పరిరక్షణ

**43) 2018 NIRF ఇండియా ర్యాంకింగ్స్ ప్రకారం 'ఓవరాల్ ' కేటగిరిలో ఏది ప్రథమ స్థానంలో ఉంది?**
ఎ) IISc, బెంగళూరు బి) IIT, మద్రాస్
సి) IIT, ఢిల్లీ
డి) క్రిస్టియన్ మెడికల్ కాలేజీ, వెల్లూర్

**44) GSAT-6 A వివరాలేవీ ?**
ఎ) దీని ఆర్బిటాల్ పీరియడ్ 18 – 20 గంటలు
బి) మిలిటరీ కమ్యూనికేషన్స్ పెంపుదల కోసం ప్రయోగించారు (మార్చ్ 29 , 2018 నాడు)
సి) మూడవది / ఫైనల్ ఫైరింగ్ షెడ్యూల్‌లో ఉండగా, ఉపగ్రహంతో కమ్యూనికేషన్ కోల్పోయాం
డి) పైవన్నీ (ఇది GSAT-6 వంటిది. దీనికి 6 మీటర్ల S బ్యాండ్ యాంటెన్నా ఉంది)

**45) 'వాలాంగ్ ట్రై – జంక్షన్ (అరుణాచల్ ప్రదేశ్‌లో) ఏ దేశాల సరిహద్దులో ఉంది?**
ఎ) ఇండియా బి) చైనా
సి) మయన్మార్ డి) పై మూడు

**46) చైనా స్పేస్ ల్యాబ్ 'టియాన్ గాంగ్ – 1' ఏ సముద్రంలో పడిపోయింది ?**
ఎ) సౌత్ పసిఫిక్ మహాసముద్రం
బి) ఆర్కిటిక్ సముద్రం సి) బెర్రింగ్ సీ
డి) ఎర్ర సముద్రం

**47) శ్రీ గురు రాందాస్ జీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ ఎక్కడుంది?**

ఎ) గుల్బర్గా బి) అమృత్‌సర్

సి) భోపాల్ డి) రాయ్‌పూర్

**48) కవి, రచయిత్రి, మహాలఖా బాయి (చంద్రుని వంటి ముఖం కలది) (క్రీస్తు శకం 1768 - 1824) హైదరాబాద్‌లో ఎవరి కాలంలో జీవించింది?**

ఎ) అసఫ్ జా II బి) ఇబ్రహీం కుతుబ్‌షా

సి) శ్రీకృష్ణ దేవరాయలు

డి) రాణి రుద్రమదేవి

**49) వాండూర్ బీచ్, హావ్ లాక్ దీవి, కార్బిన్స్ కోవ్ ఎక్కడున్నాయి?**

ఎ) గోవా బి) అండమాన్ & నికోబార్ దీవులు

సి) డెహ్రాడూన్ డి) లక్ష ద్వీప్

**50) గోండి భాషను మాట్లాడే గోండులు, ఏ ఏ రాష్ట్రాలలో ఉన్నారు?**

ఎ) మధ్య ప్రదేశ్ ; గుజరాత్

బి) తెలంగాణా ; మహారాష్ట్ర

సి) ఛత్తీస్ ఘర్ ; ఆంధ్ర ప్రదేశ్

డి) పైవన్నీ

**51) నేషనల్ యాన్యు వల్ రూరల్ సానిటేషన్ సర్వే (NARSS) 2017-18 ప్రకారం బహిరంగ మల మూత్ర విసర్జన లేని రాష్ట్రాల లిస్టులో 100 శాతంతో ఏవి ప్రథమ స్థానంలో ఉన్నాయి?**

ఎ) కేరళ & మిజోరాం

బి) UP సి) బీహార్ డి) ఒడిశా

**52) గ్రీన్ జాకెట్ ఏ క్రీడలో గెలుపొందిన వారికిస్తారు?**

ఎ) గోల్ఫ్ బి) బిలియర్డ్స్

సి) బాడ్ మింటన్ డి) టెన్నిస్

**53) పాన్ గాంగ్ త్సో & లేక్ త్సో మేరారి సరస్సులు ఎక్కడున్నాయి?**

ఎ) లడక్ బి) మంగోలియా

సి) ఆఫ్ఘనిస్తాన్ డి) చైనా

**54) ఆధార్ కార్డు వాడుకునేటప్పుడు వేటిని ఉపయోగించమని UIDAI తెల్పింది ?**

ఎ) OTP బి) ఫింగర్ ప్రింట్స్

సి) ఐరిస్ డి) పైవాటిల్లో ఏదైనా

**55) జనరల్ డేటా ప్రొటెక్షన్ రెగ్యులేషన్ (GDPR) ఎవరు అమలులోకి తీసుకురానున్నారు ?**

ఎ) యురోపియన్ యూనియన్

బి) USA సి) మెక్సికో డి) అర్జంటినా

**56) జార్ఖండ్ జనాభాలో 26 శాతం ప్రజలు షెడ్యూల్డ్ తెగలవారు. వీరు ఏ జిల్లాల్లో నివసిస్తున్నారు?**

ఎ) కుంతి జిల్లా ; గుమ్లా జిల్లా

బి) సిమ్డేగా జిల్లా

సి) పశ్చిమ సింగభూం జిల్లా డి) పైవన్నీ

**57) 65వ నేషనల్ ఫిలిం అవార్డులు ఎవరికిస్తారు?**

ఎ) ఉత్తమ నటుడు : రిద్ధి సేన్ ('నగర్ కీర్తన్')

బి) ఉత్తమ నటి : శ్రీదేవి ('మామ్ )

సి) ఉత్తమ దర్శకుడు : జయ్ రాజ్ ('భయానకం) డి) పైవన్నీ

**58) 2018లో దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు ఎవరికిచ్చారు?**

ఎ) వినోద్‌ఖన్నా (ఈ అవార్డు అందుకున్న వారిలో ఈయన 49వ వ్యక్తి)

బి) శశి కపూర్ సి) రాజేష్ ఖన్నా

డి) లతా మంగేష్కర్

**59) బౌద్ధ సంస్కృతి, శిల్పాలు ఉన్న ఉదయ గిరి, రత్నగిరి, ఏ రాష్ట్రములో ఉన్నాయి ?**

ఎ) ఒడిశా బి) బీహార్

సి) ఉత్తర్‌ప్రదేశ్ డి) తమిళనాడు

**60) ఎర్త్ అవర్ (భూమి 'గంట' కాలం) పాటించటం 2007లో ఎక్కడ ప్రారంభమయ్యింది?**

ఎ) ఆస్ట్రేలియా బి) పారిస్

సి) ఈజిప్ట్ డి) న్యూయార్క్

**61) 'కంగారూ రూట్' అనే విమాన సర్వీస్ ఎక్కడ నుండి ఎక్కడ వరకు? (ప్రయాణ దూరం సుమారు 14,498 కిలో మీటర్లు)**

ఎ) ఆస్ట్రేలియా - బ్రిటన్

బి) లండన్ - కేప్ టౌన్

సి) మాస్కో - బీజింగ్

డి) బీజింగ్ - టోక్యో

**62) 'ఫేస్ ID' ఆధార్ అథేన్‌టికేషన్, ఎప్పటి నుండి అమలులోకి వస్తుంది, అంటున్నారు?**

ఎ) జూన్ 1, 2018

బి) డిసెంబర్ 1, 2018

సి) సెప్టెంబర్ 1, 2018

డి) అక్టోబర్ 10, 20 18

**63) కేంబ్రిడ్జ్ అనాలిటికా (CA), CEO ఎవరు?**

ఎ) అలెగ్జాండర్ టేలర్

బి) అలెగ్జాండర్ కోగాన్

సి) రాబర్ట్ మెర్సర్ డి) స్టీవ్ బన్నాన్

**64) వ్లాదిమిర్ పుతిన్, రష్యా అధ్యక్షుడిగా మళ్ళీ ఎన్నికయ్యారు. రష్యా అధ్యక్ష పదవి ఎంత కాలం (సంవత్సరాలలో)?**

ఎ) 6 బి) 4 సి) 2 డి) 8

**65) 'ఆండ్రియా జఫీ రాకో' కు ఇటీవల వచ్చిన అవార్డు ఏది?**

ఎ) గ్లోబల్ టీచర్ ప్రైజ్ బి) అకాడమీ అవార్డ్

సి) లారియాస్ అవార్డు డి) బాఫ్టా అవార్డు

**66) లోక్ తక్ సరస్సులో నీటిని పరీక్షించటానికి, ఒక పడవలో లేబరేటరీని ప్రవేశపెట్టారు. లోక్ తక్ సరస్సు ఎక్కడుంది?**

ఎ) మణిపూర్ బి) మధ్య ప్రదేశ్

సి) జార్ఖండ్ డి) ఉత్తరాఖండ్

**67) కోల్డ్ ఫ్యూషన్ లేక 'లో ఎనర్జీ న్యూక్లియర్ రియాక్షన్' (LENR) లో వేటిని వాడతారు?**

ఎ) హైడ్రోజన్ / డ్యుటీరియం

బి) పల్లడియం, జిర్కోనియం,

సి) నికెల్

డి) పై వాటిల్లో కొన్నింటిని (శక్తిని విడుదల చేయటం కోసం)

**68) క్రీస్తు శకం 1598లో ఢిల్లీలో నిర్మించిన అబ్దుర్ రహీంఖాన్ - ఏ - ఖానన్ నిర్మాణం దేనికి స్ఫూర్తి అంటారు? ( పెర్సి బ్రౌన్ ప్రకారం)**

ఎ) తాజ్ మహల్ బి) చార్మినార్

సి) కుతుబ్ మీనార్ డి) గోల్ గుమ్బజ్

**69) గోల్డ్ కోస్ట్ కామన్ వెల్త్ గేమ్స్‌లో 'గోల్డెన్ డే' నాడు (2018) ఎవరెవరు బంగారు పథకాలు సాధించారు?**

ఎ) మేరీ కాం ; సంజీవ్ రాజ్ పుట్

బి) మానిక బాత్రా ; గౌరవ్ సోలంకి

సి) వినేష్ ఫోగాట్ ; సుమీత్ మాలిక్

డి) పై అందరూ

**70) సిరియా దేశంపై సుమారు 100 క్షిపణులతో ఇటీవల దాడి చేసిన దేశాలేవి?**

ఎ) USA బి) బ్రిటన్ సి) ఫ్రాన్స్

డి) పైవన్నీ (కెమికల్ ఆయుధాల ప్రదేశాలపై దాడి చేసి నట్లు చెప్పుకుంటున్నాయి)

## జవాబులు (మే - 2018)

| | | | |
|---|---|---|---|
| 1-ఎ | 19-డి | 37-ఎ | 55-ఎ |
| 2-డి | 20-బి | 38-బి | 56-డి |
| 3-డి | 21-బి | 39-ఎ | 57-డి |
| 4-బి | 22-డి | 40-ఎ | 58-ఎ |
| 5-ఎ | 23-డి | 41-డి | 59-ఎ |
| 6-బి | 24-ఎ | 42-ఎ | 60-ఎ |
| 7-ఎ | 25-డి | 43-ఎ | 61-ఎ |
| 8-ఎ | 26-ఎ | 44-డి | 62-ఎ |
| 9-బి | 27-బి | 45-డి | 63-ఎ |
| 10-డి | 28-ఎ | 46-ఎ | 64-ఎ |
| 11-డి | 29-ఎ | 47-బి | 65-ఎ |
| 12-ఎ | 30-ఎ | 48-ఎ | 66-ఎ |
| 13-ఎ | 31-డి | 49-బి | 67-డి |
| 14-బి | 32-ఎ | 50-డి | 68-ఎ |
| 15-బి | 33-బి | 51-ఎ | 69-డి |
| 16-డి | 34-బి | 52-ఎ | 70-డి |
| 17-డి | 35-డి | 53-ఎ | |
| 18-డి | 36-డి | 54-డి | |

■

## రైల్వేలలో రిజర్వేషన్ ఛార్టులకు స్వస్తి:



ఈ మార్చి నెల ఒకటవ తేదీ నుండి రైల్వే శాఖ బోగీలపై రేజర్వేషన్ చార్టులను అతికించడం ఆపేసిందని మనలో చాలా మంది గమనించే ఉంటారు. ప్రయోగాత్మకంగా ఆరునెలల పాటు చేసే ఈ ప్రయోగాన్ని ముందుగా ఎక్కువ రద్దీ ఉండే ఏ1బీ ఏబీ బి కేటగిరి రైల్వే స్టేషన్లయిన హజ్రత్ నిజాముద్దీన్, ముంబై సెంట్రల్, చెన్నై సెంట్రల్, హౌరా, సేయల్దహ్ స్టేషన్లలో అమలుచేస్తున్నారు. అయితే ప్లాట్ ఫారాల పైన, టికెట్ కలెక్టర్ల దగ్గర పాత విధానమే కొనసాగుతుంది. హరిత చొరవలో భాగంగా ముందుగా ఈ కార్యక్రమాన్ని బెంగుళూరు, యశ్వంతపూర్ రైల్వే స్టేషన్లలో నవంబర్ 2016 లోనే మొదలు పెట్టారు. అక్కడి నైరృతి రైల్వే విభాగంవారు 60 లక్షల రూపాయలను పేపర్ కొనుగోలుపై పొదుపు చేయగలిగారు. దక్షిణ రైల్వే విభాగం వారు ప్రతి సంవత్సరం 1.7 లక్షల రూపాయలను పొదుపు చేయగలరని అంచనా!

## అలుపెరుగని కలం యోధుడు:



ఉత్తర ప్రదేశ్‌లోని ముజఫర్ నగర్‌లోని గాంధీ కాలనీలో ఉండే దినేష్ ది ఒక విశిష్ట వ్యక్తిత్వం. కేవలం ఒక ఉద్యోగం చేసి ఇంటికి రావడానికే ఆపసోపాలు పడుతున్న ప్రజలు ఎక్కువగా ఉన్న ఈ రోజుల్లో, ఈయన ఉదయం లేచి మూడు గంటలు శ్రమపడి ఒక చేతి రాతతో కూడిన దినపత్రికను ముద్రించి (ముద్రించడమంటే, ఒక ప్రతిని రాసి దాని నకళ్లను తీయడం) చుట్టుపక్కల గ్రామాల వారికి అందచేసి, తరువాత తన ఉద్యోగానికి వెళ్తుంటాడు. ఆశ్చర్యంగా ఉన్నది కదా! కానీ ఇది నిజం. ఈ దిన పత్రికలో వర్తమాన వార్తా విశేషాలతో పాటు, విభిన్న జాతీయ అంశాలపై తన వ్యాఖ్యలను, షేర్ మార్కెట్ వివరాలనూ, తదితర అంశాలను జోడించి, ప్రతులను ముఖ్యమంత్రికీ, ప్రధాన మంత్రికి సైతం పంపిస్తుంటాడు ఈ నిత్య కృషీవలుడు. ఈయన తన దిన పత్రికకు, "విద్యా దర్శన్" అని పేరుపెట్టాడు. గత 17 సంవత్సరాలుగా ఎవరి నుండీ ఎటువంటి సహాయం లేకుండా అవిచ్ఛిన్నంగా దినపత్రికను అందచేస్తున్న ఈ కలం వీరునికి ప్రభుత్వ గుర్తింపు సమంజసం.

## మంచి నిర్ణయం:



ఢిల్లీ ప్రభుత్వం వారంలో ఒక రోజు పాఠశాలలకు వెళ్ళే పిల్లలకు పుస్తకాల సంచీనీ తీసుకు వెళ్లక్కరలేకుండా ఒక మంచి నిర్ణయం తీసుకున్నది. మామూలుగా ప్రైవేటు స్కూళ్ళు, కాన్వెంటులే ప్రపంచమైన నేటి రోజులలో చిన్నారులు ఎంతెంత బరువులు మోయవలసి వస్తున్నదో మనందరకూ తెలుసు. ఇలా పుస్తకాల సంచీ లేని రోజున పిల్లలకు వివిధ పోటీలు, క్విజ్‌లు, వంటివాటిని నిర్వహించాలని దక్షిణ ఢిల్లీ మేయర్ కమల్జిత్ షెరావత్ అన్నారు. అయితే పూర్తి విధివిధానాలను ఇంకా సమగ్రంగా రూపొందించాల్సి ఉన్నది. దక్షిణ ఢిల్లీ లో మొత్తం మూడు లక్షల విద్యార్థులకు 581 పాఠశాలలు సేవలనందిస్తున్నాయి. సామాజిక సంస్కరణలలో ఢిల్లీ ప్రభుత్వం మిగతా దేశం కంటే ఒక అడుగు ముందే ఉంటున్నది. వివాహాలలో ఏడవ అడుగుగా కట్నం తీసుకోమని, కోడలిని చంపమని అత్తవారితో ప్రతిజ్ఞ చేయించడం, రోడ్లపై తిరిగే వాహనాలను సరి, బేసి సంఖ్యలతో నియంత్రించడం, ఇప్పుడు ఈ చిన్నపిల్లలకు ఇచ్చిన సౌకర్యం వంటివి వీటిని సూచిస్తున్నాయి.

## దేశంలోని మొదటి సౌర నగరం దియు:



దియు-దామన్ కేంద్రపాలిత ప్రాంతంలోని దియు నగరం దేశంలోని మొదటి సౌర నగరంగా రికార్డులకెక్కింది. జిల్లా ప్రధాన కేంద్రమైన దియుకు గృహ, పారిశ్రామిక అవసరాలకు విద్యుత్‌ను ఇకపై పూర్తిగా సౌర విద్యుత్ ద్వారానే అందచేస్తారు. అనంతము, పర్యావరణ హితము అయిన ఈ సౌర విద్యుత్ ఇకపై ఈ నగరంలోని అన్ని అవసరాలకూ అక్కరకొస్తుంది. ఈ విజయం కేవలం మూడు సంవత్సరాలలోనే సాధ్యమైనదని అంటే మీకు ఆశ్చర్యం కలగవచ్చు. కేవలం 42 చదరపు కిలోమేటర్ల విస్తీర్ణంలో 56,000 ల జనాభాతో ఉన్న ఈ నగరంలో 50 ఎకరాలలో ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ కేంద్రం ఉత్పత్తి చేసే 13 మెగా వాట్ల విద్యుత్ మొత్తం నగర అవసరాలకు సరిపోతుంది. గతంలో ఈ నగరానికి గుజరాత్ పవర్ గ్రిడ్ నుండి విద్యుత్ సరఫరా అందేదీ. దీనిలో భారీగా సరఫరా నష్టాలను చవిచూసేది. సౌర విద్యుత్ ప్రారంభం వల్ల ప్రజల విద్యుత్ ఛార్జీల భారం 12 శాతం తగ్గింది.

### రైల్వే స్టేషన్లలో ఆరోగ్యకేంద్రాలు:



దేశంలోని అన్నీ రైల్వే స్టేషన్లలో త్వరలో ఆరోగ్య కేంద్రాలను, జానా ఔషధీ కేంద్రాలను ప్రారంభించనున్నారు. ఈ సంవత్సరం బడ్జెట్ లో ప్రతిపాదించిన జాతీయ ఆరోగ్య ప్రణాళికలో భాగంగా ఈ బృహత్ యత్నం లో అవసరమైతే ప్రైవేటు వ్యక్తుల, పదవి విరమణ చేసిన సీనియర్ డాక్టర్ల సహాయాన్ని కూడా తీసుకుంటామని రైల్వే మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా కొన్ని ఎంపిక చేసిన రైల్వే స్టేషన్లలో మహిళలకోసం సానిటరీ పాడ్ వెండింగ్ మెషిన్ లను ఏర్పాటు చేస్తారు. మహిళలకు తక్కువ ధరలో వీటిని అందచేస్తారు. కేంద్ర ఫార్మాస్యూటికల్స్, రసాయనాల మంత్రిత్వ శాఖ ప్రారంభించిన "ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధీ పరియోజన" పథకం కింద ఈ మందుల షాపులను ప్రధానంగా, దేశవ్యాప్తంగా ఉన్న 20,000 ల మంది రైల్వే పోర్టర్ల ఆరోగ్య పరిరక్షణ ప్రధాన లక్ష్యంగా ఏర్పాటు చేస్తారు.

### ఇంకుడు గుంత నిర్మాణం:




వేసవి వచ్చేసింది. రెండు తెలుగు రాష్ట్రాలూ నీటి కోసం కటకట లాడుతున్నాయి. ప్రతి ఇంటిలోనూ ఇంకుడు గుంతల నిర్మాణానికి ఇదే సరైన సమయం. సాధారణ వర్షపాతంరోజున వంద చదరపు మీటర్ల పైకప్పు ఆవరణలో కురిసిన వర్షపునీరు రోజుకు దాదాపు రెండువేల లీటర్లు ఉంటుంది. ఈ మొత్త నీటిని భూమిలోకి ఇంకేటట్లు చేయడానికి కేవలం 6 క్యూబిక్ మీటర్ల ఇంకుడుగుంత సరిపోతుంది. ఒక క్యూబిక్ మీటరు ఇంకుడు గుంత నిర్మాణానికి రూ. 3,474/- లు ఖర్చవుతుంది. మొత్తం 6 క్యూబిక్ మీటర్ల ఇంకుడుగుంతకు సుమారు రూ. 20,000/- లు ఖర్చవుతుందని అంచనా! మొదట అనుకూలంగా ఉన్న స్థలంలో అనువైన పొడవు, వెడల్పుతో 2 మీటర్ల లోతు గుంతను తవ్వాలి. ఈ గుంత కిందనుండి సగభాగం వరకు 40 మి.మీ. పరిమాణంగల కంకరతోనూ, పావుభాగం 20 మి.మీ. కంకరతో నింపాలి. తరువాత దానిపై ఒక ఇటుకగోడను నిర్మించాలి. గోడ లోపలి సగ భాగం లావాటి ఇసుక మొరంతో నింపి, మిగిలిన సగ భాగం అలా ఖాళీగానే వదిలేయాలి. పైకప్పు నుండి వచ్చే వర్షపునీటిగొట్టాన్ని దీనిలోకి అమర్చాలి. అవసరాన్ని బట్టి ప్రతి సంవత్సరం గుంతలోని ఇసుకను మార్చాలి.

### ఇంకుడుగుంత ప్రయోజనాలు:

లోతైన బీటలువారిన బోరుబావిలో నీటిని ఇంకేలా చేస్తుంది. 6 క్యూబిక్ మీటర్ల ఇంకుడుగుంతలో ఇంకే నీటికంటే 5 నుండి 10 రెట్లు అధికంగా నీరు భూమిలోకి ఇంకుతుంది. భూగర్భ జలాలను పెంచుతుంది. వర్షంద్వారా రోడ్లపై పారే వర్షపునీటిని తగ్గిస్తుంది. ఎర్రనేలల్లో ఈ ఇంకుడు గుంతలు బాగా పనిచేస్తాయి. నల్లరేగడినేలలో ఇవి వృధా!

**-తెలంగాణా మాసపత్రిక సౌజన్యంతో**

### ప్రకృతి వినాశకులపై బిష్ణోయ్ తెగ యుద్ధభేరి:

జోధ్‌పూర్‌కు సమీపంలో కృష్ణజింకలను వేటాడిన కేసులో దోషిగా తేలిన సల్మాన్ ఖాన్ అక్కడ విరివిగా కనిపించే ఈ జంతువు తనను ముప్పుతిప్పలు పెడుతుందని కలలో కూడా ఊహించి ఉండదు. కానీ ఆ మూగజీవాలకు అండగా ఉన్న అలుపెరగని స్వరం బిష్ణోయ్ తెగ. చెట్లు, వన్యప్రాణుల పరిరక్షణే వీరి మతవిశ్వాసం. నాగరికత పేరుతో ప్రకృతిని నాశనం చేస్తున్న సమాజాలకు ఈ తెగ జీవనవిధానం ఓ చెంపపెట్టు. వీరికి అడవులే దేవాలయాలు. పర్యావరణ సైనికులు బిష్ణోయ్‌లు వైష్ణవుల్లో ఓ తెగకు చెందినవారు. ఎక్కువగా పశ్చిమ రాజస్థాన్‌లోని థార్ ఎడారి చుట్టుపక్కల నివసిస్తుంటారు. ఎడారిలో కఠోర వాతావరణ పరిస్థితులకు తట్టుకొని నిలబడగలగడం వారి ప్రత్యేకత. హరియాణ, పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లోనూ వీరు కనిపిస్తారు. ఈ తెగ పుట్టుకకు ప్రకృతికి సంబంధించిన కారణాలే మూలం. 15వ శతాబ్దంలో జోధ్‌పూర్‌కు సమీపంలోని ఒక గ్రామంలో నివసించే జంభోజీకి ఒక దార్శనికత ఉండేది. అప్పట్లో ఆ ప్రాంతాన్ని కుదిపేసిన కరవుకు కారణం, ప్రకృతిని మానవుడు నాశనం చేయడమేనని ఆయన గుర్తించారు. దీన్ని మార్చాలనుకున్నారు. సన్యాసిగా మారిపోయారు. బిష్ణోయ్ సమాజాన్ని స్థాపించారు. ఆయనను స్వామి జంభేశ్వర్‌గా స్థానికులు కొలిచారు. ప్రకృతి పరిరక్షణని ఈ తెగ మూల సిద్ధాంతంగా ఆయన నిర్దేశించారు. 29 సూత్రాలను ఆయన ప్రవచించారు. బిష్ణోయ్ అంటే.. 29 నియమాలను పాటించేవారని అర్థమని (బిష్ అంటే 20, నోయ్ అంటే 9.) మరికొందరు విశ్లేషిస్తారు. గురు జంభేశ్వర్‌ను విష్ణుమూర్తి అవతారంగా బిష్ణోయ్‌లు పరిగణిస్తారు. వారి దేవాలయాల్లో దేవుళ్ల విగ్రహాలు ఉండవు.

### కొన్ని ముఖ్య టెలిఫోన్ నెంబర్లు, ప్రజల ఉపయోగార్థం.

| | |
|---|---|
| పోలీస్ | 100 |
| రైల్వే | 139 |
| శాంతిభద్రతలు | 1090 |
| ఈవ్ టీజింగ్ | 1091 |
| పిల్లలు (6 to 14) వేధింపులు | 1098 |
| ఆర్.టి.సి | 18002004599 |
| అత్యవసర వైద్య సేవలు | 108 |
| తపాలా బీమా | 18001805232 |
| అగ్నిమాపక సేవలు | 101 |
| ఎన్.టి.ఆర్ వైద్య సేవలు | 104 |
| ప్రభుత్వ కార్యాలయాల్లో ఇబ్బందులు | 155361 |
| ఓటు నమోదు కొరకు | 1950 |
| వ్యవసాయ సమాచారం | 18001801551 |
| మీసేవ | 1100 |
| టెలికాం సేవలు | 198 |
| విద్యుత్ సేవలు | 18004250028 |
| ఉపాధి హామీ పథకం | 18002004455 |

■

# "భారత్ మహిళాభివృద్ధి నుండి మహిళల వల్ల అభివృద్ధి దిశగా సాగుతోంది."



నవభారత నిర్మాణానికి మన నారీ శక్తీ ముందుకు సాగుతోంది.

**జాతీయ పోషకాహార ఉద్యమం** సరైన పోషణ సరైన తేజం.

**బేటీ బచావో బేటీ పఢావో –** ప్రజల ఆలోచనా తీరును మార్చడానికి మొత్తం అన్ని జిల్లాలకూ విస్తరించడం.

**ప్రసూతి సెలవు**
మహిళల వృత్తిగత వ్యక్తిగత జీవితాల మధ్య సరైన సమతుల్యానికి ప్రసూతి సెలవు 12 వారాల నుండి 26 వారాలకు పెంపు.

**స్టాండ్ అప్ ఇండియా**
మహిళా పారిశ్రామిక వేత్తలకు రూ. 6,895 కోట్ల మేరకు రుణాలు.

**సుకన్యా సమృద్ధి యోజన**
బాలికలకు ఆర్థిక మద్దతు కోసం 1.26 కోట్ల బ్యాంక్ ఖాతాలు.

**ఉజ్వల యోజన**
పేద మహిళలకు వంటింటిలో పొగ మధ్య జీవితాన్ని తప్పించడానికి 3.5 కోట్ల ఉచిత ఎల్పిజి కనెక్షన్లు. లక్ష్యం 05 లక్షల నుండి 08 లక్షలకు పెంపు.

**జాతీయ గ్రామీణ జీవనోపాధి పథకం**
మహిళా స్వశక్తి బృందాలకు ఋణ సదుపాయం 37 శాతం పెంపు.

ముస్లిం మహిళలకు ముమ్మార్లు తలాక్ చెప్పే మత విధానం నుండి రక్షణకోసం రూపొందించిన బిల్ లోక్‌సభలో మంజూరు.

**ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ పథకం**
సురక్షిత ప్రసవాలకోసం కోటి మందికి పైగా మహిళలకు వైద్య సౌకర్యాలు.

**బాలికల విద్యకు ప్రత్యేక శ్రద్ధ**
మాధ్యమిక, ఉన్నత విద్యాకోసం బాలికలకు విరివిగా ఉపకార వేతనాలు

**ముస్లిం మహిళలు ఇకపై పురుష సహాయం లేకుండానే హజ్ యాత్ర చేయవచ్చు.**

**ప్రధాన మంత్రి మాతృ వందన పరియోజన**
తల్లులకు, శిశువులకు తగిన పౌష్టికాహారం కోసం పాలిచ్చే తల్లులకు రూ. 6,000/- సహాయం.

**జన్‌ధన్ యోజన**
మహిళలకు బ్యాంకు ఖాతాల సౌకర్యం కల్పించి వారికి ఆర్థిక వెసులుబాటు కల్పించడానికి 16.42 కోట్ల కనీస నిల్వ నిబంధన లేని బాంకు ఖాతాలు.

**మహిళలకు ప్రథమ ప్రాధాన్యం:**
నివాస సౌకర్యాన్ని కల్పించడానికి ప్రవేశ పెట్టిన ప్రధాన మంత్రి ఆవాస్ యోజనలో ఇళ్లను రిజిస్ట్రేషన్‌ను మహిళల పేరున మాత్రమే చేస్తారు. ఒంటరి తల్లులకు పాస్‌పోర్ట్ నిబంధనలలో సడలింపు.

**కిల్కారి**
దారిద్ర్యరేఖకు దిగువునున్న మహిళలకు చరవాణీ ద్వారా ప్రసూతి భద్రత సందేశాలు

**ముద్రా యోజన**
రూ. 7.88 కోట్ల మంది మహిళా పారిశ్రామికవేత్తలకు నిధుల కల్పన.

"నవ భారతం కలను సాకారం చేయడమంటే, మహిళా సాధికారతతో కూడిన భారతాన్ని సాధించడమే!"

నరేంద్ర మోదీ.



Ministry of Information & Broadcasting Government of India

# పౌష్టికాహారం - జాతీయాభివృద్ధి

- డా॥ యమ్. గవరవరపు సుబ్బారావు
- ఋషికేష్ పండా



**కుపోషణ ప్రధాన సమస్యగా వున్న మనలాంటి దేశంలో వేగంగా ఆర్థికాభివృద్ధి జరిగినంత మాత్రాన పోషకాహారలోపాన్ని నిర్మూలించగలం అని చెప్పలేం. కానీ, పోషకాహార లోపాన్ని నియంత్రిస్తే ప్రజల ఉత్పాదకత శక్తి పెరిగి దేశ ఆర్థికాభివృద్ధి జరుగుతుందని మాత్రం ఘంటాపథంగా చెప్పవచ్చు. దేశాభివృద్ధి సాధించాలంటే ప్రజల పోషణ, పోహకాహార లోప నిర్మూలనే కాకుండా త్వరతగతిన పెరుగుతున్న దీర్ఘకాలిక వ్యాధులను అరికట్టడం మన ముఖ్య విధి. కుపోషణను నిర్మూలిస్తే ఆర్థిక అభివృద్ధి చెందడం మాత్రం తథ్యం.**

ప్రపంచంలో జనాభా పరంగా రెండవ అతిపెద్ద దేశంగా ఉన్న మన భారతదేశానికి అధిక జనాభా పెద్ద సమస్య కాదని వాదనలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే ప్రపంచంలోనే అత్యధిక ఉత్పాదక శక్తి కలిగివున్న యుక్త వయస్కులు మనదేశంలోనే వున్నారు. అంతేకాక ప్రపంచంలో 20 శాతం మంది కిశోర బాలబాలికలు మన దేశంలోనే ఉన్నారు. వీరందరూ మన దేశ అభివృద్ధిలో మెరుగైన పెట్టుబడులు. కానీ, ప్రపంచంలోనే అత్యధికంగా పోషకాహార లోపం వున్న దేశంగా మన దేశానికి ముద్రపడింది. దేశ ఆర్థిక అభివృద్ధికి ఇది ఏమాత్రం అడ్డంకిగా మారకూడదు. అందుకే మన దేశంలో పోషకాహార లోపాన్ని ఎదుర్కొనేందుకు మార్చి 3, 2018 న "పోషణ్ అభియాన్" లేదా జాతీయ పోషకాహార మిషన్ (NNM) అనే బృహత్తర కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మూడు సంవత్సరాలకు 9,000 కోట్ల రూపాయలను కేటాయించింది. ఈ కార్యక్రమంలో 10 కోట్ల మంది లబ్ధిదారులను భాగస్వాములను చేయాలని నిర్ణయించారు.

భారతదేశ అభివృద్ధిలో పోషకాహారం ప్రాధాన్యతను తెలుసుకునేముందు ఈ దేశంలో పోషణకు ఇచ్చిన ప్రాధాన్యతను గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకే, భారత రాజ్యాంగంలో 47వ అధికరణ పోషకాహార స్థాయిని పెంచడం, జీవన ప్రమాణాలు, ప్రజల ఆరోగ్య మెరుగుదలకు ప్రభుత్వ పాత్ర గురించి వివరిస్తుంది.

రాజ్యాంగంలో ప్రజల పోషణపై స్పష్టమైన నిబద్ధత ఉన్నప్పటికీ ఆకలితో ఉన్న ప్రజలకు ఆహారం అందించడమే ప్రధానమైన లక్ష్యంగా ఉండేది. అందువలన కేవలం ఆహార భద్రత మెరుగుపరచడానికి ఆహారోత్పత్తి మరియు సాంకేతిక అభివృద్ధికి మాత్రమే మొదటి పంచవర్ష ప్రణాళికలో ప్రాధాన్యత ఇచ్చారు. దీనిని అనుసరించి ఆహార నిల్వలు కూడా పెరిగాయి. వాటిని పంపిణీ చేస్తే ప్రజలలో ఆకలి బాధను నివారించవచ్చు. కానీ, పోషకాహార లోపాన్ని నివారించడం, నియంత్రించడం సాధ్యం కాకపోవచ్చు. కుపోషణ ప్రధాన సమస్యగా వున్న మనలాంటి దేశంలో శీఘ్రగతిలో ఆర్థికాభివృద్ధి జరిగినంత మాత్రాన పోషకాహారలోపం నిర్మూలించగలం అని చెప్పలేం. కానీ, పోషకాహార లోపాన్ని నియంత్రిస్తే ప్రజల ఉత్పాదకత శక్తి పెరిగి దేశ ఆర్థికాభివృద్ధి జరుగుతుందని మాత్రం ఘంటాపథంగా చెప్పవచ్చు.

నాణానికి అవతలివైపు చూస్తే అభివృద్ధి

శాస్త్రవేత్త 'ఇ', జాతీయ పోషకాహార సంస్థ (NIN), తార్నాక, హైదరాబాద్ E-mail: gmsubbarao@ninindia.org
సాంకేతిక సహాయకుడు, జాతీయ పోషకాహార సంస్థ (NIN), తార్నాక, హైదరాబాద్

ముఖ్య లక్ష్యం దేశంలో సాధారణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం. సరైన దేశాభివృద్ధికి ప్రజలను ఉత్పాదకలో భాగస్వాములుగా చేసి వారికి సహేతుకమైన అవకాశాలను కల్పిస్తుంది. ఇది జీవన విధానాలను మెరుగుపరుస్తుంది. స్థూల జాతీయోత్పత్తి, తలసరి ఆదాయం పెరిగితే తప్పనిసరిగా ప్రజల పోషణ కూడా మెరుగుపడుతుందని అపోహ ఉండేది. ప్రస్తుతం ఆర్థికాభివృద్ధి జరగాలంటే పోషణ కూడా ముఖ్య భూమిక పోషిస్తుందని శాస్త్రీయ పరిశోధకులే కాకుండా ప్రణాళిక రచయితలు కూడా గ్రహిస్తున్నారు. కాబట్టి పోషణలో మెరుగుదల జరగాలంటే కేవలం సరియైన ఆహారం లభించడమే కాక ఎన్నో సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక విషయాలు, వ్యవసాయ ఉత్పత్తి, మొదలగునవి ముఖ్యమని మనం గ్రహించాం. ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశాలలో పెరిగిన జాతీయోత్పత్తి, తలసరి ఆదాయం ప్రజలలో పోషణని మెరుగుపరచలేదు. పారిశ్రామికీకరణ, జీవన విధానాలను ప్రభావితం చేసి వారి ఆహార అలవాట్లలో ఎన్నో మార్పులు తీసుకొచ్చింది. దీని వల్ల ఒకప్పుడు వెనుకబడిన, అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రజలు కేవలం పోషకాహార లోపాలతో బాధపడే వారు. అవే దేశాలలో త్వరితగతిన అభివృద్ధి పుంజుకొని మార్పులు వచ్చిన కారణంగా పోషకాహార లోపంతో పాటు ప్రజలు నేడు స్థూలకాయం, ఊబకాయం, దానికి సంబంధించిన రోగాలతో బాధపడుతున్నారు. భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఈ ద్వంద్వ వైఖరితో కుపోషణ కనిపిస్తుంది (స్థూలకాయ సమస్యలు, కుపోషణ). పోషకాహార లోపం లేదా అవసరమైన విటమిన్లు, ఖనిజ లవణాలు, సూక్ష్మ పోషకాల లోపాలతో లక్షలాది మంది ప్రజలు వ్యాధిగ్రస్థులవుతున్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే 2015-2016 (NFHS-4) ప్రకారం 53 శాతం మంది మహిళలు, 6 నెలల నుండి 59 నెలలలోపు పిల్లలు 60 శాతం మంది ఇనుము (ఐరన్) లోపం వల్ల వచ్చే రక్తహీనతతో బాధపడు తున్నారు. సుమారు 49 శాతం మంది అయొడిన్ లోపంతో మరియు అనేక మంది ప్రజలు విటమిన్-ఎ లోపంతో బాధపడు తున్నారు. పోషకాహార లోపానికి ముఖ్య కారణం పేదరికం, సరైన వనరులు లేకపోవడం, నిరక్షరాస్యత, పారిశుధ్యం మరియు సరైన పర్యావరణ పరిస్థితులు లేకపోవడం. ఈ సమస్యలతో బాధపడే ప్రజలలో పోషణ లోపించడమే కాక బలహీనత కారణంగా వారు సాధారణంగా తక్కువ ఉత్పాదకత కలిగి వుంటారు. అందువలన పోషకాహార లోపం మరియు పేదరికం అనే వలయంలో చిక్కుకు పోతున్నారు. సాధారణంగా ప్రజల సాంఘిక-ఆర్థిక పరిస్థితులు మెరుగుపడుతున్నప్పుడు ముందున్న ఆహారపు అలవాట్లు మారి ధాన్యాలు, చిరు ధాన్యాలను తగ్గించి క్రొవ్వు మరియు చక్కెర ఎక్కువగా ఉన్న పదార్థాలను తీసుకోవడం ప్రారంభిస్తారు. జంక్ ఫుడ్స్ మరియు క్రొవ్వు పదార్థాలను ఎక్కువగా తీసుకోవడం అధిక బరువుకు దారిస్తుంది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) ప్రమాణాలను ఉపయోగించి 79 అభివృద్ధి చెందుతున్న దేశాల మరియు అనేక పారిశ్రామిక దేశాల సమాచారం ప్రకారం 15 శాతం మంది 5 సంవత్సరాలలోపు పిల్లలు ప్రపంచ వ్యాప్తంగా అధిక బరువును కలిగి ఉన్నారు. బాల్యదశలో, కిశోర దశలో అధిక బరువు అనేది వివిధ ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని శాస్త్రీయ పరిశోధనల ద్వారా నిరూపించబడింది. ఈ సమస్యలు అభివృద్ధి చెందిన దేశాలలో జనాభాకు మాత్రమే పరిమితం కావు. అధిక సంఖ్యలో అభివృద్ధి చెందుతున్న దేశాలలో కూడా అధిక బరువు వలన ఉత్పన్నమయ్యే పోషకాహార మరియు దీర్ఘకాలిక ఆహార సంబంధిత వ్యాధుల సమస్యలు పెరుగుతున్నాయి. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (NFHS-4) 2015-16 ప్రకారం మన దేశంలో 20.7 శాతం మహిళలు, 18.6 శాతం పురుషులు అధిక బరువును కలిగి ఉన్నారు. అధిక బరువు ప్రధానంగా పట్టణ ప్రాంతాలలోనే కలిగి ఉందని అనుకునే వారు, కాని గ్రామాలలో కూడా ఈ సమస్య అధికమవుతోందని పరిశోధనలు తెలుపు తున్నాయి.

**అభివృద్ధి చెందుతున్న దేశాలలో పోషకాహార లోపం**



శరీర ద్రవ్యరాశి సూచిక ప్రకారం (≥ 18 సం॥ల) పురుషుల ఆరోగ్య స్థితి




Source: NNMB Reports (2006, 2012).

శరీర ద్రవ్యరాశి సూచిక ప్రకారం (≥ 18 సం॥ల) మహిళల ఆరోగ్య స్థితి




Source: NNMB Reports (2006, 2012).

## పోషణ – దేశాభివృద్ధి – చారిత్రాత్మక కోణం :

స్వాతంత్ర్యం పొందిన తొలి నాళ్లలలో దేశం ప్రధానంగా రెండు పోషక సమస్యలను ఎదుర్కొంది. ప్రధానంగా వ్యవసాయ ఉత్పత్తి తక్కువగా ఉండటం మరియు తగిన ఆహార పంపిణీ వ్యవస్థ లేకపోవడం వలన కరువు దాని ఫలితంగా ఆర్థిక సమస్యలు. రెండవది ఆహార భద్రత లోపించడం వల్ల ప్రజల్లో కుపోషణ మరియు దీర్ఘకాలిక శక్తి లోపం. అంతేకాక ఆనాడు శాస్త్రీయ పరిశోధకులు ఆకలి సమస్య గురించి విస్తృతమైన పరిశోధనలు జరిపారు. చాలా కుటుంబాలు సమతుల ఆహారాన్ని తీసుకోవడానికి అవసరమైన పండ్లు, కూరగాయలు మరియు మాంసాహారాన్ని కొనుగోలు చేసే శక్తి లేక సూక్ష్మ పోషకాహార లోపాలకు గురి అయ్యేవారు. 1960–70 దశకంలో ఆకలి బాధను తగ్గించడానికి హరిత విప్లవం అనే మహోన్నత కార్యక్రమం చేపట్టారు. కాని ఆనాడు అది ఆహార సమస్యను తీర్చినప్పటికి ఊహించని విధంగా బియ్యం, గోధుమల ఉత్పత్తికి ఎక్కువ ప్రాధాన్యత లభించి చిరుధాన్యాల ఉత్పత్తి మరియు వాడుక తగ్గిపోయాయి. దీని కారణంగా ఆహారంలో పీచు పదార్థాలు, డి–విటమిన్లు, జింక్, సెలినియం మరియు క్రోమియం వంటి సూక్ష్మ పోషక పదార్థాలు తగ్గిపోయాయి. మనం రోజు ఆకలి బాధను తగ్గించడం కోసం ఆహారాన్ని తింటూ ఉన్నాం, కాని అందులో కావలసిన విటమిన్లు, ఖనిజ లవణాలు మరియు సూక్ష్మ పోషకాలు ఉండటం లేదు. ఆకలిని తగ్గించడం కోసం తగినంత ఆహారోత్పత్తి చేయడం జరిగింది. ఆహారం అందరికీ అందుబాటులో ఉంది. అయితే ఆహారోత్పత్తి పెరుగుతున్నప్పటికీ పోషకాహార లోపాన్ని నివారించలేక పోతున్నాం. ఆహార భద్రత లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోంది. నేడు మనలాంటి దేశాలలో ఆహార ధాన్యోత్పత్తి ఆకట్టుకునే పురోగతిని నమోదు చేసింది. దానిని నిలబెట్టుకోవడం కోసం ఉద్యాన వన ఉత్పత్తులు చిక్కుడు జాతి మరియు పాల వంటి నాణ్యమైన ఆహారాన్ని ఉత్పత్తి చేసి వాటిని వినియోగిస్తూ ప్రజలకు సరిపోయేలా చూసుకోవాలి. కేవలం "ఆహార భద్రతే" కాదు పోషకాహార భద్రతను కలిగి ఉండాలి.

ఆకలిని, పోషకాహార లోపాన్ని నిర్మూలించే ప్రాముఖ్యతను గుర్తిస్తూ ఈ సమస్యను పరిష్కరించడానికి మరియు ప్రజల పోషక స్థితిని మెరుగుపరచడానికి, బహుళ రంగ, బహుముఖ, వ్యూహాన్ని దేశం స్వీకరించింది. హరిత విప్లవం, ఆహార ఉత్పత్తిలో పెరుగుదల మరియు జనాభా పోషక స్థితిని మెరుగు పరిచేందుకు పంచవర్ష ప్రణాళికలో ఈ క్రింది వ్యూహాలను గత ప్రభుత్వాలు అనుసరించాయి.

1) వ్యవసాయాభివృద్ధితో ఆహార ఉత్పత్తిని పెంచడం.
2) ప్రజా పంపిణీ వ్యవస్థ (PDS) ను పటిష్ఠ పరచడం ద్వారా ఆహార పంపిణీ వ్యవస్థను మెరుగు పరచడం.
3) కుటుంబ ఆహార భద్రతను మెరుగు పరచడం కొరకు.
   - కొనుగోలు శక్తి పెంచడం,
   - పనికి ఆహార పథకం,
   - ప్రత్యక్ష లేదా పరోక్ష రాయితీలు,
4) అనుబంధ పోషకాహార కార్యక్రమాలు చేపట్టడం (మధ్యాహ్న భోజన పథకం, సమగ్ర శిశు అభివృద్ధి పథకం).
5) పోషకాహారంపై అవగాహన కల్పించడం.

వీటితోపాటు ఎన్నో పోషకాహార కార్యక్రమాలను ప్రవేశపెట్టడం జరిగింది. అందులో మూడు అత్యంత ముఖ్యమైన కార్యక్రమాలు – రక్త హీనతను తగ్గించేందుకు నేషనల్ న్యూట్రీషన్ అనీమియా కంట్రోల్ కార్యక్రమం, విటమిన్–ఎ లోపాల నిర్మూలనకు నేషనల్ ప్రొఫిలాక్స్ కార్యక్రమం, అయోడిన్ లోపాలను నివారించడానికి జాతీయ స్థాయిలో కార్యక్రమాలు. ఈ కార్యక్రమాలను స్వల్ప కాలానికి తయారు చేసినా కొన్ని దశాబ్దాలుగా ఇంకా ఈ కార్యక్రమాలు అమలులో ఉన్నాయి. ఈ కార్యక్రమాల వలన విటమిన్–ఎ, రక్తహీనత కొంత తగ్గుముఖం పట్టినప్పటకీ వీటిని ఇంకా పూర్తిగా అరికట్టలేకపోయాయి.

జాతీయ పోషకాహార మిషన్ (NNM), జాతీయ పోషకాహార ప్రణాళిక (NNS) పై ఆధారపడింది. ఈ కార్యక్రమం జీవన క్రమంలో పోషణ గురించి వివరిస్తుంది. జాతీయ పోషకాహార ప్రణాళిక దిగువున పేర్కొన్న అవసరాల గురించి చర్చిస్తుంది. అవి ఏమిటంటే పోషణ (పారిశుధ్యం, వ్యాధి నిరోధక టీకాలు, మహిళా సాధికారత), పోషకాహార నిర్దిష్ట భాగాలతో పాటుగా అనుబంధ పోషకాహారం, తల్లిపాలు విశిష్టత కార్యక్రమాలు) పోషకాహార లోపాన్ని పరిష్కరించడానికి మంచి వాతావరణాన్ని (పరిపాలనా, సమర్థవంతమైన విధానాలు) కల్పించడం.

1975లో 33 మండలాలలో ప్రయోగాత్మకంగా సమగ్ర శిశు అభివృద్ధి పథకాన్ని (ICDS) అమలు చేశారు. ఇప్పుడు ఈ పథకం దాదాపు అన్ని మండలాలలో

పనిచేస్తుంది. ఈ పథకం ద్వారా గర్భిణీ స్త్రీలు, బాలింతలు మరియు 5 సంవత్సరాల లోపు పిల్లలు లబ్ధి పొందుతున్నారు. ఈ పథకం పిల్లల ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ, పూర్వ ప్రాథమిక విద్య మరియు అభివృద్ధితో పాటు పోషకాహారాన్ని అందిస్తుంది.

కేంద్ర ప్రభుత్వం 1993లో జాతీయ పోషకాహార విధానాన్ని (NNP) ప్రవేశ పెట్టింది. వివిధ అభివృద్ధి విధానాలలో కూడా పోషకాహారం ప్రాముఖ్యతను గుర్తించారు. నవంబర్ 1997లో ఆనాటి ప్రధాన మంత్రి అధ్యక్షతన ఫుడ్ అండ్ న్యూట్రిషియన్ కౌన్సిల్ (FNC) ని ఏర్పాటు చేశారు. పోషకాహార లోపాల్ని నివారించడానికి పోషకాహార మిషన్‌ను చేపట్టారు. ఈ కార్యక్రమం కూడా ప్రధానమంత్రి ఆధ్వర్యంలో ఉంటుందని ప్రతిపాదించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చొరవతో ఇటీవలే పోషకాహార మిషన్ ప్రారంభమైంది. ప్రణాళికా సంఘం స్థానంలో వచ్చిన నీతి ఆయోగ్ ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. అందులో కూడా ఆహార భద్రతకు ప్రాముఖ్యతను కల్పిస్తున్నారు. 1995లో ప్రవేశ పెట్టిన నేషనల్ ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఆన్ న్యూట్రిషన్ (NPAN) అందరికి పోషకాహారం కల్పించడానికి ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో కలిసి పనిచేయాలని చెప్తుంది.

### రేపటి పౌరులు – పోషకాహార లోపాలు – ఆర్థిక అభివృద్ధికి అడ్డంకి :

నేటి బాలలే రేపటి పౌరులు. అటువంటి పౌరులు ఉత్పాదక శక్తి కలిగి వుంటే వారిని మించిన పెట్టుబడి మరొకటి లేదు. మన దేశంలో మూడవ వంతు (దాదాపు 30 శాతం) మంది పిల్లలు సాధారణం కంటే తక్కువ బరువుతో (2.5 కిలోల బరువు కంటే తక్కువ) జన్మిస్తున్నారు. వీరు సాధారణ బరువుతో జన్మించే పిల్లల కంటే పోషకాహార లోపానికి, ఆరోగ్య సమస్యలకు ఎక్కువగా గురయ్యే అవకాశం ఉంది. 1993లో తక్కువ బరువుతో పుట్టే పిల్లలు 32 శాతం అయితే సుమారు 13 సంవత్సరాల తరువాత కూడా ఇంకా 28 శాతంగానే (UNICEF 2008) వుంది. ఎన్నో కార్యక్రమాలు ఉన్నప్పటికి మన దేశం సాధించిన అభివృద్ధి మందకొడిగా వుంది. ఇంకా చెప్పాలంటే 38.4 శాతం మంది 5 సంవత్సరాలోపు పిల్లలు వయస్సుకు తగ్గ ఎత్తు, 28.9 శాతం మంది ఎత్తుకు తగ్గ బరువు, 35.7 శాతం వయస్సుకు తగ్గ బరువును కలిగి ఉండటం లేదు.

తక్కువ బరువుతో పుడుతున్న పిల్లల వివరాలు



Source: UNICEF, State of the world's children, child infor and semographic and Health source.

### తక్కువ బరువుతో పుడుతున్న పిల్లల వివరాలు

ఇలా తక్కువ బరువుతో పిల్లలు జన్మించడం వలన వారు పౌష్టికాహార లోపంతో, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతుంటారు. తక్కువ బరువుతో పుట్టడం మానసిక సమస్యలకు కూడా దారితీస్తుంది. ముఖ్యంగా తక్కువ బరువుతో జన్మించే ఆడపిల్లలు శారీరకంగా, మానసికంగా సరిగ్గా ఎదగకపోవడం వల్ల యుక్త వయసులో గర్భస్రావానికి గురి అవుతుంటారు. గర్భవతిగా ఉన్నప్పుడు సరైన పోషకాహారం తీసుకోలేక పోవడం వలన తక్కువ బరువుతో ఉన్న పిల్లలకు జన్మనిస్తున్నారు. దాని ఫలితంగా పిల్లలు వయస్సుకు తగ్గ ఎత్తు, ఎత్తుకు తగ్గ బరువు, వయస్సుకు తగ్గ బరువు లేక పోషకాహార లోపాలకు గురౌతుంటారు.

ప్రతీ 1000 మంది 5 సంవత్సరాల లోపు పిల్లలలో 50 మంది, ప్రతీ 1000 మంది నాలుగు వారాల లోపు పిల్లలలో 28 మంది పిల్లలు మరణిస్తున్నారు. అలాగే శిశు మరణాలు ప్రతి 1000 మందికి 39 గా ఉన్నాయి. అలాగే మాతృ మరణాలు ప్రతీ లక్షకు 167 గానూ ఉంది.

పోషకాహారం యొక్క ట్రాన్స్ జనరేషనల్ వలయం




### పోషకాహారలోపం లేని దేశంగా మారాలంటే...

పోషకాహార లోపానికి కారణం సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడమే కాక పర్యావరణ కాలుష్యం (సరైన పారిశుధ్యం లేకపోవడం) వలన వచ్చే అంటు వ్యాధులు కూడా ఒక కారణం అయి ఉండవచ్చు. పారిశుధ్య సదుపాయాలు సరిగా లేకపోవడం, భోజనానికి ముందు తర్వాత చేతులను పరిశుభ్రంగా కడుక్కోకపోవడం, శౌచాలయాలకి (Toilets) వెళ్ళి వచ్చిన ప్రతీసారీ చేతులను శుభ్రంగా కడుక్కోక పోవడం వలన అంటు వ్యాధులు రోజురోజుకి పెరిగిపోతున్నాయి. దీనికి అనుగుణంగా స్వచ్ఛభారత్ అభియాన్ అనే కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. కుపోషణ నిర్మూలన కార్యక్రమంతో పాటు స్వచ్ఛ భారత్ వంటి పారిశుధ్య కార్యక్రమాలు దేశ అభివృద్ధి పథంలో రెండు చక్రాల్లాంటివి. పోషక స్థితి కేవలం పోషకాహార లోప నిర్మూలన కార్యక్రమం ద్వారానే కాక ఆహార పంటలకు ప్రాధాన్యత ఇచ్చి అది లభించేటట్లు అందుబాటులో ఉంచడం, ప్రజల కొనుగోలు శక్తిని పెంచడం, ఆరోగ్యం పారిశధ్యం సురక్షితమైన త్రాగునీరు తదితర వాటికి సంబంధించిన కార్యక్రమాల ద్వారా కూడా కుపోషణను తగ్గించవచ్చు.

మనం ఆహార భద్రత మీదే దృష్టి పెట్టినట్లయితే కేవలం పిండి పదార్థాలు లేదా

ఒక రకం ధాన్యం జాతిని మాత్రమే పోషకాహార లోపం ఉన్న వాళ్ళకు అందించగలం. ఇలా చేసినట్లయితే ప్రజలకు మనం కేలరీలు అందించగలం కాని వాళ్ళని దీర్ఘకాలిక వ్యాధుల నుండి కాపాడలేము. దీని కారణంగా రాబోయే రోజుల్లో అధిక బరువు, జీవక్రియ సంబంధిత వ్యాధులు ఇంకా పెరుగుతాయి. పరిశోధనల ప్రకారం పిల్లలు చిన్నతనంలో సరైన పోషకాహారం తీసుకోక పోవడం వల్ల మధ్య వయస్సు వచ్చేసరికి మధుమేహానికి గరవుతున్నారు. అలాగే శరీర ద్రవ్యరాశి సూచిక (BMI) తక్కువగా ఉండటం మరియు రోగనిరోధక శక్తి తక్కువగా ఉండటం వల్ల మధుమేహం, గుండెకు సంబంధించిన వ్యాధులు వస్తున్నాయి.

సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ICDS), మధ్యాహ్న భోజన పథకం (MDS), ప్రజా పంపిణీ వ్యవస్థ (PDS) లాంటి చాలా కార్యక్రమాలు లేదా పథకాలు ఆహార భద్రత కోసం వివిధ సందర్భాలలో ఇదివరకే ప్రవేశపెట్టారు. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, బీహార్, ఒడిశా లాంటి కొన్ని రాష్ట్రాలలో వారానికి 2 నుంచి 5 గుడ్లు మధ్యాహ్న భోజన పథకంలో ఇచ్చే సదుపాయం ఉన్నప్పటికీ అధిక ధరల వల్ల వాటి బదులు ప్రత్యామ్నాయ పదార్థాలు ఇవ్వడమో లేదా వాటిని పూర్తిగా తొలగించడమో జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు ఇలా జరుగకుండా చర్యలు తీసుకోవాలి. ప్రజలలో పోషకాహార స్థాయిని విస్తరించేందుకు FSSAI సంస్థ నిత్యం వినియోగించే సరకులను (పిండి, ఉప్పు, వంట నూనె మొదలగునవి) పోషకాలతో దృఢపరిచేందుకు ఫోర్టిఫికేషన్ మార్గదర్శకాలను 2017లో ప్రవేశపెట్టారు. వీటిపై ప్రజలలో అవగాహన కల్పించడం ఎంతో అవసరం. ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం దీని ఉద్దేశం అయినప్పటికీ మనం ఈ మార్గాన్ని జాగ్రత్తగా అనుసరించాలి.

సమగ్రాభివృద్ధికి సులువైన మార్గాలు ఏమీ లేవు. మనం రోజూ తీసుకునే ఆహారంలో ప్రోటీనులు, పీచు పదార్థాలు, సూక్ష్మ పోషకాలు వుండే విధంగా చూసుకోవాలి. పైన చెప్పిన ఆహార పదార్థాలను తీసుకోవడమే కాక, శారీరక శ్రమను (వ్యాయామం లాంటివి) కూడ చేసినట్లయితే పౌష్టికాహార లోపం లేని దేశంగా చేయవచ్చు.

పెరటి తోటలను పెంచడం, సాంప్రదాయక ఆహారాన్ని తీసుకోవడం, సూక్ష్మ పోషకాలు, అధికంగా ఉన్న ఆహారపదార్థాలను పని ప్రదేశాలలో, పాఠశాల, కళాశాల ప్రదేశాలలో రాయితీపై మంచి ఆహార పదార్థాలను అందించడం, మంచి ఆహారాన్ని ఎంచుకున్నట్లు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలి. అలాగే జంక్ ఫుడ్ పదార్థాలపై ఎక్కువ పన్ను విధించడం లాంటి విధానాలను అనుసరించాలి.

దేశాభివృద్ధి సాధించాలంటే ప్రజల పోషణ, పోహకాహార లోప నిర్మూలనే కాకుండా త్వరతగతిన పెరుగుతున్న దీర్ఘకాలిక వ్యాధులను అరికట్టడం మన ముఖ్య విధి. ఆర్థికంగా దేశం అభివృద్ధి చెందితే కుపోషణను పూర్తిగా నిర్మూలించలేకపోవచ్చు, కానీ, కుపోషణను నిర్మూలిస్తే ఆర్థిక అభివృద్ధి చెందడం మాత్రం తథ్యం. దేశాభివృద్ధికి జనాభా ఒక సమస్య కాకూడదు, వారి ఉత్పాదక శక్తి పెరిగితే ప్రజలే మన పెట్టుబడులౌతారు. ■

## గమనిక

**వ్యాసకర్తలకు సూచన** యోజన మాసపత్రికకు వ్యాసాలు పంపేవారు తమ వ్యాసం సాఫ్ట్ కాపీని పేజిమేకర్ 6.5 లేదా 7 మరియు "అను" 7 ఫాంట్‌లో, వర్డ్‌లోనూ పంపాలి. వ్రాతప్రతిని కూడ హామీ పత్రంతో కలిపి పోస్టుద్వారా పంపాలి. హామీ పత్రంలో ఇది తమ స్వంత రచన అనీ, దేనికీ అనువాదం, అనుసరణ కాదనీ, మరే పత్రికకూ పంపలేదనీ, ఇంతకుముందు పుస్తకంగా ముద్రించలేదని పేర్కొనాలి. రచనలు ప్రతి నెలా 15వ తేదీ లోపు మాకు చేరాలి. ప్రచురణకు నోచుకోని రచనలు తిరిగి పంపబడవు. దీనిపై ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలకూ చోటులేదు. ఏ నెలకైనా సంబంధించిన అంశం (Topic of the month) పైనే వ్యాసాలు పంపాలి గమనించగలరు. వ్యాసాలను పంపేవారు ఏ నెలకానెల ఇచ్చే ప్రత్యేక అంశంపైననే 5వ తారీఖులోపు నాలుగు వాక్యాల అవరణం పంపాలి.

యోజన తెలుగు మాసపత్రిక, 205, రెండవ అంతస్తు, సి.జి.ఓ. టవర్స్, కవాడిగూడ, హైదరాబాద్ – 500 080.
E-mail: yojana_telugu@yahoo.co.in - yojana.telugu@nic.in

# వ్యవసాయ పురోగతితో పోషకాహార భద్రతను మెరుగు పరచగలమా?

- ప్రొఫెసర్ ఆదుర్తి మృణాళిని



**వ్యవసాయ ఉత్పత్తులలో వృథాను రైతు స్థాయి నుండి మార్కెట్ స్థాయి వరకు తగ్గించడం అవసరం. ఆహార భద్రతకు సంబంధించి, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ విలువలను నియంత్రించి, వినియోగ దారులకు ఆహారం అందుబాటు ధరలలో అందించగలిగితే మెరుగైన స్థాయిని అందుకో గలుగుతాము. పంట ఉత్పత్తిలో బయో ఫోర్టిఫికేషన్ విధానాలతో ఐరన్, జింక్, విటమిన్ A వంటి పోషకాలను మెరుగు పరచి మంచి ఫలితాలను ఆశించవచ్చు. కాబట్టి వ్యవసాయ వృద్ధితో పోషకాహార భద్రతను సాధించుకోగలుగుతాం.**

ఇప్పటివరకూ వ్యవసాయ రంగ ప్రగతి సాపేక్షంగా తక్కువగానే జరిగిందని గమనించాలి. ఎందుకంటే, మన 11, 12 వ పంచవర్ష ప్రణాళికల లక్ష్యాలు 4 శాతం వృద్ధిని ఆశించగా, వ్యవసాయ రంగం 2.8 శాతం వద్దనే నిలిచి ఉంది. పోషకాహారలోపం సూచికలో కూడా ఆహారము మరియు వ్యవసాయ సంస్థ (FAO), ఐక్యరాజ్య సమితి అంచనాల ప్రకారం ఇంకా తక్కువగానే ఉన్నది.

**ఈ అంశాలు కొన్ని ప్రశ్నలకు దారి తీస్తాయి.**

1. మన వ్యవసాయరంగ పెరుగుదలకు, పోషకాహారలోప సూచీలో మెరుగుదలకు ఏ విధమైన సంబంధం ఉంది?
2. మెరుగైన వ్యవసాయం ద్వారా పోషకాహార భద్రతను సాధించే దిశగా అడుగులు వేయగలమా?

### వ్యవసాయాభివృద్ధి పరిస్థితులలో కొన్ని అంశాలు

వ్యవసాయ రంగ పరిధిలో అస్థిరత్వం మరియు ప్రాంతీయ వైవిధ్యం వ్యవసాయాభివృద్ధి రేటు ధోరణి 1991-92 నుండి 2008-09 సంవత్సరం వరకు అతి తక్కువగా 2.7 శాతంగా ఉంది. అదేవిధంగా 2012 నుండి 2016 వరకు అతి తక్కువగా 1.5 శాతం ఉంది. ( చిత్రం1)

వ్యవసాయంలో ప్రాదేశిక వైవిధ్యం దీనికి ప్రధాన కారణం.కొన్ని ప్రాంతాలలో సగటు

**వ్యవసాయ వృద్ధి రేటు**




---

ప్రొఫెసర్, హోం సైన్స్ కళాశాల, ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

కన్నా పెరుగుదల వేగంగా ఉండగా మరికొన్ని ప్రాంతాలలో పెరుగుదల సగటు కన్నా తక్కువగా ఉంది. ఉదాహరణకు 2001 నుండి 2008 వరకు గుజరాత్‌లో వ్యవసాయవృద్ధి సంవత్సరానికి సుమారు 10 శాతంగా ఉండగా అస్సాం, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్‌లలో వార్షిక పెరుగుదల 2 శాతంగా మాత్రమే నమోదై వ్యవసాయంలో ఉన్న ప్రాంతీయ అస్థిరతను సూచిస్తోంది. ఈ వ్యత్యాసానికి వాతావరణ ప్రతికూల పరిస్థితులు, జనాభా పెరుగుదల రేటు ప్రభావితాంశాలుగా భావించవచ్చు.

అధిక జనాభా కలిగిన బీహార్, రాజస్థాన్ లలో తలసరి స్థూల దేశీయ ఉత్పత్తి , సగటు వృద్ధి రేటు కన్నా ఎక్కువగా ఉన్నప్పటికీ వ్యవసాయంలో వృద్ధిరేటు తక్కువగా ఉంది.

వ్యవసాయ వృద్ధిరేటు గణనలో స్థూల భూమి ఉత్పాదకత మరొక సూచిక. అంటే ఒక హెక్టారుకు గల స్థూల పంట ప్రాంతం, ఉత్పత్తుల విలువలు పరిగణలోనికి తీసుకో బడతాయి. ఇది ప్రాంతీయంగా పండించే పంట ఉత్పత్తులపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు సుగంధ ద్రవ్యాలు, చేపలు అధికంగా పండించే కేరళ ప్రాంతంలోను, పండ్లు, కూరగాయలు సేద్యం చేసే హిమాచల్ ప్రదేశ్‌లోను అధిక విలువలు గల ఉత్పత్తులు, భూమి ఉత్పాదకతను పెంచడంలో సహకరి స్తున్నాయి.

మన దేశంలో అధిక జనాభా వ్యవసాయాధారిత జీవనం గడపడం వలన కూడా ఆహార భద్రతను సుస్థిరంగా ఉంచే ప్రయత్నంలో పంట సరళి, ఆధునిక వ్యవసాయ విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం, మార్కెటింగ్ విధానాలు బాగా తోడ్పడుతున్నాయి.

**పోషకాహార లోప పరిస్థితులపై కొన్ని వివరాలు:**

పిల్లలలో పోషకాహార లోపం చాలా ఎక్కువ. భారత దేశ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే NFHS 2005, 2015 డేటా ప్రకారం గత కొన్ని సంవత్సరాలుగా పోషకాహారలోప పరిస్థితులలో గణనీయమైన మార్పు రాలేదనే చెప్పుకోవాలి.

* వయసుకుతగ్గ బరువు లేని ఐదు సంవత్సరాల లోపు పిల్లలు NFHS 2015 డేటా ప్రకారం 36 శాతం ఉన్నారు. NFHS 2005 డేటాతో పోలిస్తే కేవలం 7 శాతం తగ్గుదల కనిపించింది.
* వయసుకు తగ్గ పెరుగుదల లేని ఐదు సంవత్సరాల లోపు పిల్లలు NFHS 2015 డేటా ప్రకారం 38 శాతం ఉన్నారు. NFHS 2005 డేటాతో పోలిస్తే కేవలం 10 శాతం తగ్గుదల కనిపించింది. (చిత్రం–2)

పరిస్థితి దీర్ఘకాలిక శక్తి లోపాన్ని సూచిస్తుంది.

**సూక్ష్మ పోషకాహార లోపాలు కూడా భారత జనాభాలో ఎక్కువే.**

* 2005–06 అంచనాల ప్రకారం 5 సంవత్సరాల కన్నా తక్కువ వయసు పిల్లలలో 70 శాతం, 14 నుండి 49 సంవత్సరాల వయసు గల స్త్రీలు 72 శాతం రక్త హీనతతో బాధ పడుతున్నారు.

**పోషకాహార లోపాలతో ప్రాంతీయ వైవిధ్యం**

* బీహార్, ఝార్ఖండ్, ఉత్తరప్రదేశ్‌లలో 5 సంవత్సరాల లోపు పిల్లలు సుమారు 40 నుండి 50 శాతం వరకు పోషకాహార

**పిల్లల పౌష్టికత ధోరణులు**

5 సంవత్సరాల కన్నా తక్కువ వయసు ఉన్న పిల్లల శాతం




ఆధారం: ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాలు.

**పోషకాహార లోపం పెద్దలలో కూడా ఎక్కువే.**

* ముఖ్యంగా 15 నుండి 49 సంవత్సరాల వయస్సులో ఉన్న 36 శాతం స్త్రీలు, 34 శాతం పురుషులు కూడా పోషకాహార లోపంతో ఉండి, బాడీ మాస్ ఇండెక్స్ (బియంఐ) అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం 18.5 కిలోగ్రామ్స్ పర్ మీటర్ స్క్వేర్ కన్నా తక్కువగా ఉన్నారు. ఈ లోపంతో ఉండడం గమనించవచ్చు. అయితే, ఈ పరిస్థితి కేరళలో కొంచెం మెరుగుగా ఉందని గుర్తించవచ్చు. కేరళలో వయసుకు తగ్గ బరువు లేని పిల్లలు 16 శాతం ఉండగా 20 శాతం వరకు పిల్లలు వయసుకు తగ్గ పొడవు లేని వారుగా ఉన్నారు.
* చండీగఢ్‌లో 79 శాతం స్త్రీలు రక్త హీనతతో ఉండగా కేరళలో ఈ శాతం 34 గా

గమనించగలము.

### వ్యవసాయ రంగ పెరుగుదలకు, తలసరి స్థూల ఆదాయానికి, పోషకాహార సూచిలో మార్పుకు గల సంబంధం

* అనేక అధ్యయనాలు, ముఖ్యంగా FAO 2012 నివేదిక ప్రకారం దేశ తలసరి స్థూల ఆదాయం పెరిగి ఉన్న స్థితిలో, జనాభా తమ కుటుంబ ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ తమ ఆహారపు అలవాట్లు మెరుగు పరచుకుంటారు. అందువల్ల పోషకాహార లోపం సమస్యలు మెరుగు అవుతాయి అని నిర్ధకరించడం జరిగింది.

1990 నుండి 2014 వరకు గల పోషకాహార లోపం పరిధిని తలసరి స్థూల ఆదాయంతో 2011 విలువల ప్రకారం పోల్చి పొందుపరచిన గ్రాఫ్ ద్వారా యీ విషయం అర్థం చేసుకోగలము. (చిత్రం-3).

విలువగల ఆహార ఉత్పత్తులు పెంచి సాధించ గలిగితే కొంతవరకు నాణ్యమైన ఆహారంతో బాటు, ఆహార వైవిధ్యం, ఆర్థిక సాధికారత సాధిస్తూ ఆహార భద్రతను సాధించాగలుగు తాము.

దీనికి తోడుగా వ్యవసాయ ఉత్పత్తులలో వృథాను రైతు స్థాయి నుండి మార్కెట్ స్థాయి వరకు తగ్గించడం అవసరం. ఆహార భద్రతకు సంబంధించి, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ విలువలను నియంత్రించి, వినియోగ దారులకు ఆహారం అందుబాటు ధరలలో అందించగలిగితే మెరుగైన స్థాయిని అందుకో గలుగుతాము. దీనికి గాను మార్కెటింగ్ వ్యవస్థలో అనుకూల వాతావరణం కూడా కల్పించాలి. వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లను, శీతల గిడ్డంగులను ప్రోత్సహించి ఉత్పత్తుల విలువలను నియంత్రించాలి. ఉత్పత్తుల రైతు నుండి నేరుగా



చిత్రం: 3 భారత్‌లో పౌష్టికాహారలోపం, ఆర్థికవృద్ధి

పోషకాహార సమస్యలు గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువగా ఉండడం, గ్రామీణ ప్రాంతాలలో అనేకమంది వ్యవసాయమే జీవన ఆధారంగా ఉండడం, వీరి తలసరి ఆదాయం తక్కువగా ఉండడం గమనార్హం. అందువల్ల వ్యవసాయాన్ని మెరుగు పరచే ప్రణాళికలతోనే ఆర్థిక పరిస్థితులు మెరుగుపడి, పోషకాహార లోపం పరిధులను అధిగమించగలుగుతాము అని భావించవచ్చు. కేరళలో పరిస్థితిని పునరావలోకించినట్లైతే, అక్కడ అధిక విలువలు గల వ్యవసాయ ఉత్పత్తులతో, ఉత్పాదకత పెరిగి, పోషకాహార సమస్యల పరిస్థిని ఎదుర్కొంటు న్నారు. అంటే వ్యవసాయంలో వృద్ధిరేటును

వినియోగ దారులకు అందే విధానాలను రూపొందించాలి, ఎలక్ట్రానిక్ ట్రేడింగ్ (ఈనాం) సౌకర్యాలను కల్పించడమే గాక రైతులకు వాటిపైన అవగాహన కలిగించాలి. పంట సరళిని సూచించడం వంటి చర్యలు ఏంతో లాభదాయకంగా ఉంటాయి. పంట ఉత్పత్తిలో బయో ఫోర్టిఫికేషన్ విధానాలతో ఐరన్, జింక్, విటమిన్ A వంటి పోషకాలను మెరుగు పరచి మంచి ఫలితాలను ఆశించవచ్చు. కాబట్టి వ్యవసాయ వృద్ధితో పోషకాహార భద్రతను సాధించుకోగలుగుతాం. అయితే వ్యవసాయంతో పాటుగా ఇతర చర్యలు కూడా చేపట్టాలి.

### స్త్రీల సామాజిక స్థాయి, విద్యకు పోషకాహార సూచీ మెరుగుదలకు సంబంధం

అనేక అధ్యయనాల ద్వారా నిర్ధారించిన విషయం ఏమంటే, సామాజికంగా స్త్రీల స్థాయి మెరుగ్గా ఉన్న కుటుంబాలలోనూ, విద్య ప్రమాణాలు మెరుగుగా ఉన్న కుటుంబాల లోనూ, నిర్ణయాత్మక సాధికారత పొందితే, తమ కుటుంబ ఆరోగ్యం, పిల్లల పెంపకం పైన అవగాహనతో మెరుగైన పోషక సూచీని సాధించగలుగుతాము. మన గ్రామీణ ప్రాంతాలలో నిరక్షరాస్యత, స్త్రీల సామజిక వెనుకబాటుతనం వల్లనే అధిక పోషకాహార లోప సమస్యలను ఎదుర్కొంటున్నాం.

### పిల్లల సంరక్షణ విధానాలకు – పోషకాహార సమస్యలకు గల సంబంధం

పిల్లల సంరక్షణ విధానాల ద్వారా అనగా పుట్టగానే బిడ్డ చేత ముర్రు పాలు త్రాగించడం, సరియైన విధానాలలో తల్లి పాలు గాని, బాటిల్ పాలు గాని శుభ్రమైన వాతావరణ పరిస్థితులలో అందచేయడం, అనారోగ్య పరిస్థితులను గమనించి తక్షణ చర్యలను చేపట్టడం, వ్యాధి నిరోధక టీకాలను క్రమాను సారంగా ఇవ్వడం ద్వారా చాలా వరకు పోషకాహార సమస్యలను , తదనగుణంగా వచ్చే వ్యాధి లక్షణాలను నియంత్రించుకోగలం.

వస్తు నాణ్యత కలిగిన వనరులను వాడటం, నీరు, పరిసరాల పారిశుధ్యంపైన అత్యంత శ్రద్ధ వహించడం ద్వారా పోషకాహార సమస్యను ఎదుర్కొని ఆహార భద్రతను సాధించగలం.

పైన విషయాలన్నింటిని సమీకరించి వ్యవసాయాభివృద్ధికి తోడ్పడే అంశాలను మెరుగు పరచినట్లైతే తలసరి ఆదాయం వృద్ధి చెంది, నాణ్యత గల ఆహారం అందుబాటు ధరలలో ప్రజలకు లభ్యం అవుతుంది. తద్వారా పోషకాహార భద్రతను మెరుగు చేసుకోగలం. దీనికి తోడు వ్యక్తిగత విద్య, ఆహారం పోషణపై అవగాహన కల్పించినట్లయితే, సమస్యలను చాలా వరకు నియంత్రించుకోగలం. ■

# సామాజిక సమ్మిళిత చర్యలు - బలహీన వర్గాలకు చేయూత

- వి. శ్రీనివాస్, ఐఏఎస్



**బలహీనవర్గాల వారిని సమాజంలో భాగంగా చేర్చేందుకోసం చేపట్టే సమగ్రమైన సంక్షేమాభివృద్ధి పథకాల అమలు కోసం తగినన్ని నిధులు కేటాయించడమేగాక వాటి అమలుతీరును స్వతంత్ర మంత్రిత్వ శాఖలు పర్యవేక్షిస్తుంటాయి. అంతేగాకుండా బలహీనవర్గాలకు చెందినవారి హక్కుల పరిరక్షణకోసం ఉన్న చట్టాలు సక్రమంగా అమలు జరుగుతున్నాయోలేదో ఎప్పటికప్పుడు విచారణ జరిపేందుకు స్వయంప్రతిపత్తిగల కమిషన్ల నియామకం రాష్ట్రాలలోనేగాక జాతీయస్థాయిలో కూడా జరుగుతోంది.**

సమాజంలో బలహీనవర్గాల వారి జీవనావకాశాలు మెరుగుపర్చడానికి సమ్మిళిత అనుకూలమైన అవకాశాలను కల్పించింది. విద్య, ఉపాధి, సామాజిక సేవలు తదితర అంశాలలో వారికి రక్షణ లభిస్తుందని రాజ్యాంగ ప్రవేశికలో పేర్కొన్నారు. ఈ అవకాశాలు లేకుంటే వారు పేదరికంలో మగ్గిపోతూ సామాజికంగా తక్కువ స్థాయిలో ఉండి పోవడంవల్ల ఆత్మన్యూనతకు గురై, భౌతికంగా అంతరించే ప్రమాదం ఉంది. ఈ వ్యాసం బాలికలు, మహిళలు, వృద్ధులు ఇతర బలహీన వర్గాల వారి జీవితాలను మెరుగుపర్చడానికి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, చేపట్టిన కార్యక్రమాలను విశ్లేషిస్తుంది.

**రాజ్యాంగ నిబంధనలు**

భారత దేశంలోని పౌరులందరికీ – న్యాయం, సాంఘిక, ఆర్థిక, రాజకీయ స్వేచ్ఛకు, భావవ్యక్తీకరణ, మతవిశ్వాసాలు; సమాన హోదా అవకాశాలు లభిస్తున్నాయి. బలహీన వర్గాలకు సమానస్థాయి కల్పించడంపై భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులతోబాటు జాతీయ విధానాలను నిర్దేశించే ఆదేశిక సూత్రాల ద్వారా కూడా స్పష్టంగా వివరించబడింది. అందరికీ సమాన స్థాయి కల్పించేందుకు భారత రాజ్యాంగంలోని మూడో భాగం 6 ప్రాథమిక హక్కులను కల్పిస్తోంది. వీటిలో సమానత్వ హక్కు, స్వతంత్ర హక్కు, దోపిడీని వ్యతిరేకించే హక్కు, మత స్వేచ్ఛ, విద్య సాంస్కృతిక హక్కు, తమ సమస్యలకు రాజ్యాంగపరమైన పరిష్కారాలను కోరే హక్కు కూడా ఉన్నాయి. వివిధరకాలైన వైకల్యాలతో బాధపడే వారికీ కూడా హక్కులు వర్తిస్తాయి

అధికరణం 15 (3) విద్యా సంస్థలు, ఉపాధి అవకాశాలలోను మహిళలు, పిల్లల కోసం ప్రత్యేక నిబంధనలను రూపొందించేందుకు ప్రభుత్వానికి అధికారాన్నిస్తుంది. కొన్ని విభాగాలలో మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించడం, స్థానిక సంస్థలు, విద్యా సంస్థలలో మహిళల రిజర్వేషన్ కోసం ప్రభుత్వం ఈ నిబంధనను విస్తృతంగా ఉపయోగించుకుంది. అధికరణం 15 (4) సామాజికంగా విద్యాపరంగా వెనుకబడిన వర్గాలవారిలో విద్యాభివృద్ధిని ప్రోత్సహించడానికి ప్రయత్నిస్తుంది, అంటే షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు ఇతర వెనుకబడిన తరగతులకు (OBC) చెందిన విద్యార్థులను ప్రభుత్వేతర విద్యా సంస్థలలో కూడా ప్రవేశించేందుకు తగిన విధంగా సహకరిస్తుంది. అధికరణం 17

రాజస్థాన్ రాష్ట్ర రెవిన్యూ బోర్డు అధ్యక్షులు & రాజస్థాన్ రాష్ట్ర పన్నుల మండలి అధ్యక్షులు, జైపూర్.
E-mail : vsrinivas@nic.in

అంటరానితనం ఏరూపంలో కూడా అమలు కాకుండా పూర్తిగా నిషేధిస్తుంది. నిస్సహాయులైనవారికి వ్యతిరేకంగా చేపట్టే ఎలాంటి వికృత చేష్టలనైనా చట్టప్రకారం శిక్షార్హమైన తీవ్ర నేరాలుగా పరిగణిస్తారు. రాజ్యాంగంలోని నాలుగో భాగంలో ప్రభుత్వ విధానాలను స్పష్టం చేసే ఆదేశిక సూత్రాలను పొందుపరచారు. ప్రజలందరి చట్టబద్ధమైన, సాంఘిక, ఆర్థిక రాజకీయ హక్కులను పరిరక్షించడం ద్వారా ప్రజాసంక్షేమాభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేయడమేగాక, తమ విధానాల వాటిగురించి ప్రజలందరికి తెలియజెప్పేందుకు వీలుగా ప్రజాజీవితంతో ముడివడిన సంస్థలన్నింటినీ సిద్ధపరచాలని రాజ్యాంగంలోని 38వ అధికరణం స్పష్టం చేస్తోంది. బాలకార్మిక వ్యవస్థను రద్దు చేయడంతోబాటు స్త్రీ పురుషులమధ్య ఎలాంటి తేడాలేకుండా సమానమైన పనికి సమానమైన వేతనాలు చెల్లించాలని 39వ అధికరణం స్పష్టం చేస్తోంది. 41వ అధికరణం కింద వృద్ధాప్యం, అనారోగ్యం, అశక్తత లేదా ఇతర అనివార్యమైన వైపరీత్యాల సందర్భంగా ప్రభుత్వం ప్రజలకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించడంలో తగిన సహాయం చేయాల్సిఉంటుంది. కార్యస్థానాల్లో న్యాయమైన, మానవీయ కోణంలో ఉన్నత ప్రమాణాలతో కూడిన పరిస్థితులు కల్పించడమే గాక, గర్భవతులకు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయవలసి ఉంటుందని 42వ అధికరణం స్పష్టం చేస్తుంది.

రాజ్యాంగంలోని 11వ అధ్యాయం కింద 243 G అధికరణం ప్రకారం, దివ్యాంగజనులు, మానసికంగా కుంగిపోతున్నవారి సంక్షేమంతో సహా బలహీనులైన వారి సంక్షేమం కోసం కృషి చేయాల్సి ఉంది. అలాగే 12వ షెడ్యూల్‌లోని అధికరణం 243 w కింద మానసిక, శారీరక దివ్యాంగజనులతో సహా బలహీనుల సంక్షేమాన్ని కాపాడాల్సి ఉంటుంది.

## పాలనాయంత్రాంగం

భారతదేశంలో సామాజిక సంఘటిత కార్యక్రమాలను సాంఘిక న్యాయం, సాధికారత, గిరిజన వ్యవహారాల, మహిళా, శిశు సంక్షేమాభివృద్ధి, మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వశాఖలు అమలు చేస్తున్నాయి.

## సామాజిక న్యాయం - సాధికారత మంత్రిత్వ శాఖ

సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ షెడ్యూల్డ్ కులాలవారి సంక్షేమం కోసం 42 పథకాలను అమలు చేస్తోంది. తాము అమలుచేసే వివిధ పథకాల ద్వారా విద్యా, ఆర్థిక సామాజిక సాధికారత దాని మంత్రిత్వ శాఖ ఆకాంక్షిస్తోంది. అంటరానితనం నిర్మూలన చట్టాన్ని అమలు చేయడం, షెడ్యూల్డ్ కులాలు, తెగల వారికీ వ్యతిరేకంగా జరిగే అణచివేతలను నివారించడమే లక్ష్యంగా ఈ మంత్రిత్వశాఖ రెండు చట్టాలకు పరిరక్షకుడుగా వ్యవహరిస్తుంది ఇవి 1955 పౌరహక్కుల పరిరక్షణ చట్టం, 1989 షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలవారిపై జరిగే దురాగతాల నివారణ చట్టం అమలు బాధ్యత ఈ మంత్రిత్వశాఖపై ఉంటుంది. షెడ్యూల్డ్ కులాల సంక్షేమం కోసం వివిధ చట్టాలలో నిర్దేశించిన అంశాల అమలుకు సంబంధించిన అన్ని విషయాలపై దర్యాప్తులను పర్యవేక్షించడానికి, చట్టాలు అమలు చేయని పరిస్థితులకు సంబంధించి నిర్దిష్టమైన ఫిర్యాదులను విచారించటానికి రాజ్యాంగంలోని 383 అధికరణం కింద షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ ఏర్పాటయింది.

షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థుల సాధికారతకోసం మాధ్యమిక విద్య అనంతరం ఉన్నత విద్య అభ్యసించేందుకు వీలుగా ఉపకార వేతనాలు చెల్లించడం ద్వారా వారు విద్యను పూర్తిచేయడానికి ఆర్థిక సహకారం అందజేస్తుంది. ఈ ఆర్థిక సహాయంలో నిర్వహణ భత్యం, ఫీజు వాపసు, బుక్ బ్యాంక్ సౌకర్యం తదితర అనుమతులు ఉంటాయి బాబు జగ్జీవన్ రామ్ ఛాత్రవాస్ యోజన ద్వారా షెడ్యూల్డ్ కులాలకు చెందిన బాల బాలికలకు మాధ్యమిక, ఉన్నత పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలలోని హాస్టళ్లలో వసతి గృహాలలో ఉండేందుకు అవకాశం కల్పిస్తారు. షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులు స్నాతకోత్తర విద్య కొనసాగించేందుకు వీలుగా ప్రభుత్వం విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యు.జి.సి.) ద్వారా ఎం.ఫిల్., PhD కార్యక్రమాలు చేపట్టేందుకు నిధులను సమకూరుస్తుంది. షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులు కొన్ని ప్రత్యేక అంశాలపై విదేశాలలో పోస్టు గ్రాడ్యుయేషన్, డాక్టరేట్ చేసేందుకు వీలుగా ఉపకారవేతనాలు అందజేసేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకాన్ని అమలు చేస్తోంది. షెడ్యూల్డ్ కులాల వారి ఆర్థికాభివృద్ధి, సాధికారత కోసం కేంద్రప్రభుత్వం ప్రత్యేకంగా షెడ్యూల్డ్ కులాల ఉపప్రణాళికను అమలుచేస్తోంది. షెడ్యూల్డ్ కులాలవారి ఆర్థికాభివృద్ధి కోసం వివిధ రాష్ట్రాలలోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థలు కేంద్ర ప్రభుత్వం బదిలీ చేసిన ఈక్విటీ సొమ్ముతో వివిధ పథకాలను అమలు చేస్తాయి.

రాష్ట్రాలలోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్పొరేషన్లు మార్జిన్ మనీ, సబ్సిడీలు అందజేసి బ్యాంకుల ద్వారా రుణసౌకర్యం కల్పించేందుకు సహకరిస్తాయి. వీటి కార్యక్రమాలను సమన్వయ పరచేందుకు జాతీయ స్థాయిలో నేషనల్ షెడ్యూల్డ్ క్యాస్ట్స్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటైంది. దీని ద్వారా షెడ్యూల్డ్ కులాలకు చెందిన కుటుంబాలలోని యువతకు నైపుణ్యంతో కూడిన సహేతుకమైన శిక్షణ కల్పించి రాయితీలపై రుణాలను అందించడంతో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను తయారుచేసి దారిద్ర్యరేఖ దిగువన ఉన్నవారికి ఆర్థిక సాధికారత, స్వావలంబన కల్పించడమే ప్రధాన లక్ష్యం. పారిశుద్ధ్య కార్మికుల విముక్తి కోసం, వారి ఆర్థికాభివృద్ధి కోసం జాతీయ స్థాయిలో సఫాయి కర్మచారీస్ ఫైనాన్స్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేశారు.

## దివ్యాంగజనుల సంక్షేమ శాఖ

దివ్యాంగజనుల సమస్యలకు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలించి వారి సంక్షేమం కోసం చేసిన చట్టం సక్రమంగా

అమలు చేసేందుకు, దివ్యాంగజనుల సాధికారత కోసం ప్రభుత్వం ఒక ప్రత్యేక శాఖను కూడా ఏర్పాటు చేసింది. భారతదేశ పునరావాస మండలి (రీహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) చట్టం-1992 పర్సన్స్ విత్ డిజెబిలిటీస్ (ఈక్వల్ ఆపర్చునిటీస్, ప్రొటెక్షన్ ఆఫ్ రైట్స్ అండ్ ఫుల్ పార్టిసిపేషన్) ఆక్ట్ - 1955, నేషనల్ ట్రస్ట్ ఫర్ ది వెల్ఫేర్ ఆఫ్ పర్సన్స్ విత్ ఆటిజం, సెరిబ్రల్ పాల్సీ, మెంటల్ రిటార్డేషన్ అండ్ మల్టీపుల్ డిజెబిలిటీస్ ఆక్ట్ 1999 వంటివాటి అమలుపై ఈ శాఖ ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటూ ఉంటుంది. ఈ శాఖ కింద మూడు చట్టబద్ధమైన సంస్థలు పనిచేస్తున్నాయి. వివిధరకాలుగా దివ్యాంగజనులకు అవసరమైన ఆధునిక సాంకేతిక శిక్షణ విధానాలు రూపొందించడం, పునరావాసం కల్పించడంలోనూ భారతదేశపు పునరావాస కౌన్సిల్ బాధ్యత వహిస్తుంది. 1955 చట్టం ప్రకారం వివిధ రాష్ట్రాలలో దివ్యాంగ జనుల శాఖల కమిషనర్లపై జాతీయ స్థాయిలో కేంద్ర చీఫ్ కమిషనర్ ముఖ్య కార్యనిర్వహణాధి కారిగా వ్యవహరిస్తారు. నేషనల్ ట్రస్ట్ ఒక చట్టబద్ధమైన సంస్థ. వైకల్యాలున్న వ్యక్తులను సాధ్యమైనంతమేరకు పూర్తి స్వతంత్రంగా జీవించడానికి, అవసరమైన ఆధారిత సేవలు అందించే సంస్థలకు మద్దతును విస్తరించడానికి జాతీయ స్థాయిలో చట్టబద్ధమైన "నేషనల్ ట్రస్ట్" కృషి చేస్తుంది. వైకల్యం రకాన్ని, స్థాయినిబట్టి ఏ రకమైన వైకల్యంవల్ల ఎలాంటి సమస్యలు ఎదురవుతాయో గుర్తించి బహుముఖ వ్యూహాలతో వాటి పరిష్కారం కోసం కృషి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆరు జాతీయ స్థాయి సంస్థలను ఏర్పాటు చేసింది. దివ్యాంగజనుల ఆర్థికాభివృద్ధి కోసం, వారికి రుణ సదుపాయాలను విస్తరించడానికి జాతీయ స్థాయిలో అత్యున్నతమైన దివ్యాంగజనుల ఆర్థికాభివృద్ధి కార్పొరేషన్ ఏర్పాటైంది. దివ్యాంగజనులు దేశంలో ఎక్కడికైనా స్వేచ్ఛగా వెళ్ళడానికి ఎలాంటి అవరోధం లేకుండా అనుకూల వాతావరణాన్ని కల్పించే ఉద్దేశ్యంతో "ఆక్సెసిబుల్ ఇండియా" ప్రచార కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2015 డిసెంబర్ 31న ప్రారంభించారు. అందుబాటులో ఉన్న భారతదేశ ప్రచారం డిసెంబర్ 31, 2015 న దేశవ్యాప్తంగా ఉన్న దివ్యాంగజనుల కోసం ఎలాంటి అవరోధం లేని అనుకూల వాతా వరణాన్ని కల్పించే ప్రధాన కార్యక్రమంగా ఉంది.

## గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ

దేశంలోని షెడ్యూల్డ్ తెగల సామాజిక-ఆర్థిక అభివృద్ధి కోసం కేంద్రీకృత ప్రణాళికా బద్ధమైన అభివృద్ధి సాధించేందుకు గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ సమీకృత విధానాన్ని రూపొందించింది. రాజ్యాంగంలోని 244 (1) అధికరణం ప్రకారం షెడ్యూల్ చేసిన ప్రాంతాలేమిటో వివరించారు. 244 (2) అధికారణానికి సంబంధించి అస్సాం, మేఘాలయ, త్రిపుర, మిజోరాం రాష్ట్రాలలో షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని ఉపభాగాలు, గిరిజన ప్రాంతాలుగా ప్రకటించిన ప్రాంతాల అభివృద్ధి కోసం జిల్లా మండళ్ళు/ప్రాంతీయ మండళ్ళు ఏర్పాటవుతాయి. రాజ్యాంగంలోని 275 (1) అధికరణం ప్రకారం గిరిజన ప్రాంతాలుగా గుర్తింపు పొందిన చోట్ల గిరిజన ఉప-ప్రణాళికలు అమలు చేసేందుకు వివిధ రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సహాయాన్ని గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ మంజూరు చేస్తుంది. గిరిజన సబ్-ప్లాన్ ప్రాంతాల్లో ఆశ్రమ పాఠశాలలు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్, వృత్తి శిక్షణా కేంద్రాల స్థాపనకు, చిన్న అటవీ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కల్పించేందుకు, జీవనోపాధి కార్యక్రమాల నిర్వహణకు గిరిజన వ్యవహారాల శాఖ నిధులను కేటాయిస్తుంది. కేంద్రస్థాయిలోను రాష్ట్రస్థాయి లోను గిరిజన సహకార మార్కెటింగ్ ఫెడరేషన్ లకు తగిన వాటా మూలధనంతో బాటు ఇతరత్రా ఆర్థిక సహాయాన్ని కూడా అందజేస్తుంది. గిరిజన యువకులు స్వయం ఉపాధి వ్యాపారాలను చేపట్టేలా ప్రోత్సహించ డానికి నేషనల్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ ఫైనాన్స్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ తగిన ఆర్థిక సహాయం అందజేస్తుంది. గిరిజనుల హక్కులను కాపాడ డానికి రాజ్యాంగంలోని 338-ఎ అధికరణం కింద "షెడ్యూల్డ్ తెగల జాతీయ కమిషన్"ను స్వతంత్ర సంస్థగా ఏర్పాటు చేశారు.

## వృద్ధులకు జాతీయ విధానం

వృద్ధులకు భారత జాతీయ విధానము, వృద్ధాప్యంలో తమ స్వంత మరియు తమ జీవిత భాగస్వామి సంక్షేమం సంరక్షణ కోసం తగిన చర్యలు చేపట్టే విధంగా ప్రోత్సహిస్తుంది. కుటుంబ సభ్యులు వృద్ధుల గురించి శ్రద్ధ వహించాలి. వృద్ధులకు సేవలు అందించేవారికీ, వృద్ధుల సంరక్షకులకు శిక్షణ ఇవ్వడానికి పరిశోధన శిక్షణా సదుపాయాలను ప్రోత్సహించ టానికి వృద్ధుల భారత జాతీయ విధానం కృషి చేస్తుంది. వృద్ధుల కోసంతగిన విధానాలను అభివృద్ధి చేయడంలో ప్రభుత్వానికి సలహాలు ఇవ్వడానికి తగిన సహాయం చేయడానికి ప్రభుత్వం జాతీయ వృద్ధుల మండలిని ఏర్పాటు చేసింది.

## మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ

మహిళలు, పిల్లల హక్కులను పరి రక్షించేందుకు, వారి సమస్యలను పరిష్కరించి సంపూర్ణమైన అభివృద్ధి చర్యలు చేపట్టాలన్న ధ్యేయంతో 2006లో మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేశారు. మహిళలు, చిన్న పిల్లల కార్యక్రమాలకు సంబంధించి ఇతర మంత్రిత్వ శాఖలు, వివిధ - రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కూడా సమన్వయం సాధిస్తుందని ఆశించారు. మహిళలపై వివక్షను తొలగించ డానికి, పరిష్కరించడానికి, ఇప్పటికే మహిళా శిశు అభివృద్ధి కార్యక్రమాలల్లో కృషి చేస్తున్న సంస్థలను బలోపేతం చేయడానికి, స్త్రీలు, పిల్లల ఆరోగ్య పరిరక్షణకు మంచి సదుపాయాలు కల్పించడం, నిర్ణయాత్మక పద్ధతుల్లో మహిళల భాగస్వామ్యం కోసం సమాన అవకాశాలు కల్పించి అభివృద్ధి ప్రక్రియల్లో సమానస్థాయిలో పాల్గొనేందుకు వీలుగా మహిళల సాధికారత

నెలకొల్పొల్పేందుకు జాతీయ విధానం తోడ్పడుతుంది. మహిళల సాధికారత కోసం జాతీయపాలసీ విస్తృత దృష్టి కోణంలో సూచించిన విధంగానే ప్రభుత్వం చేపట్టిన విధానాలు, కార్యక్రమాలు రూపొం దాయి. మహిళలు, పిల్లల సంరక్షణ, అభివృద్ధికి సంబంధించిన అనేక చట్టాల సంరక్షకుడుగా మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖబాధ్యత చేపడుతుంది. వరకట్న నిషేధ చట్టం, బాల్యవివాహాల నిషేధ చట్టం, కార్యాలయాలలో మహిళలపై లైంగిక వేధింపుల (నివారణ, పరిహారం) చట్టం జువెనైల్ జస్టిస్ (కేర్ అండ్ ప్రొటెక్షన్ అఫ్ చిల్డ్రన్) అమెండ్మెంట్ ఆక్ట్ ఆఫ్ 2011 ఈ శాఖ పరిధిలోకి వస్తాయి. మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో స్త్రీల హక్కులను కాపాడేందుకు మహిళల జాతీయ కమిషన్, పిల్లల హక్కుల రక్షణ కోసం పిల్లల హక్కుల పరిరక్షణ జాతీయ కమిషన్ ఏర్పాటయ్యాయి. మహిళల హక్కులపై అవగాహన కల్పించేందుకు జాతీయ మహిళా కమిషన్ ఢిల్లీలో "హింస రహితమైన ఇల్లు- మహిళల హక్కు" నినాదంతో ప్రచారం చేపట్టింది. పిల్లలపై లైంగిక దాడుల నుంచి పిల్లలను రక్షించేందుకు "ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ ఆఫెన్సెస్ ఆక్ట్" 2012 నవంబర్ 14 నుంచి అమలులోకివచ్చింది. 18 ఏళ్ల లోపు పిల్లలందరిని లైంగిక దాడులు, లైంగిక వేధింపుల నుంచి రక్షించేందుకు ఈ సమగ్రమైన చట్టం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పవచ్చు.

మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ అమలు చేసిన ప్రధాన పథకాలలో సమీకృత శిశు అభివృద్ధి పథకం (ఐసీడీఎస్) పరిధిలో "బేటీ బచావో బేటీ పడావో" వంటి మహిళా సాధికార పథకాలు మహిళలు, పిల్లల అభివృద్ధి రంగంలో ఎంతో సహాయపడ్డాయి. ఐసీడీఎస్ పరిధిలో అంగన్వాడి సేవల పథకం, ప్రధాన మంత్రి మాతృ వందన యోజన, నేషనల్ క్రెచ్ స్కీం, పోషణ అభియాన్, స్కీం ఫర్ అడోలేసెంట్ గర్ల్స్ అండ్ చైల్డ్ ప్రొటెక్షన్ స్కీం వంటి ఆరు పథకాలు అమలులో ఉన్నాయి. ఆరు సంవత్సరాలలోపు వయస్సు ఉన్న పిల్లలకు పోషకాహారాన్ని అందజేయడం ద్వారా వారి ఆరోగ్య స్థితిని మెరుగుపరచటం, గర్భిణులు, పాలిచ్చే తల్లులను పెంచడం, మరణం, వ్యాధిగ్రస్తత, పోషకాహార లోపాలను తగ్గించడం వంటి లక్ష్యాలతో ఐసీడీఎస్ కార్యక్రమాలను చేపడుతున్నది. ఆడపిల్ల పుట్టుకను ఆనందంగా స్వీకరించడమేగాక ఆడపిల్లల చదువుపై దృష్టి సారించేందుకు "భేటీ బచావో భేటీ పఢావో" పథకం తోడ్పడుతుంది. లింగ నిర్ధారణ పరీక్షలను, బాలికల హత్యలను నివారించి బాలబాలికలు సమానమన్న భావనతో బాలికల విద్యాభ్యాసాన్ని ప్రోత్సహించడమే ఈ పథకం యొక్క ప్రధాన లక్ష్యాలు. కొన్నిజిల్లాల్లో అత్యంత దారుణంగా ఉన్న లింగ నిష్పత్తిని ఏడాదికి కనీసం 2 పాయింట్ల వంతున తగ్గించడం ద్వారా లింగ నిష్పత్తిని మెరుగుపర్చడానికి ఈ పథకం తోడ్పడుతుంది. "బేటీ బచావో బేటీ పఢావో" కార్యక్రమం విస్తరణ పథకమైన "జాతీయ పోషకాహార మిషన్"ను ప్రధాన మంత్రి 2018 మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాజస్థాన్‌లోని "ఝున్ ఝున్"లో ప్రారంభించారు. లింగవివక్షత పాటించే ప్రశ్నేలేకుండా బాలబాలికలకు నాణ్యమైన విద్య అందించాలని ప్రధానమంత్రి సూచించారు. బాలికలు కూడా అనేక రంగాలలో తమ ప్రతిభ చాటుకుని దేశానికీ కీర్తిప్రతిష్టలు ఆర్జించి పెడుతుండడం గర్వకారణమని అందువల్ల బాలికలు భారం కాదని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

**ముగింపు**

భారతదేశంలో బలహీనవర్గాల వారిని సమాజంలో భాగంగా చేర్చేందుకోసం చేపట్టే సమగ్రమైన సంక్షేమాభివృద్ధి పథకాల అమలు కోసం తగినన్ని నిధులు కేటాయించడమేగాక వాటి అమలుతీరును స్వతంత్ర మంత్రిత్వ శాఖలు పర్యవేక్షిస్తుంటాయి. అంతేగాకుండా బలహీన వర్గాలకు చెందినవారి హక్కుల పరిరక్షణకోసం ఉన్న చట్టాలు సక్రమంగా అమలు జరుగు తున్నాయోలేదో ఎప్పటికప్పుడు విచారణ జరిపేందుకు స్వయంప్రతిపత్తిగల కమిషన్ల నియామకం రాష్ట్రాలలోనేగాక జాతీయస్థాయిలో కూడా జరుగుతోంది. వీటిలో ప్రభుత్వం విధానాలకు అనుగుణంగా జాతీయస్థాయిలో ఆర్థికాభివృద్ధి సంస్థల ద్వారా అమలు చేస్తున్న ఆర్థిక సాధికార కార్యక్రమాలు కూడా ఉన్నాయి. ఇలాంటి సమగ్రమైన సంక్షేమాభివృద్ధి పథకాలు పటిష్టంగా అమలు జరిగితే భారతదేశంలో బలహీన వర్గాలకు సాధికారత ఏర్పడుతుంది. ■


## యోజన చందా ఆన్‌లైన్‌లో

భారత ప్రభుత్వ ప్రచురణల విభాగం వారి యోజన, ఇతర పత్రికలకు చందాను ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు. www.Bharatkosh.gov.in వెబ్ సైట్‌లో Publications' Division వారి linkను క్లిక్ చేసి సూచనలను అనుసరించండి. చెల్లింపులు నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డ్ ద్వారా చెయవచ్చు. చందా వివరాలు సంవత్సరానికి రూ. 230/-, రెండు సంవత్సరాలకు రూ. 430/-, మూడు సంవత్సరాలకు రూ. 610/-లు.

**– సీనియర్ ఎడిటర్**

# శరవేగంగా జరుగుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులు

తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ దశలోనే ఎన్నో రికార్డులను నెలకొల్పింది. భూసేకరణ ప్రక్రియ, అంతర్రాష్ట్ర ఒప్పందాలు, కేంద్ర ప్రభుత్వ అనుమతులు, టెండర్ల ప్రక్రియ, నిర్మాణం....ఇలా అన్ని రంగాల్లోనూ కాళేశ్వరం కొత్త రికార్డులను చరిత్రలో తిరగరాస్తున్నది. 37 లక్షల ఎకరాలకు సాగునీరందించనున్న మానవనిర్మిత బహుళార్థ సాధక కాళేశ్వరం ప్రాజెక్టు, పనులు వచ్చే వానాకాలం నాటికి పూర్తి చేయాలనేది లక్ష్యం.

కాళేశ్వరం ప్రాజెక్టులో 209 కిలోమీటర్ల పొడవున సొరంగం,1531 కిలోమీటర్ల పొడవుతో గ్రావిటీ కెనాల్, 98 కిలోమీటర్ల పొడవు ప్రెజర్ కెనాల్ పనులు వాయువేగంతో సాగుతున్నాయి. ప్రపంచ రికార్డు వైపు వెళ్లేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు పరుగులు పెడుతున్నది.

ప్రాజెక్ట్ పనులు నిరాటంకంగా కొనసాగడంలో ఇరిగేషన్, రెవిన్యూ, అటవీ, విద్యుత్తు, గనులు తదితర ప్రభుత్వ శాఖలు, కాంట్రాక్టు సంస్థలు సమన్వయంతో సమష్టిగా పనిచేస్తూ రికార్డు స్థాయిలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టుకు చెందిన 29 ప్యాకేజీలలో మొత్తం 45 వేల మందికి పైగా కార్మికులు ఈ మహత్తర మానవ నిర్మిత బహుళార్థ సాధక ఎత్తిపోతల పథకంలో పని చేస్తున్నారు

**తెలంగాణలోని సాగుభూమిలో 60 శాతానికి సాగునీరందించనున్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం తుది దశకు చేరుకుంటున్నది.**

మేడిగడ్డతో పాటు అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలు, పంపు హౌజ్‌లు, టన్నెల్స్ లోనూ అన్ని చోట్ల ఏకకాలంలో పనులు అదే వేగంతో జరుతుండడం విశేషం. కాళేశ్వరం ద్వారా పాత మహబూబ్ నగర్ జిల్లా మినహా మిగతా 9 ఉమ్మడి జిల్లాల్లోనూ ఫలితాలు అంద నున్నాయి. మొత్తం 15 జిల్లాల్లో 37 లక్షల ఎకరాలకు సాగునీటితో మేలు జరగ నుంది. హైదరాబాద్ జంటనగరాలకు ఈ వర్షాకాలం నుంచే ఎల్లంపల్లి ద్వారా తాగునీటి సరఫరాకు ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. హైదరాబాద్ నగరానికి సమీపంలో నిర్మాణంలో ఉన్న కొండపోచమ్మ సాగర్, రంగనాయకి సాగర్ పథకాలను కూడా వేగంగా పూర్తి చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

సగటున ప్రతీఏటా దాదాపు 1650 టి.ఎం.సి.ల నీరు దిగువ గోదావరిలో లభ్యమవుతుంది. ఈ నీటిని మనం వినియోగించుకోలేకపోతే వృధాగా సముద్రంలో కలిసిపోతుంది. వృధాగా సముద్రంలోనికి పోయే నీటిని వాడుకుని ఉత్తర తెలంగాణకు ప్రాణాధారమైన శ్రీరాంసాగర్, నిజాంసాగర్, సింగూర్ రిజర్వాయర్‌ల ఆయకట్టు స్థిరీకరణకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. కాళేశ్వరంకు దిగువన మేడిగడ్డవద్ద 100 మీటర్ల ఎఫ్ ఆర్ ఎల్ తో ఒక బ్యారేజి, ఆ బ్యారేజీకి ఎగువన గోదావరిపై అన్నారం, సుందిళ్ళ గ్రామాల వద్ద మరో రెండు బ్యారేజీలను నిర్మిస్తున్నారు. 180 టి ఎం సి ల నీటిని మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి దాకా రోజుకు 2 టి ఎం సి లు ఎత్తిపోసి 15 జిల్లాల్లో విస్తరించి ఉన్న 18.25 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడానికి జలాశయాలు, ప్రధాన కాలువలు, ఉప కాలువలు, టన్నళ్ళు, పంప్ హౌజ్‌లు ఇతర అవసరమైన నిర్మాణ పనులతో గోదావరి తీరం హోరెత్తుతున్నది. దారి పొడుగునా ఉన్న గ్రామాలకు, హైదరాబాద్ నగరానికి తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీరు సరఫరా జరగనున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో మొత్తంగా తెలంగాణా ఆర్థిక ముఖ చిత్రమే మారుతుంది. దేశంలో ఒక అగ్రగామి రాష్ట్రంగా తెలంగాణ రూపొందు తుంది.

ఇటీవలే కాళేశ్వరం ప్రాజెక్టు పనులను పరిశీలించిన కేంద్ర జలసంఘం ప్రతినిధులు పనులు జరుగుతున్న తీరు అద్భుతమని ప్రశంసించారు.

దేశం గర్వించేలా కాళేశ్వరం ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయని, కాళేశ్వరం ప్రాజెక్ట్ రాష్ట్రానికే తలమానికం, తెలంగాణ కొంగుబంగారం అని కేంద్ర జల సంఘం చైర్మన్ మసూద్ హుస్సేన్ ప్రశంసించారు. కాళేశ్వరం, మేడిగడ్డ, సుందిళ్ళ, అన్నారం, 6, 8 ప్యాకెజి పనులు, రామడుగు లక్ష్మి పూర్ టన్నేల్ పనులను, బరాజ్‌లు, పంపుహౌజ్, గ్రావిటీ కెనాల్‌లను ఆయన పరిశీలించారు.

ప్రాజెక్టు పనుల పరిశీలన అనంతరం సిడబ్ల్యూసి చైర్మన్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు వల్ల ప్రజలకు త్రాగు నీటితో పాటు రైతులకు సాగు నీరు అందుతుందన్నారు. దేశంలో మరే ప్రాంతంలో కూడా ప్రాజెక్టు పనులు ఇంత త్వరగా పూర్తి కావడంలేదన్నారు. ఇంతటి గొప్ప ప్రాజెక్టును చేపట్టినందుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన ప్రశంసించారు. క్లిష్టమైన పనులను కూడా శాస్త్రీయంగా చేపడుతూ ఇంజనీరింగ్ సవాళ్ళను అధిగమించా రన్నారు. ■

ప్రోత్సాహం

# ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు చేయూత

– డాక్టర్ పుల్లయ్య దూదేకుల



మహిళ ముందడుగేస్తేనే కుటుంబం పురోగమిస్తుంది. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ పథకాన్ని ప్రవేశపెట్టినా సద్వినియోగం చేసుకుంటేనే సాధికారత సాధించవచ్చు. మహిళ పారిశ్రామిక వేత్తలు ఉత్పత్తి, వర్తక మరియు సేవారంగాలను ఎంతో ప్రగతిపథంలో నడిపిస్తూ ఉపాధి అవకాశాలు కల్పించడం, కొత్త ఆవిష్కరణలు తదితర అంశాలపై దృష్టి సారించాలి. ఇందుకు ఆదర్శం హైదరాబాద్‌లోని ఐటి హబ్. అద్భుతంగా పని చేస్తూ దేశానికి వన్నే తెస్తున్నది. మహిళలు వ్యాపార రంగంలో అనేక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు.

మహిళాభివృద్ధి బ్యాంకు ఏర్పాటు – పారిశ్రామిక మహిళ సాధికారతకు దృఢ సంకల్పం, పవిత్రాశయం తప్పక సత్ ఫలితాలను ఇస్తాయి. వీటిని మహిళలు ఆయుధాలుగా ధరించి, అన్ని రంగాలలో విజయం సాధించ గలుగుతారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యాపార అవకాశాలు కల్పించినపుడే సాధికారత సాధ్యమవుతుంది. ప్రభుత్వాలకు మహిళా సాధికారత ఒక అజెండాగా ఉండాలి. మహిళల విజయంతో భవిష్యత్తు తరాలు స్ఫూర్తి పొందడమే కాక, యువ మహిళ పారిశ్రామిక వేత్తలు సంఘటిత, అసంఘటిత రంగాల్లోకి ఉత్సాహంగా వస్తారు. సంఘటిత రంగంలోనే కాకుండా అసంఘటిత రంగంలో కుడా యువ మహిళ పారిశ్రామికవేత్తలకు పెట్టుబడి, ఐటి మార్కెట్ సమస్యలను గుర్తించి, తగిన ఋణ సదుపాయాలను కల్పించడానికి మహిళ బ్యాంకు అందుబాటులో ఉన్నపుడు వారు విజయ వంతమైన పారిశ్రామిక వేత్తలుగా ఎదుగుతారు.

సృజనాత్మక వాణిజ్య ఆలోచనలకు బాసటగా నిలిచిన మహిళా సాధికారతకు సహకారం అందించాలని ఇటీవల హైదరాబాదులో ఎనిమిదవ అంతర్జాతీయ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల శిఖరాగ్ర సదస్సులో తీర్మానించారు. వనితల సారథ్యంలోనే అందరికీ సౌభాగ్యమన్న ఇతివృత్తంతో ప్రారంభమైన ఈ మేథోమథనం –మహిళల గెలుపే అందరి గెలుపన్న స్ఫూర్తికి పెద్దపీటవేసింది. "ఉద్యోగాలు కావాలనుకునేవారికి బదులు, ఉద్యోగావకాశాలు కల్పించే వారిని తయారు చేయడమే జి.ఇ.ఎస్ సదస్సు ముఖ్యలక్ష్యం" అని నీతీ ఆయోగ్ సారధి అమితాబ్ కాంత్ సృష్టీకరించారు. ఈస్ఫూర్తి కి భారత్‌లో మహిళ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల అభివృద్ధికి మహిళ బ్యాంకులను గ్రామీణ ప్రాంతాలలో ఏర్పటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయక తోడ్పాటు చురుగ్గా సాకరమయ్యేలా మరెందరో మహిళలు ఉపాధి పొందాలనే సంకల్పంతో ముందడుగు వేయాలని కోరు కుంటున్నారు.

## ప్రోత్సాహం అందిచడం :–

భారత ఆర్థిక వ్యవస్థ శీఘ్ర పురోభివృద్ధి కోసం మహిళ పారిశ్రామిక వేత్తలకు సులభతర వాణిజ్య నిర్వహణ సూచిలోదేశాన్ని మెరుగైన స్దానంలో నిలపడం, సృజనాత్మక ఆలోచనలతో స్వశక్తితో విజయబావుటా ఎగురువేస్తూ ముందుకు నడుస్తున్న నిజమైన ఔత్సహికవేత్తలకు సంక్లిష్ట నియమ నిబంధనల ఆటంకాలు తొలగి ఔత్సహిక వాతావరణాన్ని నెలకొల్పడం, పరిశ్రమలకు మునుపెన్నడు లేని స్థాయిలో ప్రోత్సాహం అందించడం, మహిళా సాధికారత

వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు, శ్రీ రామక్రిష్ణ డిగ్రీ కళాశాల (అటానమస్) నంద్యాల.
E-mail : pullaiahapril20@gmail.com

అభివృద్ధికి గ్రామీణ ప్రాంతాలలో అట్టడుగున ఉన్న మహిళలకు కుడా ప్రోత్సాహం, మోదీ ప్రభుత్వం తీసువచ్చిన గణనీయమైన మార్పులు. మనదేశంలో మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు, ఆకర్షణీయ పథకాలను ప్రకటించడంలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, గోవా, గుజరాత్, రాజస్థాన్, జమ్ము & కశ్మీర్ రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి. భారత్‌లో రాష్ట్రల వారీగా చూపుతున్న చొరవను జాతీయ స్థాయిలో సమన్వయం చేస్తే అంకుర పరిశ్రమలకు మేధాశక్తి గల మానవ వనరులు, ఉపాధి కల్పనకు, తద్వారా పారిశ్రామిక మహిళ బ్యాంకు ప్రారంభానికీ మార్గం సుగమం అవుతుంది.

## సామాజిక కట్టుబాట్లను అధిగమిస్తూ

మహిళలకు తొలి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారానే సౌభాగాన్ని పెంపొందించడం మహిళా సాదికారత సాధ్యమవుతుంది. మహిళా పారిశ్రామిక మానవ వనరులే కీలక పెట్టుబడి. ఔత్సాహికవేత్తలు పెరిగే కొద్దీ దేశ ఆర్దికాభివృద్ధి ప్రగతిబాటలో విస్తరిస్తుంది. జాతీయ ఆదాయం, గ్రామీణాభివృద్ధి, పారిశ్రామికీకరణ, సాంకేతిక పురోగతి ఎగుమతులకు అభివృద్ధి సాధ్యమవుతాయి. మహిళలను సాదికారత భాట పట్టించడం ద్వారానే సమున్నత దేశాన్ని ఆవిష్కరించగలం.

మహిళల ఆలోచనశక్తి, విలువలపట్ల వారి నిబద్ధత మహోన్నత కుటుంబ వ్యవస్థకు తోడ్పడుతున్నది. కుటుంబ వ్యవస్థ సహకారం అందించినపుడే సుస్థిర సమాజం, అద్భుతమైన దేశం సాధ్యమవుతాయి. మన భారతదేశంలో మహిళల ఆచారాలు, కట్టుబాట్లు, కులమత, ఆచారాలు మహిళా పారిశ్రామికవేత్తల అభివృద్ధిని అడ్డుకుంటున్నాయి ఇంతే కాకుండా అధునిక విద్య, పెట్టుబడి, ఐటి, మార్కెట్ అందుబాటులో లేకపోవడం మన దేశంలో అతిపెద్ద సమస్యలు. మహిళలను ఔత్సాహిక వేత్తలుగా తీర్చిదిద్దడంపై శ్రద్ధ పెట్టడం లేదు. సమర్ధ పారిశ్రామిక వేత్తలను ఆవిష్కరించడానికి తగిన నైపుణ్యాలు, మౌలిక సదుపాయాలు ఉండి కుడా పారిశ్రామి కంగా భారత్ వెనకే మిగిలిపోవడానికి చాలా కారణాలు ఉన్నాయి. సొంతంగా వాణిజ్య సేవారంగంలో ప్రవేశించి, చొరవ చూపుతున్న ప్రోత్సాహం భారతీయ మహిళలకు కరవు అవుతోంది. అందుకు మన విద్యా విధానంలోని లోపలే కారణం. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వాలు, పారిశ్రామిక వేత్తలు, సామాజిక కార్యకర్తలు మరియు ఉపాధ్యాయులు వారి స్థాయిలో వారు, వారి అనుభవం, నైపుణ్యంతో తోడ్పడాలి. ఇందులో ముఖ్యంగా పాఠశాల నుంచి యూనివర్సిటీ దశ వరకు విద్యార్థులకు తెలివిగా ఆలోచించడం అందులో అవగాహనతో నేర్పించడంతో పాటు సాంకేతిక, శాస్త్ర విజ్ఞాన పరిశోధనల వైపు మళ్లించడానికి కృషి చేయాలి. సృజనాత్మక ఆలోచనలతో వివిధ రంగాలను కొత్త బాటలో నడిపించగల వారికి తగిన గుర్తింపు, ప్రోత్సాహకాలు ఇచ్చే వ్యవస్థలు అంటే మహిళా బ్యాంకు (అభివృద్ధి)లను ఏర్పాటు చేస్తే దేశంలో అంకుర కంపేనీల వ్యవస్థ (స్టార్టప్ ఎకోసిస్టమ్) అభివృద్ధి చెందుతుంది.

## వెనుకంజలో ఉన్న భారత్

ప్రతి కంపెనీలో 40 శాతం మంది మహిళ డైరెక్టర్లు ఉండాలన్న నిబంధనలు ఉన్నా అమలు కావడం లేదు. పాశ్చాత్య దేశాలలో మాహిళలు ఉన్నత స్థాన్నాల్లో ప్రాధాన్యం పెరుగుతుంది. అయితే భారతదేశంలో సామాజిక కట్టుబాట్లు, ఆచారాలు కారణంగా మహిళల పారిశ్రామిక వేత్తల సంఖ్య ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయడంలేదు. భారతదేశంలో ఇప్పటికీ 10 శాతం దాటలేదు మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లను, నూతన టెక్నాలజీ పరిజ్ఞానం (సాంకేతిక), పెట్టుబడి, మార్కెటింగ్ పట్ల సరైన అవగాహన లేకపోవడం కారణంగానే భారతీయ మహిళాభివృద్ధి పథంలో వెనుకంజలో నిలిచింది. అవగాహన లేకపోవడం ముఖ్యంగా బ్యాంకర్ల తీరు తీవ్రనిరాశ కలిగిస్తుంది. పరిశ్రమ (సుక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు) స్థాపనవైపు అడుగులు వేస్తున్న ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు వాణిజ్య బ్యాంకులు తగిన సహకారం అందించకుండ నిర్లక్ష్య వైఖరితో కళ్ళు కాయలు కాచే విధంగా వేచి చూడాల్సివస్తున్నది. ప్రధాని మంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ క్రింద సుక్ష్మ, చిన్న తరహ పరిశ్రమల స్థాపనతో అభివృద్ధి పొందాలనుకునే వారికి ఇండస్ట్రియల్ ప్రమేషన్ కమిటీ ఆమోదం తెలిపి తగిన ప్రోత్సాహం అందిస్తూంది. కమిటీ ఆమోదం తెలిపినా, బ్యాంకర్లు అనేక కారణాలతో ఔత్సాహికులను నిరుత్సాహ పరుస్తున్నారు (సహకరించడంలేదు). ఈ సమస్య పరిష్కారానికి సోదర, సోదరీమణులు సలహాలు ఇచ్చి పుచ్చుకొని సహకరించుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులో ఉంచి, విద్యా, పోష్టికాహారం, ఆరోగ్యం, పారిశ్రామిక మౌలిక సదుపాయాలపై ప్రభుత్వాలు, సంస్థలు ప్రత్యేక విధానంతో ముందుకు వెళ్ళినపుడే మన దేశం ఆర్థికంగా ముందువరుసలో చేరే అవకాశం ఉంటుంది.

## ఉపాధి కల్పనకు కృషి

ప్రపంచ పారిశ్రామిక వేత్తల సదస్సు లో భారత ప్రదాని నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ బారతదేశ వృద్ధి ప్రస్థానంలో పారిశ్రామిక వేత్తలు అందరు భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. స్వీయ అస్థిత్వాన్ని నిరూపించుకొని ఆత్మవిశ్వాసం తో ఎదిగేందుకు నేటి మహిళ శ్రమిస్తున్నది. తనను తాను పునరావిష్కరించుకొని, సంపూర్ణ వ్యక్తిత్వంతో వికసించేందుకు నారీలోకం ఇవాళ అసాధారణ పోరాటం చేయాలనీ ఇవాంక ట్రంపు పిలుపునిచ్చారు.

మహిళ ముందడుగేస్తేనే కుటుంబం పురోగమిస్తుంది. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ పథకాన్ని ప్రవేశపెట్టినా సద్వినియోగం చేసుకుంటేనే సాధికారత సాధించవచ్చు. మహిళ పారిశ్రామిక వేత్తలు ఉత్పత్తి, వర్తక మరియు సేవారంగాలను ఎంతో ప్రగతిపథంలో నడిపిస్తూ ఉపాది అవకాశాలు కల్పించడం, కొత్త ఆవిష్కరణలు తదితర అంశాలపై దృష్టి సారించాలి. ఇందుకు ఆదర్శం హైదరాబాద్‌లోని



ఐటి హబ్. అద్భుతంగా పని చేస్తూ దేశానికి వన్నే తెస్తున్నది. మహిళలు వ్యాపార రంగంలో అనేక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు.

### మహిళ పారిశ్రామిక వేత్తలు రాణిస్తున్న రంగాలు

1 జనపనార , 2 గార్మెంట్ & టెక్స్ టైల్స్, 3 మూలికలు, కుంకుడు, న్యాచురల్ హెర్బల్ షాంపు, 4 టైలరింగ్, 5 ఆక్వాసాగు, 6 నర్సరీలు, 7 ఆహార పదార్థాల తయారీ 8 లెదర్ ఉత్పత్తులు, 9 బ్యాంకింగ్, 10 సహకార సంస్థలు 11 పాల ఉత్పత్తులు, 12 విద్యా రంగం 13 వైద్య రంగం, 14 టెలికం పరికరాలు, 15 డ్రగ్స్ మరియు ఫార్మస్యూటికల్స్.

### వనితల భాగస్వామ్యం పెరగాలి

దేశ ఆర్థిక వ్యవస్థ మరింత సమర్థంగా రూపుదిద్దుకోవాలంటే పనిచేసే వారిలో మహిళల భాగస్వామ్యం పెరగాలి. గత 25 సం॥లలో ఈ వాటా 31 నుంచి 18 శాతానికి పడిపోవడంపై దృష్టి పెట్టాలి. మహిళ వ్యాపారాలకు పెట్టుబడులు అధికంగా ఉంటే, ఉత్పాదకత సాధించగలరు.

డిజిటల్ సాంకేతికత ఆగమనంతో ప్రపంచ వ్యాప్తంగా చిన్న స్థాయి వ్యాపారాలకు ద్వారాలు తెరుచుకున్నాయి. డిజిటల్ మార్కెటింగ్ అనేది చిన్నపాటి పెటుబడులతో ప్రారంభమైన సంస్థలకు మంచి ప్రచారసాధనం. భారత ప్రభుత్వం యువజనానికి స్ఫూర్తిని కొనసాగించా లంటే మహిళ గ్రామీణలకు సంఘటిత, అసంఘటిత రంగంలో వారికి స్ఫూర్తితో తగిన మూలధనం, అంకుర పరిశ్రమల ఏర్పాటు, ముడిసరుకు లభ్యం, యంత్ర సామగ్రి మరియు ఇతర ఆర్థిక సేవలను మేరుగువరుచుకోవడానికి (మహిళ అభివృద్ధి గ్రామీణ బ్యాంకును విస్తరించవల్సిన అవసరం ఉన్నది) వనితల భాగస్వామ్యం పెరిగి అభివృద్ధికి పాటుపడాలి.

### స్త్రీ, పురుష భేదం తగ్గాలి

మహిళలకు సమాన హక్కులు, పురుషులతో సమానమైన వాటా, వేతనం ఉండాలి. ఇందులోఉన్న సాంస్కృతిక, న్యాయ సవాళ్లను తొలగించేలా ప్రభుత్వ విధానాల్లో మార్పులు రావాలి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా యువతకు అవసరమైన సహకారాన్ని అందించాలి. అమెరికా ప్రభుత్వం 2017 లో పెట్టుబడి నిధి ద్వారా 500 మిలియన్ డాలర్లను అందు బాటులో పెట్టింది. స్టార్టప్ పోటీలు మహిళలకు ఉత్సాహన్ని ఇస్తాయి. పని ప్రదేశాల్లో మహిళ వాటా పెరిగితే ప్రభుత్వలకు మిలియన్ డాలర్లు ఆదాయం వస్తుంది. మహిళలకు నైపుణ్య శిక్షణ, విద్య, వ్యాపార నిర్వహణ కోసం పెట్టిన పెట్టుబడులన్నీ తిరిగి కుటుంబంపై, సమాజంపై పెట్టుబడులుగా మారుతాయి. హైదరాబాద్‌లో జరిగిన ప్రపంచ పారిశ్రామిక వేత్తల శిఖరాగ్ర సదస్సు కొత్త స్ఫూర్తి నింపింది. మహిళ ఉపాధి, ప్రోత్సాహం, అభివృద్ధి, రక్షణ, భద్రత, సాధికారత వంటి అంశాలపై స్త్రీలు, పురుషులకు సమానంగా చర్చించడం ఆశాజనకంగా ఉంది. నూతన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల ఆవిష్కరణల్లో మహిళల వాటా పెంచేందుకు ఆర్థిక, సామాజిక ప్రోత్సాహనికి తగిన కార్యాచరణ రూపోందించి అమలు చేయాలి.

అంతర్జాతీయ వాణిజ్యాన్ని మహిళలు నడుపుతున్న వ్యాపారాలతో అనుసంధానించాలి. అంకుర సంస్థల్లో ఉపాధి అవకాశాలు, సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణితం సేవ వంటి రంగాలలో మరింత ప్రగతి సాధించేందుకు తగిన చర్యలు తీసుకోవాలి. ఆర్థిక వృద్ధిలో మహిళల పాత్ర గణనీయంగా ఉన్న వాస్తవాన్ని గుర్తించి పట్టణ, గ్రామీణ ప్రాంతలలో స్త్రీ, పురుషుల భేదం తగ్గిస్తే సంపూర్ణ సాధికారత లభిస్తుంది.

### దేశంలోని చిన్న పరిశ్రమలవివరాలు

| | |
|---|---|
| మొత్తం పరిశ్రమలు | 3.62 కోట్లు |
| గ్రామీణ ప్రాంతల్లో | 2.08 కోట్లు |
| మహిళల ఆధ్వర్యంలో పరిశ్రమలు | 26.41 లక్షలు (7.36) |
| ఉపాధి | 8.05 కోట్లు |

■

యోజన
ప్రగతిపథంలో భారతదేశం
జూన్, 2018 సంచిక

ఆహారం

# పౌష్టికాహారలోప వ్యాధులు - నివారణ చర్యలు

- డా.కె. ప్రసాద్



**ఒక మనిషి సంపూర్ణ ఆరోగ్యంతో జీవిస్తున్నాడు. అంటే వ్యాధులకు జబ్బులకు గురి కాకుండా ఉండటమే కాదు, అలసట లేకుండా రోజుకు 8 గంటలు చురుకుగా పని చేయగలిగి శారీరకంగా మానసికంగా స్వస్థత కలిగి ఉండటం. ప్రకృతిలో ఎన్నోరకాల ఆహార పదార్థాలు మనకు లభిస్తాయి. శరీరానికి కావలసిన పోషకాలు సమృద్ధిగా ఉన్న ఆహార పదార్థాలను ఎంపిక చేసుకొని ఆహారంలో ప్రతి రోజు చేర్చటం ద్వారా మనం సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చు పోషక ఆహార ఎంపికకు ప్రతి ఒక్కరూ ఆహారంపై సరియైన అవగాహన కలిగి ఉండాలి.**

ఒక వ్యక్తి ఆరోగ్యం లేదా అనారోగ్యం అనేది వారి వ్యక్తిగత విషయం మాత్రమే కాదు, కుటుంబం, సమాజానికి కూడా సంబంధించి నది. వ్యక్తులందరూ శారీరక మానసిక ఆరోగ్యాలతో ఉంటేనే సమాజం కూడా అభివృద్ధి చెందుతుంది.

ఆధునిక శాస్త్రం, మెరుగైన వైద్య సౌకర్యాల వల్ల నిస్సందేహంగా సగటు జీవిత కాలం పెరిగింది. అందుకే ప్రజలు మునుపటి కాలం కంటే ఎక్కువ రోజులు జీవిస్తున్నారు. ఐతే, ప్రస్తుత జీవన విధానం అనేక సమస్యలకు దారితీస్తున్నది. ఒకప్పుడు అరుదుగా వచ్చే కొన్ని వ్యాధులు ఇప్పుడు అతి సాధారణంగా మారిపోయాయి. ఒకప్పుడు 60 ఏళ్ళు లేదా ఇంకా ఎక్కువ వయస్సు ఉన్న వాళ్ళకు వచ్చే మధుమేహం అధిక రక్త పోటు మరియు గుండె జబ్బు వంటి కొన్ని వ్యాధులు ఇప్పుడు 30-40 ఏళ్ళ మధ్య లేదా ఇంకా చిన్న వయస్సులోనే వస్తున్నాయి. క్రమం తప్పిన భోజన సమయాలు ఆహార అలవాట్లు, పని ఒత్తిడి వ్యాయామం లేకపోవటం ఒకే చోట కూర్చుని పని చేయటం వంటి మారిన జీవన విధానాల వల్ల వచ్చే వ్యాధులను జీవనశైలి వ్యాధులు అంటారు. స్థూలకాయం, ఒత్తిడి, అధిక రక్త పీడనం రక్తంలో అధికంగా కొవ్వు లేదా కొలెస్ట్రాల్ పెరుగుదల మధుమేహం, గుండెవ్యాధి క్యాన్సర్ వంటివి ఈ కోవలోకి వస్తాయి.

- దేశ జనాభాలో 10 శాతం మంది గుండె వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు.
- దేశంలో 10 కోట్ల కంటే ఎక్కువ మందికి అధిక రక్తపోటు ఉంది.
- మనదేశంలో ప్రపంచంలో కెల్లా అధిక సంఖ్యలో మధుమేహ వ్యాధిగ్రస్తులున్నారు.
- వ్యాయామం లేకపోవడం అనేది 35 సం॥ రాల వయస్సు వారిలో 20 శాతం మరణాలకు కారణమవుతున్నాది.
- ఊబకాయం పాఠశాలల పిల్లలలో హెచ్చుగా ఉంది. భారత పట్టణ పాఠశాలలకు 10-20 శాతం పిల్లలు అధిక బరువు లేదా ఊబకాయంతో ఉన్నారు. అందువల్ల వీరికి జీవన శైలి వ్యాధులు వచ్చే ప్రమాదం అధికంగా ఉంది.

**పౌష్టికాహారం ఆవశ్యకత:**

ఆరోగ్యమే మహా భాగ్యం అని మనందరికి తెలుసు. నిత్య జీవితంలో డబ్బు ఎంత అవసరమో ప్రతి మనిషికీ ఆరోగ్యంగా ఉండటానికి మంచి పోషక విలువలున్న ఆహారం కూడా అంతే అవసరం! మనం ప్రతి

విద్యావేత్త, విజయవాడ.
E-mail: prasad_kotu@rediffmail.com

రోజు తీసుకునే వివిధ రకాల ఆహారపదార్థాల ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు అభిస్తాయి. ఆ పోషకాలు మన శరీర ఆరోగ్యంపై ఎంతో ప్రభావాన్ని చూపుతాయి. ఒక మనిషి సంపూర్ణ ఆరోగ్యంతో జీవిస్తున్నాడు. అంటే వ్యాధులకు జబ్బులకు గురి కాకుండా ఉండటమే కాదు, అలసట లేకుండా రోజుకు 8 గంటలు చురుకుగా పని చేయగలిగి శారీరకంగా మానసికంగా స్వస్థత కలిగి ఉండటం. ప్రకృతిలో ఎన్నోరకాల ఆహార పదార్థాలు మనకు లభిస్తాయి. శరీరానికి కావలసిన పోషకాలు సమృద్ధిగా ఉన్న ఆహార పదార్థాలను ఎంపిక చేసుకొని ఆహారంలో ప్రతి రోజు చేర్చటం ద్వారా మనం సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చు పోషక ఆహార ఎంపికకు ప్రతి ఒక్కరూ ఆహారంపై సరియైన అవగాహన కలిగి ఉండాలి. పోషక ఆహారం అనగానే చాలా మంది వ్యయంతో కూడినదని అనుకుంటారు. ఆహారంపై అవగాహన కలిగిఉంటే ఇలాంటి అపోహలు ఉండవు. తక్కువ ఖర్చులో కూడా పౌష్టిక ఆహారం పొందవచ్చు. పౌష్టిక ఆహారం ఈ క్రింది విధంగా నిర్వచింపబడింది.

"శరీరానికి కావలసిన పోషకాలు పిండిపదార్థాలు మాంసకృతులు, కొవ్వులు విటమిన్‌లు ఖనిజ లవణాలు వీటితో పాటు శరీరానికి నీరు కూడా ఎంతో అవసరం. ఈ పోషకాలన్నింటిని తగిన పరిమాణంలో శరీరానికి అందించే ఆహారమే సమతుల ఆహారం లేక సంపూర్ణ ఆహారం" మనిషికి అవసరమైన పోషక పరిమాణాలు వయస్సు లింగబేధం, శారీరక ధర్మం, వ్యక్తి చేసేపని, ఒత్తిడి వీటిని బట్టి మారుతుంటాయి. వీటి కారణాల వల్ల శారీరక అవసరాల కంటే తక్కువ పోషకాలు తీసుకుంటే తక్కువ పోషణకు గురి అయ్యే ప్రమాదం ఉంది. వివిధ ఆహార పదార్థాలను ఎంపిక చేసికొని కావలసిన మోతాదులో మనం రోజు తీసుకునే ఆహారంలో చేర్చాలి.

ఆహార పదార్థాలు వాటిలో ఉండే పోషక పదార్థముల పరిమాణాన్ని బట్టి ఆయా పోషకాలు శరీరంలో నిర్వర్తించే విధులను బట్టి (3) రకములు:

1. శక్తినిచ్చే ఆహారపదార్థములు : ఉదా : బియ్యం, గోధుములు, జొన్నలు, రాగులు, నూనె, క్రొవ్వు పదార్థాలు, దుంపలు, బెల్లం.
2. పెరుగుగలకు ఉపయోగపడే ఆహార పదార్థాలు: ఉదా : పప్పుధాన్యాలు, సోయాచిక్కుళ్ళు, పాలు, మాంసం, గ్రుడ్డు, చేపలు.
3. శరీర రక్షణకు ఉపయోగపడేవి ఉదా : ఆకుకూరలు, పండ్లు

- ఆహారంలో వైవిధ్యం జీవితాన్ని ఆహ్లాద పరచేదే కాకుండా, పోషణ ఆరోగ్యాలకు చాలా ముఖ్యం.
- గింజధాన్యాలు చిరుధాన్యాలు పప్పు ధినుసులు అధిక పోషకాలను కలిగి ఉంటాయి.
- శిశువులు, పిల్లలు స్త్రీల ఆహారంలో నాణ్యమైన మాంసకృతులను కాల్షియం అధికంగా ఉండే పాలను తప్పకుండా చేర్చాలి.
- వంటనూనెలు / వేరుశెనగ చిక్కుడు మొదలగు కాయలు శక్తిని అధికంగా కలిగి ఆహారం యొక్క సాంద్రతను ఎక్కువ చేయడానికి ఉపయోగపడతాయి.

**ఒక రోజుకు ఒక వ్యక్తికి కావలసిన సమతుల ఆహార పరిమాణం గ్రాములలో**

| క్ర. సం. | ఆహార పదార్థాలు | పురుషులు | స్త్రీలు | యుక్త వయస్సువారు | | 7-9 సం॥ లు | 1-3 సం॥ లు |
|---|---|---|---|---|---|---|---|
| | | | | బాలుడు | బాలిక | పిల్లలు | పిల్లలు |
| 1. | గింజ ధాన్యాలు | 400 | 300 | 450 | 300 | 250 | 150 |
| 2. | పప్పుధాన్యాలు | 50 | 40 | 60 | 50 | 40 | 35 |
| 3. | ఆకుకూరలు | 75 | 100 | 100 | 150 | 75 | 50 |
| 4. | ఇతర కూరగాయలు | 75 | 50 | 50 | 100 | 50 | 25 |
| 5. | దుంపలు | 75 | 50 | 75 | 50 | 50 | 10 |
| 6. | పండ్లు | 100 | 100 | 100 | 100 | 100 | 100 |
| 7. | పాలు పాల పదార్థాలు | 200 | 200 | 200 | 200 | 250 | 300 |
| 8. | బెల్లం | 20 | 20 | 20 | 20 | 20 | 15 |
| 9. | నూనె కొవ్వు పదార్థాలు | 20 | 15 | 20 | 20 | 20 | 20 |

**శరీరానికి అవసరమైన పోషక పదార్థాలు:**

1. మాంసకృత్తులు
2. పిండి పదార్థాలు
3. క్రొవ్వు పదార్థాలు
4. విటమిన్‌లు
5. ఖనిజ లవణాలు
6. పీచు పదార్థాలు
7. నీరు; మరియు సూక్ష్మ పోషకాలు.

- జీవించి ఉండటానికి పోషణ ఒక మౌలికమైన అవసరం.
- విటమిన్లు ఖనిజాలు వంటి రక్షక పదార్థాలను కూరగాయలు / పండ్లు అందిస్థాయి.
- గ్రుడ్లు, మాంసపదార్థాలు చేపలను ఆహారంలో చేర్చడం వల్ల మాంసకృత్తులు పెరుగుతాయి. శాఖాహార గింజధాన్యాలు పప్పులు పాలను ఆహారంలో చేర్చడం ద్వారా దాదాపు అన్ని పోషకాలను పొందవచ్చు.

**పిల్లలకు పౌష్టికాహార లోపం వల్ల వచ్చే వ్యాధులు:**

సాధారణంగా బిడ్డకు నెల రోజుల నుండి 5 సంll లు వయస్సు వరకు అనేక వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. వీటి వల్ల పిల్లలు మరణాల సంఖ్య ఎక్కువగా ఉంది. పిలల్లో సాధారణంగా వచ్చే వ్యాధులు (4) రకములు:

1. డయేరియా
2. శ్వాసకోశ వ్యాధులు
3. వ్యాధి నిరోధక టీకాలు ద్వారా నిరోధించగల వ్యాధులు
4. పోషక ఆహార లోపం వల్ల వచ్చే వ్యాధులు

పౌష్టిక ఆహార లోపం వల్ల మరాస్మస్, క్వాషియార్కర్, రక్తహీనత, విటమిన్-ఎ లోపం వల్ల వచ్చే అంధత్వం, పొంగు, ఆటలమ్మ మొదలైన అంటువ్యాధులు బారినపడతారు. మరియు గాయాలు ఆలస్యంగా నయం కావటం, బలహీనమైన ఎముకలు (రికెట్స్) మొదలగునవి. ఇవే కాకుండా క్షయ, ధనుర్వాతం పోలియో కోరింత దగ్గు మొదలగునవి ఇతర కారణాలవల్ల వస్తాయి. **భారతదేశంలో ప్రతి ముగ్గురిలో ఒకరు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు.** దీనికి ఈ క్రింది కారణాలు ముఖ్యమైనవి.

1. విటమిన్‌లు, పిండిపదార్థాలు, మాంస కృత్తులు ఎక్కువ లేని ఆహారం.
2. కొన్ని అంటు వ్యాధులు నులి పురుగులు, ఇతర వ్యాధుల వల్ల అరుగుదల సరిగా లేక పోవడం.
3. చెడు ఆహారపు అలవాట్లు సమయానికి తినకపోవడం భోజనాన్ని తినకుండా దాట వేయడం, తగినన్ని కూరగాయలు మరియు పండ్లు తినకపోవడం.

**మరాన్‌మస్:**

పిల్లలకు చాలి చాలని ఆహారం ఇవ్వటం వల్ల శరీరానికి తగినంత శక్తి లభించలేకపోవడం వల్ల బరువు తగ్గడం చురుకుగా తిరగలేకపోవడం, శక్తి లోపించినప్పుడు మరాన్‌మస్ అనే వ్యాధికి పిల్లలు గురౌతారు. ఈ వ్యాదికి గురైన పిల్లలు కాళ్ళు చేతులు సన్నగా ఉండి పొట్ట లావుగా ఉంటుంది. మరియు వ్యాధి నిరోధక శక్తి సన్నగిల్లుతుంది. తరచూ అంటు వ్యాధులకు గురై విరోచనాలతో బాధపడుతుంటారు.

ఎప్పుడు ఏడుస్తూ ఉంటారు. తల వెంట్రుకలు రాగి రంగుతో ఉండి పట్టుకుంటే ఊడి వచ్చే విధంగా ఉంటాయి. ఈ వ్యాధికి గురైన పిల్లలు ఎముకలు గూడులాగా ఉంటారు. మరియు నిర్జీవంగా కనిపిస్తారు.

**క్వాషియార్కర్:**

చిన్న పిల్లల ఆహారంలో మాంసకృత్తులు లోపించినప్పుడు ఉబ్బు వ్యాధి లేదా క్వాషియార్కర్ అనే జబ్బు వస్తుంది. ఈ వ్యాధిలో బాధపడుతున్న పిల్లల బుగ్గలు ఉబ్బుగా ఉండి ముఖం గుండ్రంగా కనపడుతుంది. తల్లులు తమ పిల్లలు చాలా బొద్దుగా ఆరోగ్యంగా ఉన్నారని అపోహ పడి తగిన జాగ్రత్తలు తీసుకోరు. ఇది మరో అనారోగ్యానికి దారి తీస్తుంది. తలవెంట్రుకలు ఎర్రబడటం రక్తం లేక పాలి పోవడం, ఆకలి మందగించడం, విరోచనాలు వంటివి సాధారణంగా కనిపించే లక్షణాలు. ఈ వ్యాధితో బాధపడే పిల్లలు తమ పరిసరాలపై ఆసక్తి చూపరు. ఎప్పుడు ఏడుస్తూ విచారంగా ఉంటారు. వ్యాధి ముదిరే కొద్ది కాళ్ళకు చేతులలో నీరు చేరి ఉబ్బుగా ఉంటాయి. పాదంపై వేలిలో వత్తితే గుంటపడటం మనం గమనించవచ్చు. ఆహారంలో మాంసకృత్తుల లోపం తీవ్రమైన కొలది చర్మం చిట్టి పగుళ్ళు నుండి నీరు రక్తం కారడం గమనించవచ్చు.

ఆహారంలో ఏ విటమిన్ లోపించడం వల్ల మన దేశంలో చాలా మంది పిల్లలు రేచీకటి / అంధత్వానికి గురి అవుతున్నారు. దీనికి ముఖ్య కారణం శిశువు గర్భంలో ఉన్నప్పుడు తల్లి ఆహారంలో విటమిన్-ఎ తక్కువ ఉండటం వల్ల పాలిచ్చే తల్లి విటమిన్-ఎ ఉన్న ఆహారపదార్థాలు తగినంత తినకపోవడం వల్ల చిన్న వయస్సులో పిల్లలకు విటమిన్ 'ఎ' ఉన్న అనుబంధ ఆహారం ఇవ్వకపోవడం వల్ల అంధత్వానికి గురి అవుతున్నారు.

విటమిన్-ఏ లోపించినప్పుడు కంటిలోని తెల్లగుడ్డుపై పొర దాని మెరుపును కోల్పోతుంది. 1-5 ఏళ్ళ పిల్లలలో కంటిలోని తెల్ల గ్రుడ్డుపై నురుగులాంటి మట్టి రంగు మచ్చలు ఏర్పడి రేచీకటితో బాధపడతారు. అంటే వీరికి మసక చీకటిలో కనిపించదు. రేచీకటిని అశ్రద్ధ చేస్తే కంటిపై తెల్లని పొరలోపిస్తుంది. అది కూడా తల్లి అశ్రద్ధ చేస్తే కన్ను గుడ్డు పూర్తిగా దెబ్బతిని శాశ్వతమైన గుడ్డితనం వస్తుంది.

ఆహారంలో థయమిన్ లోపించినప్పుడు బెరి బెరి అనే వ్యాధి వస్తుంది. తల్లుల ఆహారంలో ఇది లోపించినప్పుడు పుట్టిన బిడ్డలలో కూడా ఈ పోషక లోపం కలుగుతుంది. ఈ వ్యాధిలో ఆకలి మందగించడం, జీర్ణక్రియ సక్రమంగా జరుగకపోవడం జరుగుతుంది.

విటమిన్-డి లోపం వల్ల పిల్లలకు రికెట్స్ అనే వ్యాధి వస్తుంది. ఎముకలు పెరగడానికి పటిష్టతకు కాల్షియం శరీరంలో సరిగా ఉపయోగపడటానికి విటమిన్-డి ఎంతో అవసరం కాళ్ళు నిటారుగా ఉండవు. ప్రక్కలకు వంగి పోయి మోకాళ్ళు ఒక దాని కొకటి కొట్టుకోవడం మణి కట్టు ఎముక వచ్చినట్లు ఉబ్బేత్తుగా ఉండటం రికెట్స్ లక్షణాలు తినే ఆహారంలో ఇనుము లోపించిన రక్త హీనత కలుగుతుంది. ముఖ్యంగా పిల్లలు స్త్రీలు అధికంగా రక్తహీనతతో బాధపడుతున్నారు. గర్భిణీ స్త్రీలకు ఆహారంలో ఇనుము లోపిస్తే రక్త హీనత వస్తుంది. దీని వల్ల తల్లికి బిడ్డకు అపాయం.

దీర్ఘకాలిక మలేరియా వ్యాధి వల్ల కొంకె పురుగులు ఇతర నులిపురుగులు కడుపులో చేరడం వల్ల అన్నివయస్సుల వారికి రక్త హీనత వస్తుంది. ఫోలిక్‌ఆమ్లము. విటమిన్ బి-12, మాంసకృత్తులు, విటమిన్-సి లోపం వల్ల రక్తహీనత వస్తుంది.

**థైరాయిడ్ హార్మోన్లు ఉత్పత్తికి అయోడిన్ అవసరం.**

మన శరీరానికి అవసరమైన అయోడిన్ మన అయోడైజడ్ ఉప్పు నుండి లభిస్తుంది.

శరీరం ఎదగడానికి మెదడు వృద్ధి చెందడానికి మరియు జ్ఞాపకశక్తిని పెంపొందించడానికి అయోడిన్ ఉపయోగపడుతుంది. మెదడులోని థైరాయిడ్ గ్రంధి వాపు గ్రాయిటర్ శరీరం ఎదుగుదల ఆగిపోవడం బుద్ధి మందగించడం వంటివి అయోడిన్ లోపం వల్ల వచ్చేవి.

**చిన్న పిల్లల పౌష్టికత్వానికి ఇవ్వవలసిన అదనపు ఆహారం:**

తల్లిపాలు పిల్లలకు చాలా శ్రేష్టమైన ఆహారం. అయినప్పటికి 4-6 నెలలు వచ్చాక బిడ్డకు తల్లిపాలు మాత్రమే చాలవు - ఒక్కొక్క సారి ఎక్కువ వ్యవధి లేకుండా తల్లి తిరిగి గర్భవతి కావడం వల్ల కూడా బిడ్డకు పోషక అవసరాలు సరిగా అందవు. తల్లి పాల ద్వారా అధికంగా లభించని కొన్ని పోషక పదార్థాలు అనగా ఎముకలు బలంగా పెరగడానికి పళ్ళు గట్టిపడటానికి రక్తవృద్ధికి శక్తికి కావలసిన పదార్థాలు బిడ్డకు ఆరునెలలు తరువాత మరి ముఖ్యంగా అవసరమగుతాయి. పిల్లలకు తగినంత ఆహారం ఇవ్వనందున బిడ్డ శరీరానికి కావలసిన శక్తి లోపించి శరీరంలోని మాంసకృత్తులు శక్తి కొరకు వినియోగించ బడతాయి. ఎముకలు సరిగా పెరగవు. రక రకాల సూక్ష్మ పోషకాల లోపం వల్ల వచ్చే జబ్బులకు గురి అవుతారు. అందువల్ల చంటి పిల్లలకు తల్లిపాలతోపాటు ఇతర ఆహార పదార్థాలు ఇస్తే పెరుగుదల చక్కగా ఉంటుంది.

శిశువుకు తల్లిపాలకు తోడుగా తగినంత పోషక పదార్ధములను ఇచ్చే ఆహారాన్ని అనుబంధ ఆహారం అంటారు. అనేక ఆహార పదార్ధములను జీర్ణించుకోగల శక్తి బిడ్డకు ఆరు నెలల నుండి ఏర్పడుతుంది. చిన్నప్పటి నుండి బిడ్డకు మంచి ఆహారపు అలవాట్లు ఏర్పడతాయి. కాబట్టి సరియైన అనుబంధ ఆహారాన్ని ఎంపిక చేసి బిడ్డకు అలవాటు చేయడం చాలా అవసరం.

**చంటి పిల్లలకు పెట్టదగిన అనుబంధ ఆహారము:**

**పిల్లలకు పాలతో పాటు ఇచ్చే అనుబంధ ఆహారమును (3) రకములుగా విభజించవచ్చు.**

1. ద్రవాహారము, పండ్లరసాలు, కూరగాయల సూప్, గెదెల, ఆవులపాలు.
2. గుజ్జుగా చేసిన ఘనాహారము - రవ్వ / జొన్న పిండి / రాగిపిండి బియ్యపు పిండితో చేసిన గుజ్జు పదార్థాలు.
3. ఘనాహారము - కిచిడి / ఇడ్లీ

మొలికెత్తిన గింజధాన్యాల పిండిలో ఆల్ఫా ఎమైలేజ్ అనే ఎంజైమ్ ఎక్కువగా ఉంటుంది. వీటిని ఎమైలేజ్ రిచ్‌ఫుడ్స్ అంటారు. ఈ రకమైన ఆహారపదార్థాలు, గింజధాన్యాలను ఆధారంగా చేసుకొని ఇంట్లో సులభంగా తయారు చేసుకోవడానికి అవకాశం ఉంది.

మాములుగా వాడే ఆహార పదార్థాలను ఉపయోగించి తక్కువ ఖర్చుతో ఇంటి దగ్గర శిశువులకు అదనపు ఆహారాన్ని తయారు చేయవచ్చు. వాటి తయారీలో బియ్యం గోధుమ, రాగులు, జొన్నలు, సజ్జలు వంటి తృణ ధాన్యాలు, పప్పు దినుసులు వేరుశెనగ, నువ్వులు వంటి నూనె గింజలు చక్కెర, బెల్లం వంటి వాటిని ఉపయోగించుకోవచ్చు. ఇలాంటి ఆహార పదార్థాలను పోషణతో బాధపడే పిల్లలతో సహా అందరు శిశువులు సులభంగా జీర్ణం చేసుకుంటారు.

**"చిన్న పిల్లలకు పౌష్టిక ఆహారలోపం - కలుగకుండా తీసుకొనవలసిన చర్యలు" :**

- 1 నుండి 4 సం॥ రాల వయస్సులో పిల్లలు శారీరకంగా మానసికంగా త్వరగా ఎదుగుతారు. వారు ధృడంగా పెరిగేందుకు తగినంత శక్తి కలిగేందుకు ప్రుష్టికరమైన ఆహారం చాలా అవసరం.
- పొంగు ఆటలమ్మ మొదలైన జబ్బులు రాకుండా నిరోగించుకొగల శక్తిని పొందడానికీ వారికి సమీకృత ఆహారం ఇవ్వాలి.
- బిడ్డకు 6 నెలలు వయస్సు వరకు వారి ఎదుగుదలకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి.
- మొదటి నెలలో బిడ్డకు ఏ విధమైనటువంటి అంటు వ్యాధులు రాకుండా సమగ్ర టీకీకరణ చేయించాలి.
- పెరిగే పిల్లలకు ఎలాంటి ఆహారం అవసరమో గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలి.
- అపరి శుభ్రమైన వాతావరణం లేకుండా చూసుకోవాలి.
- అంటు వ్యాధులు రాకుండా సరైన జాగ్రత్తలు తీసుకోవాలి.
- మాంసకృత్తులు అధికంగా ఉండే గ్రుడ్లు మినుమలు, మొలకెత్తిన ధాన్యాలు మరియు పాలు పిల్లలకు అందించాలి.
- పీచు పదార్థాలు అధికంగా ఉండే చిరు ధాన్యాలను ఆహారం విరివిగా ఉపయోగించాలి.
- నారింజ, ద్రాక్షా, మామిడి, అరటి, ఆపిల్ వంటి జ్యూస్‌లను పిల్లలకు అందించాలి.
- ఆహారం తక్కువ మోతాదులో రోజుకు ఎక్కువ సార్లు తినిపించాలి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పోషక ఆహారాన్ని అభివృద్ధి ప్రాధాన్యతగా గుర్తించింది. 2016 లో "రాష్ట్ర మిషన్ ఫర్ న్యూట్రీషన్‌ను" ప్రారంభించింది. ఇది మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా అమలు చేయబడుతున్నది. ఈ మిషన్ ముఖ్యంగా లక్షలాది మంది పిల్లలలో పోషకాహార లోపాన్ని నిర్మూలించడానికి కృషి చేస్తున్నది.

ప్రతి ఏడాది సెప్టెంబరు మొదటి వారంలో పోషకాహార వారోత్సవాలను జరుపుకుంటున్నారు. చాలా మందిలో సమతుల ఆహార అవగాహన ఏర్పడటం లేదు. అందుకని ప్రతి ఒక్క మహిళ / స్త్రీ / పురుషుడుకాని పౌష్టిక ఆహారం గురించి తెలుసుకొని ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించినప్పుడు మన పిల్లలు పోషకాహార లోపం లేకుండా ఉన్నప్పుడు మన దేశం మంచి ఆరోగ్యకరమైన దేశంగా అభివృద్ధి చెందుతుంది. ■

**మోదీ పాలన - అంకెల్లో సత్యాలు:**




* ఇంకా విద్యుదీకరణ జరగని గ్రామాలు 2014 నాటికి 18452. 2017 నాటికి 3,937.
* నూతన ఎల్‌పిజి కనెక్షన్లు 2004-2014 మధ్య 5.3 కోట్లు. 2014-17 మధ్య 6.95 కోట్లు.
* దేశంలో ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ 2014 నాటికి రూ. 11,198 కోట్లు. 2017 నాటికి రూ. 1,43,000/- కోట్లు.
* చరవాణి ద్వారా బ్యాంకింగ్ 2013-14 నాటికి 94.7 మిలియన్లమంది. 2017 నాటికి 722.2 మిలియన్ల మంది.
* పారిశుధ్య విస్తరణ 2014 నాటికి 42%. 2017 నాటికి 64%.
* ప్రపంచ బ్యాంక్ వారి వ్యాపార సులువు స్థాయి 2014-15 నాటికి 142. 2016 నాటికి 130.
* ప్రపంచ స్థాయిలో పర్యాటక వెసులుబాటు స్థాయి 2014 నాటికి 65. 2017 నాటికి 40.
* సౌర విద్యుత్ ఉత్పత్తి 2014 నాటికి 2,621 మెగా వాట్లు. 2017 నాటికి 12,277 మెగా వాట్లు.
* ఆప్టికల్ ఫైబర్ నెట్వర్క్ గ్రామీణ ప్రాంతాలతో సహా 2013-14 నాటికి 358 కిలోమీటర్లు. 2017 నాటికి 2,05,404 కిలోమీటర్లు.
* గ్రామీణ రోడ్ల నిర్మాణం 2011-2014 సంవత్సరాలలో 81,095 కిలోమీటర్లు. 2014-2017 ల కాలానికి 1,20,233 కిలోమీటర్లు.
* బొగ్గు ఉత్పత్తి 2013-14 నాటికి 462 మిలియన్ టన్నులు. 2016-17 నాటికి 554 మిలియన్ టన్నులు.
* నూతన మరుగుదొడ్ల నిర్మాణం 2013-14 లో 49.76 లక్షలు. 2016-17 నాటికి 2.09 కోట్లు.
* విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 2014లో 24.2 మిలియన్ అమెరికన్ డాలర్లు. 2017 లో 56.3 మిలియన్ అమెరికన్ డాలర్లు.
* స్థూల దేశీయోత్పత్తిలో వృద్ధి 2014 లో 6.6 శాతం ఉంటే, అది 2017 నాటికి 5.7 శాతానికి పెరిగింది.
* ఆర్థిక లోటు 2013-14లో 4.6 శాతంగా ఉంటే, అది 2017 నాటికి 3.2 శాతానికి తగ్గింది.
* ద్రవ్యోల్బణం 2014 లో 11 శాతం ఉంటే, 2017 నాటికి 04 శాతానికి తగ్గింది.
* అన్నిటికన్నా మిన్నగా ఇంతవరకూ ప్రభుత్వంలో ఒక్క స్కామ్ కూడా రికార్డు కాలేదు (జరగలేదు). అభివృద్ధి అంటే ఇది కాక మరేమిటి? ■




**ఏప్రిల్ 8, 2018న ప్రారంభమైన లండన్ పుస్తక ప్రదర్శనలో మన ప్రచురణల విభాగం**

## మీకు తెలుసా?

### మాతా - నవజాత శిశువుల రక్షణకు భాగస్వామ్యం

మాతా-నవజాత శిశువుల ఆరోగ్య పరిరక్షణకు ప్రపంచ వ్యాప్తంగా 77 దేశాలలోని వెయ్యికిపైగా సంస్థలు చేతులు కలిపాయి. ఈ బృహత్ కార్యక్రమాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ పర్యవేక్షిస్తున్నది. మాతా; నవజాత శిశు; పిల్లలు-కిశోర బాలికల అకాల మృత్యువును నివారించడానికి, అన్ని సంస్థలు తమ ప్రణాళికలను, మార్గసూచీలను, వనరులను సమీకరించి, ఉమ్మడి కృషితో లక్ష్యాల సాధనకు ప్రపంచ ఆరోగ్య సంస్థ సహాయపడుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా, పునరుత్పాదక; ప్రసూతి, నవజాత శిశు, బాలల ఆరోగ్యం వంటి అంశాల అమలు కేంద్రాలను 10 దేశాలలో ఏర్పాటు చేశారు. భాగస్వామ్య దేశాలు; దాతలు; అంతర్ ప్రభుత్వ సంస్థలు; ప్రభుత్వేతర సంస్థలు; పరిశోధన-శిక్షణ సంస్థలు; కౌమరలు-యువకులు; ఆరోగ్యరంగ నిపుణులు; ప్రైవేటు సంస్థలు; ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థలు; ప్రపంచ స్థాయి ఆర్థిక సహాయ సంస్థలు మొదలైనవి వీటిలో సభ్యులుగా ఉంటాయి. ఈ భాగస్వామ్య ఒప్పందం సెప్టెంబర్, 2015లో అమలులోకి వచ్చింది. నూతన సహస్రాబ్ది లక్ష్యాలు 4 & 5 లలో భాగంగా ఉన్న ఈ అంశాల సాధనకు 80 సంస్థలను ఒకే తాటిపైకి తెచ్చింది.

### పథకం విస్తృతి:

ఎక్కడైతే ప్రతి మహిళా, ప్రతిశిశువు తమ శారీరక-మానసిక ఆరోగ్యానికి కావలసిన ఆవశ్యకాలను గుర్తించి వాటికవసరమైన సామాజిక అవకాశాలను అందిపుచ్చుకుంటాయో అటువంటి ప్రపంచ నిర్మాణం ఈ పథకం లక్ష్యం. యావత్ మానవజాతి మనుగడకే సవాలుగా మారిన సమస్యలను పరిష్కరించి, తల్లులకు- నవజాత శిశువులకు, కాబోయే తల్లులకు, సరైన ఆరోగ్య భద్రతను కల్పించే ఈ పథకం కేవలం సామూహిక కృషితోనే సాధ్యమని మనందరకూ తెలుసు. ఈ భాగస్వామ్యం 2030ని లక్ష్య సాధనకు గడువుగా నిర్దేశించుకుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రసూతి మరణాలను ప్రతి లక్ష ప్రసవాలకు 70, అంతకన్నా తక్కువకు నియంత్రించడం; ప్రతి దేశంలోనూ నవజాత శిశువుల మరణాలను ప్రతి వెయ్యి ప్రసవాలకు, 12, అంతకంటే తక్కువ స్థాయిలో ఉండేటట్లు నియంత్రించడం; ఐదు సంవత్సరాల లోపు శిశువుల మరణాలను కూడా ప్రతి వెయ్యి జననాలకూ 25 కన్నా తక్కువగా ఉండేటట్లు నియంత్రించడం; సార్వజనీన లైంగిక-పునరుత్పాదక ఆరోగ్యంపై అవగాహనను ప్రజలకు అందించడం; ఆధునిక సంతాన నిరోధక సాధనాలతో 75 శాతం కుటుంబ నియంత్రణను సాధించడం మొదలైనవాటిని లక్ష్యాలుగా ఈ భాగస్వామ్యం నిర్దేశించుకుంది.

### సభ్యుల సమన్వయం:

ఇందుకోసం ఏర్పాటైన ప్రపంచ స్థాయి సభ్యదేశాల సమన్వయ సంఘం ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి సమావేశమై, తమ లక్ష్యాల సాధనను పర్యవేక్షిస్తాయి. ఈ లక్ష్య సాధనలో పాల్గొంటున్న ప్రతి వర్గం నుండి ఒక ప్రతినిధి ఈ భాగస్వామ్య సంఘంలో ఉంటాడు. తమతమ దేశాలలో కార్యక్రమ అమలులో ఎదురౌతున్న అనుభవాలను పంచుకుని, భవిష్యత్ అమలును మరింత పదును తేలేలా సమీక్షిస్తారు. ఈ సమావేశాలు ఇప్పటివరకూ టాంజానియాలో 2008 లోనూ; మనదేశంలో 2010 లోనూ; దక్షిణ ఆఫ్రికాలో 2014 లోనూ జరిగాయి. ప్రస్తుతం ఆఫ్రికా ప్రతినిధి ఈ సంఘానికి అధ్యక్షత వహిస్తున్నారు.

### ఇటీవలి కార్యక్రమాలు:

138వ అంతర్ పార్లమెంటరీ సంఘ సమావేశం మార్చ్ 25 నుండి 28 వరకు జెనీవాలో కిశోర బాలల ఆరోగ్యంపై జరిగింది. ఈ సమావేశంలో మన దేశం నుండి కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి. నడ్డా పాల్గొన్నారు. ఈ అంతర్జాతీయ కూటమి తదుపరి అధ్యక్షురాలు, చిలీ మాజీ అధ్యక్షురాలు డా. మిచ్చెల్లే బకెలెట్ ఏప్రిల్ 11 న ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిశారు. తదుపరి సమావేశం ఢిల్లీలో వచ్చే డిసెంబర్ 12-13 తేదీల్లో జరుగుతుంది.

■

Publishing date 30 April 2018
Posting on 2- 3 May 2018
Yojana (Telugu) May 2018

RNI Regd. No 37729/80
Regd. No. H/SD-512/2018-20

# నూతన ప్రచురణలు










**పుస్తకాలు లభించు చోటు :** ప్రచురణల విభాగం - విక్రయకేంద్రం
రూం. నెం. 204, సి.జి.ఒ. టవర్స్, కవాడిగూడ, హైదరాబాద్ - 80.
ఫోన్ 040-27535383, 27544146
E-mail: bmsehyd@gmail.com

Printed & Published by Mrs. Sadhana Rout, Director General and Head on behalf of the Publications Division, Ministry of I & B, Govt. of India.
and Printed at Prakhya Art Printers Pvt. Ltd. 1-8-724/A/31, Vegetable Market Street, Nallakunta, Hyderabad - 500 044. E-mail: print@prakhyaarts.com
and Published at Yojana (Telugu), 205, 2nd Floor, C.G.O. Towers, Kavadiguda, Hyderabad - 500 080. Senior Editor: Vijayakumar Vedagiri, Tel: 040-27546314